Website : www.saisadguruvani.org

'శ్రీ శిరిడీ సాయి శతాబ్ది మహాసమాధి' ప్రత్యేక సంచిక


శ్రీ భరద్వాజ

# సద్గురువాణి

ఏప్రిల్, మే, జూన్ - 2018

సంపుటి - 18

సంచిక - 2



శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

# ఆధ్యాత్మిక-సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - ఉక్కునగరం
## (2018 జనవరి, ఫిబ్రవరి, మార్చి లో నిర్వహించిన కార్యక్రమాలు)




ఈ పేజీ సమర్పించిన వారు : **శ్రీ సాయి మాస్టర్ సేవా సంఘం** - డోర్ నెం. 6-9-20, కెల్లవీధి, శ్రీకాకుళం.

పూర్తి వివరములకు 21వ పేజీ చూడగలరు

శ్రీ భరద్వాజ

# సద్గురువాణి




సంపుటి - 18 ఏప్రిల్, మే, జూన్ - 2018 సంచిక - 2

**శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**

"శ్రీ శిరిడీ సాయి శతాబ్ధి మహాసమాధి" ప్రత్యేక సంచిక

నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**


"నీ పాపములు నా జోలెలో పడవేయుము, నేను మోసెదను"
- శ్రీ శిరిడీ సాయిబాబా

## చందా వివరములు

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | - | రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - | రూ॥ | 40/- |
| 3 సం॥ల చందా | - | రూ॥ | 120/- |
| 5 సం॥ల చందా | - | రూ॥ | 200/- |
| పోషకులు (ఉదారులు) | - | రూ॥ | 1000/- |


మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**C/o శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**
206/ఎ, సెక్టారు నెం. 8, ఉక్కునగరం,
విశాఖపట్నం - 530 032.
ఫోన్ : 0891 - 2510817
సెల్ : 9849645224, 9490812114

E-mail : sadguruvani@gmail.com
Website : **www.saisadguruvani.org**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**


## విషయ సూచిక


ఆధ్యాత్మిక, సామాజిక సేవలో చిత్రమాలిక ... లోపలి కవర్‌పేజీ
1. విషయసూచిక ........ 1
2. మా మాట ........ 2
3. యుద్ధం ........ 4
4. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ........ 5
5. ఆధ్యాత్మికత ........ 6
6. అపార మహిమ గురు మహిమ ........ 7
7. ఆచార్యవాణి ........ 8
8. శ్రీగురు చరితామృతము ........ 9
9. ఒక్క క్షణం ........ 11
10. అవధూత శ్రీ చివటం అమ్మ ........ 12
11. జిజ్ఞాస ........ 13
12. శ్రీ శివనేశన్ స్వామి ........ 14
13. పూర్ణ అంతరంగాలు ........ 15
14. మార్గం ........ 17
15. పండుగలు - పర్వదినాలు ........ 18
16. రజతోత్సవ వేడుకలు ........ 19
17. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో ........ 21
18. మేము సహితం ........ 22
19. జన్మదిన శుభాకాంక్షలు ........ 24
20. ఉపాసనా మార్గం ........ 28
21. బిక్షను కోరిన దత్త దిగంబరుడు ........ 29
22. సద్గురువు ఎలా ఉంటారు ........ 31
23. ధర్మానుష్టానం ........ 32
24. సాయి మాస్టర్ భక్త సమ్మేళనం సమీక్ష ........ 33
25. శిరిడీని చూపిన బాబా ........ 35
26. శిరిడీ వార్తలు ........ 36
27. తెలుసుకుందాము ........ 37
28. అమృతమూర్తి ........ 38
29. నిశ్చలంగా కూర్చో ........ 39
30. ఏరిన ముత్యాలు ........ 40



# మా మాట

## పాఠకులకు, ప్రకటన కర్తలకు బుద్ధ జయంతి మరియు హనుమజ్జయంతి శుభాకాంక్షలు

గురురూపమే ధ్యానమునకు మూలం, గురుపాదాలు పూజకు మూలం, గురునామమే మంత్రం, గురువాక్యమే ముక్తికి మార్గం, సర్వం గురుమయమే "సాయి" అంటే విశ్వచైతన్యం. "ఎవరి దృష్టి నా యందు కలదో వారియందే నా కటాక్షము కలదు" అన్నారు సాయి. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునేవాడు నన్నసలు చూడనట్లే. నీవు చూసేదంతా కలసి నేను" అన్నారు శ్రీ శిరిడీ సాయి. మన కంటి ఎదుట కనిపించే సకల చరాచర దృశ్యమానము సాయి స్వరూపమే. తామే సకల దేవతా, సాధు, జీవ, జడ స్వరూపినని ప్రత్యక్ష నిరూపణ చేశారు జగద్గురువు శ్రీ సాయి. ధ్యానము అంటే సద్భావనా ప్రవాహము, సంతతధారగా నిరంతరం గురువుపై మనస్సు నిలపటము. చైతన్య స్వరూపుడయిన సాయి, మన కోసం ఐదున్నర అడుగుల రూపంలో నిరంతరం ధ్యానానికి ఆధారముగా నిలిచారు.

"ఎదుటనున్న నా రూపాన్ని నఖశిఖ పర్యంతం చూస్తూ ఉండు. దాని వలన చూసే నీవు, చూడబడే వస్తువు, చూసే క్రియ లయమై బ్రహ్మసమరసత కలుగుతుంది" అన్నారు సాయి. బాబా తన గురుసేవా వృత్తాంతములో "నా యావత్‌శక్తిని కళ్ళలో నింపుకొని, నిరంతరం నా గురువుపై దృష్టి నిలిపి ఏకాగ్రముగా ధ్యానించాను. అట్లా నిరంతరము నా గురువును చూస్తున్నప్పుడు పొరపాటున నా కనురెప్పలు మూతపడితే, నా గురువుపైగల నిరంతర దృష్టికి అవరోధమైన కనురెప్పలు పీకివేస్తే బాగుండునేమోనని అనిపించింది" అంటారు. అంతే కాక "నా గురువు కోసం సమీప గ్రామాలకు వెళ్ళి భిక్ష స్వీకరించి, నా గురువు నోటికి అందించి, ఆయన మలమూత్రాలు విసర్జిస్తే శుభ్రం చేస్తూ, నిరంతరం గురుసేవలో మునిగేను" అని అంటారు సాయి.

"అతిథి అంటే ఐదున్నర అడుగుల మనిషి, బ్రాహ్మణుడే అని నీభావన. ఆకలిగొన్నవన్నీ ఆహారంకోసం అన్వేషిస్తూంటాయి. కాకబలికి సమృద్ధిగా అన్నం బయట విడిచిపెట్టిరా, దేనినీ పిలువవద్దు, తరమవద్దు అట్లాచేస్తే నీవు లక్షలాదిమంది అతిథులను సత్కరించినట్లే, నీదగ్గరకు ఎవరైన వచ్చి ఇవ్వమని అడిగితే, ఇవ్వశక్యమయితే ఇవ్వు లేదా ఇప్పించు, ఇవ్వటం ఇష్టం లేకపోతే ఇవ్వలేనని మర్యాదగా చెప్పు, అంతేగాని అసహ్యించుకోవటం, దూషించటం తగదు. ఆకలిగొన్నవారికి అన్నంపెట్టు అదీ లేకపోతే కనీసం అటుకులు, బెల్లంముక్క అయిన ఇచ్చి వారి ఆకలి తీర్చు" అన్నారు బాబా. ఎందుకు బాబా భిక్షకు ఇంత ప్రాధాన్యత ఇచ్చారు! కృతజ్ఞత కలిగి ఉంటే మనిషి అవుతాము, లేకుంటే రాక్షసులమవుతాము. తన వలెనే మనకు భౌతిక శరీరం ఇచ్చిన బాబా మనలో అజ్ఞాన రూపంలో దాగిన చెడు సంస్కారాలను, కర్మను తొలగించి, జ్ఞానస్వరూపులుగా మార్చటానికి, మొదటి అడుగుగా, సర్వం ప్రసాదిస్తున్న ప్రకృతి పట్ల, ఆస్వరూపమయిన సర్వులపట్ల, కృతజ్ఞతాభావం కలిగి ఉండటానికి, మనిషిని మానవత్వం మూర్తీభవించిన వాడిగా, మహనీయుడిగా, తయారుచేసి, భగవంతుడికి లెక్కచెప్పి, జన్మ పరంపరలనుండి తొలగించటానికి సాయిచేసే ప్రయత్నమే అది. అందుకే సాయి స్వయంగా భుజాన జోలె తగిలించుకొని, చేతిలో భిక్షాపాత్ర ధరించి, పాంచభౌతికమైన ఈ శరీరాన్ని పంచభూతాలే పోషిస్తాయి అన్న దానికి ప్రతీకగా, ఐదు ఇండ్లలో భిక్షాటన చేస్తూ, "నేను అడిగేది భిక్షరూపంలో మీ పాపకర్మలని, వాటిని నాకు సమర్పించి మీరు పుణ్యాన్ని మూటకట్టుకోండి" అని భిక్షరూపంలో జీవుల పాపాల్ని తాను జోలెలో స్వీకరించి, తన కర స్పర్శతో దానిని పునీతం చేసి, మరల తనను ఆశ్రయించిన అన్ని జీవులకు పంచేవారు. ప్రపంచంలో ప్రతి జీవి ముందుగా ప్రాకులాడేది జానెడు పొట్ట నింపుకోవటానికే, తాను పొందిన దానిని అందరితో పంచుకోవటం ద్వారా, పెంచుకోమని, అడిగే స్థితినుంచి, అందించే స్థితికి ఎదగమని, చేయిచాచే భిక్షగాడిలా కాకుండా చేయూతనిచ్చే భగవంతుడిగా మారమని, సాయి బోధ.

భిక్ష ప్రసాదించటములోని అంతరార్థము పరిశీలిస్తే ఇంకొక పరమార్థం గోచరిస్తుంది. సూక్ష్మంగా, సకల జనావళిని ఉద్ధరించటానికి అవతరించిన త్రిమూర్తి స్వరూపుడిని దత్తం చేసుకోవటం. అసలు దత్తావతారమే భిక్షతో ప్రారంభమయింది. అనసూయదేవి పాతివ్రత్యాన్ని పరీక్షించటానికి భిక్షకుల రూపంలో వచ్చిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, నగ్నంగా తమకు వడ్డన చేయమని అనసూయ మాతను కోరగా, మధ్యాహ్న సమయంలో భిక్షకై వచ్చిన వారిని ఒట్టిచేతులతో పంపితే వారు తిరిగి వెళుతూ, గృహస్తు పుణ్యాన్ని తీసుకు వెళతారని తెలిసిన అనసూయదేవి, వారి కోరికను మన్నిస్తూనే తన పాతివ్రత్య మహిమతో వారిని పిల్లలుగా మార్చి, పాలభిక్షను ప్రసాదించి వారిని తమ పుత్రులుగా పొందింది. అత్రి, అనసూయలకు దత్తమైనారు కనుక దత్తాత్రేయుడు అయినాడు. ఆంధ్రదేశము పిఠాపురములో అప్పలరాజు శర్మ, సుమతి ఇంట శ్రాద్ధకలాపము జరుగుతున్న సమయంలో భిక్షకుడి రూపంలో వచ్చిన దత్తాత్రేయుడుకి,


శాస్త్ర వాక్యాన్ని త్రోసిరాసి భిక్షనిచ్చిన కారణంగా సుమతికి కలియుగములో మొట్టమొదటి అవతారమైన శ్రీపాద శ్రీవల్లభులుగా జన్మించారు దత్తాత్రేయుడు. తాను భిక్షువై పుణ్య, తీర్థ క్షేత్రాలను పావనం చేసి, కురువపురంలో కృష్ణానదిలో దిగి అంతర్హితులైనా, తాను నిత్యసత్యులని చెప్పటానికి కురువపురంలో అన్నదానం చేయటానికి వస్తున్న వల్లభేశుడు యాత్రికుల రూపంలోని దొంగలు హతమార్చగా, వల్లభేశుడిని పునర్జీవింపజేశారు శ్రీపాద శ్రీవల్లభులు. ఇక రెండవ దత్తావతారమైన శ్రీ నృసింహ సరస్వతి, తాను తీర్థయాత్రలు చేస్తూ, భిక్షకుడై తనకు భిక్షనిచ్చిన వారి ఇంట సిరిసంపదలు తులతూగేలా చేశారు. అంతేకాక మఠములో తన ప్రతిరూపముగా నిర్గుణ పాదుకలను ఉంచి, తాను అంతర్హితుడైనా, నిత్యము గాణ్గాపూర్‌లో మధ్యాహ్న సమయంలో అనేక రూపాలతో భిక్షస్వీకరిస్తామని చెప్పటమే కాక, నేటికీ నిత్య సత్యుడై అక్కడ సంచరిస్తున్నారు. అందుకే ఈనాటికీ అక్కడి గృహస్థులు మధ్యాహ్న సమయంలో తమ ఇంటి ఎదుట నిలచినవారిని శ్రీగురుడి స్వరూపమని భావించి, పిడికెడు ఆహారమైనా పెడతారు. ఇక మూడవ దత్తావతారమైన శ్రీ మాణిక్యప్రభువు తాను భవంతిలో నివశించినా, భిక్షాహారాన్ని మాత్రమే స్వీకరించేవారు. అయితే తాను అన్నపూర్ణయై, అందరికీ తన "బండారు"లో షడ్రశోపేతమైన భోజనం ప్రసాదించేవారు. అది నేటికీ అక్కడ కొనసాగుతున్నది. నాల్గవ అవతారమైన శ్రీ స్వామిసమర్థ, మొట్టమొదట తనకు భిక్షనిచ్చిన చోలప్పను అనుగ్రహించి వారికి తన స్వరూపమైన చర్మపాదుకలను ప్రసాదించారు. ఇక అక్కల్‌కోటలోని ప్రసాదాలయంలో అమృతతుల్యమైన ఆహారం తీసుకోకుండా భక్తులు తిరిగి రారంటే అతిశయోక్తి కాదు. ఐదవ దత్తావతారమైన శ్రీ శిరిడీసాయినాథుడు తాను స్వయముగా భిక్షుకుడై ఐదు ఇండ్లలో భిక్ష స్వీకరించి, ఆదిభిక్షువైన శంకరుడిలా భాసించారు, అనాది సిద్ధమైన ఆచారాన్ని మరల మనకు గుర్తుచేశారు. పూర్వం ప్రతి గ్రామంలో పూటకూళ్ళ ఇల్లు ఉండేవి, అటు తరువాత అవి సత్రాలుగా మారి బాటసారులకు ఉచిత భోజన వసతులు కల్పించి దాహార్తిని తీర్చేవి. అవే నేడు వ్యాపారాత్మకంగా మారి భోజన శాలలు, వసతి గృహాలు అయ్యినాయి. అంతర్లీనంగా మనలో గూడుకట్టుకున్న మానవత్వాన్ని, కృతజ్ఞతని వెలికి తీయటానికి సాయి భిక్షకుడైనాడు. సాయిని ఆరాధిస్తున్న వారిలో నేడు మానవత్వం క్రమేపి మేల్కొంటున్నది. దానికి ప్రతీకగా అనేక దేవాలయాలలో పండుగలు, పర్వదినాలు, గురువారాలనాడు మరికొన్ని సాయి దేవాలయాలలో నిత్యాన్నదానాలు జరుగుతున్నాయి. అయితే అవి క్రమేపి కొన్నిచోట్ల సమారాధనలుగా మారుతున్నాయి.

ఆకలిగొన్న వారికి అందించేది అన్నదానము, భక్తులందరూ కలసి పంచుకొనేది సమారాధన, అయితే నిజానికి సర్వులలో చివరకు చీమలలో కూడ సాయిని చూస్తూ, తమతో సమానంగా ఆదరిస్తూ సహపంక్తిగా కుల, మత, జాతి, స్త్రీ, పురుష వయోభేదము లేకుండా ఆహారాన్ని స్వీకరించ గలిగిన నాడు నిజముగా అది సమ ఆరాధన, సాయి ఆరాధన అవుతుంది. "బ్రేవ్ మని త్రేన్చేవాడికి కాదు ఆకలిగొన్న వారికి అన్నం పెట్టమన్నారు" అవధూత శ్రీ వెంకయ్యస్వామి.

పండుగలు, పబ్బాలు, పేరంటాలు, జన్మదినాలు, పెళ్ళిళ్ళు మొదలైన వాటి పేరిట పోటీలు వంతులతో ఆహార పదార్థాల సంఖ్య పెంచుకుంటూ, వృధా ఖర్చుకు దారి తీస్తూ కూడ, సాయి భక్తులమని భావించటం సబబేనా? "రుచులకు పోవద్దు ఒకటి రెండు పదార్థాలతో తృప్తి పడు" అన్నారు సాయి. మనము అలానే స్వీకరిద్దాము. అదే ఆశిద్దాము, అయితే అందరికి సంతృప్తి కలిగేలా అందిద్దాము. సాయి తాను ఐదు ఇళ్ళలో భిక్ష స్వీకరించినా కొన్ని ప్రత్యేక దినాలలో తానే స్వయంగా ఎంతో రుచికరంగా వండి భక్తులకు పెట్టేవారు. మనము చేసే పుట్టినరోజు, వివాహ మహోత్సవాలు, పండుగలు, పబ్బాలు, పెళ్ళి విందులు ఇంకా అనేకమైన సందర్భాలలో భోజనాలకు విరివిగా ఖర్చుచేసే ముందు, మనము బ్రేవ్ మని తిని త్రేన్చే ముందు, ఆహారంకోసం బావురుమనే వారిని ఒక్కసారి గుర్తుచేసుకొని, దానికి అనుగుణంగా వృద్ధాప్యములో, అనాథశరణాలయాలలోని ఆర్తులకు ఇతోధికముగా చేయూతనిచ్చి, సాయి మెచ్చేలా మన జీవితాన్ని మార్చుకుంటూ, భిక్షువైన బుద్ధుడిలా జ్ఞానం పొందుదాము.

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టుతో కూడి శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ అక్షర యజ్ఞంతో పాటు, అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక సేవాకార్యక్రమాలకు చేయూతనిస్తున్నది. దానిలో భాగంగానే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలోని అనేక వందల మారుమూల గ్రామాలలో అనేక రూపాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించటముతో పాటు, "శ్రీ సాయి భరద్వాజ ఆపన్నహస్తం" పేరిట ప్రతినెల శారీరక, మానసిక, దివ్యాంగులకు, అతినిరుపేద వృద్ధులకు 60 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు కూడా ఉచితంగా అందజేయటము జరుగుతున్నది. ఆధ్యాత్మిక సామాజిక సేవల ద్వారా అందరూ ఒక్కతాటిగా సాయిపథంవైపు సాగటానికి మావంతు ప్రయత్నం చేస్తున్నాము. తమవంతు చేయూతనిస్తున్న మాన్యులకు, సహృదయులకు వందనాలు. నేడు ట్రస్టు ద్వారా చేయూత నందుకున్నవారు తమ తమ గ్రామాలలోని కొందరికి చేయూత నివ్వగలిగేలా తయారు అవుతున్నారు అంటే అది శ్రీ దత్త సాయి భరద్వాజుల కృపానుగ్రహమే.

శ్రీ శిరిడీసాయి మహాసమాధి శతాబ్ది మహోత్సవాల సందర్భముగా ఈ సంచికను కూడ శ్రీ శిరిడీసాయి శతాబ్ది మహాసమాధి ప్రత్యేక సంచికగా రూపొందించి అందిస్తున్నాము. వ్యాసాలు అలరిస్తాయిని ఆశిస్తూ, "శ్రీ భరద్వాజ సద్గురువాణి" ద్వారా అక్షర సేవచేస్తూ, సర్వత్రా వినిపించే "సాయివాణి"ని ఒక్కటిగా చేసి మీకందించే విధముగా అహర్నిశలు మా ఈ ప్రయత్నం కొనసాగుతుంది అని అందుకు నిరంతరం మీ సహాయ సహకారాలు కొనసాగాలని కోరుకుంటూ... **శుభాకాంక్షలతో...**



**మీ పబ్లిషర్**

**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**



# యుద్ధం

పోటీలు, వంతులు, కీచులాటలు రావటానికి వ్యక్తిప్రాధాన్యతలే కారణము. వ్యక్తి ప్రాధాన్యత ఎందుకు వస్తుంది. తాను మందిరానికి ఎందుకు వస్తున్నాడో తెలియక పోవడంవలన. ఏది చేసినా పరవాలేదు, చేయకపోయినా పరవాలేదు ఎదుటి వ్యక్తి హృదయాన్ని గాయపరచరాదన్న ఎరుక ఏమారకుండా ఉంటే సున్నితమైన ప్రవర్తన వస్తుంది. ఆ ప్రవర్తన ద్వారా మన సంస్కరణ వీలౌతుంది. అవతలివ్యక్తి ప్రవర్తన పదిమందికి బాధకలిగిస్తుంది కదా అనవచ్చు. కానీ సర్వానికీ యజమాని సద్గురువే. ఆయనకు చెప్పి మన భాద్యత తీర్చుకుంటే సరి. ఈ ప్రయత్నంలో సబూరి మితిమీరి అవసరం. సద్గురువు మాత్రం శాశ్వత పరిష్కారంచేసి తీరుతారు. ఎవరైనాసరే గమ్యాన్ని గుర్తుచేసుకొని సాగుతుంటే పోటీలు, వంతులు, కీచులాటలకు తావే ఉండదు. అసలు గొడవంతా ఏదేదో సేవ అని భావించడంలోనే వస్తుంది. అసలు సేవ అంటే మనసును నిగ్రహించడమే అని ఎరుగక పోవడమే ఈ గొడవకు కారణము. ప్రతివారిలోను వెలిగిపోతున్న సద్గురు జ్యోతికి ఆవరించియున్న మలినాన్ని తొలగించుకోవడమే అసలైన సేవ, సాధన. మిగిలినదంతా వ్యక్తుల అజ్ఞానమే. పోటీలు, వంతులు, కీచులాటల ద్వారా గురువుగారు మన ఎడల అసహ్యపడతారని ఎరుగకపోవడమే అలా ప్రవర్తింపచేస్తుంది.

రామదాసి సంఘటన సాధనకంతా ముఖ్యమైన బోధ – నీకు పనికిరాని వస్తువు ఇతరులకు ప్రేమతో ఇవ్వమన్నారు. అట్లాకాదు. మనకు పనికివచ్చేదే అనుకుందాము. దానిని ఎదుటివాని అవసరాన్నిబట్టి మన అవసరాన్ని కాస్త ఆపుకొని ఇవ్వగలిగితే సాయి మనలను అలాచేసినందుకు ఎంత గొప్పగా అనుగ్రహిస్తారో చూడండి. అలాంటి త్యాగంలేకుండా నాది, నాకు, అనే బంధము నుండి ఎలా విడుదలపొందగలం.

సర్వ అనర్థాలకు మూలం కోపం. కోపం ఎందుకొస్తుంది? కావాలి అనే కోరిక వలన. కావాలి అనే కోరికను త్యాగంచేయకుండా విష్ణుసహస్రనామం చదువుతుంటే ఏమౌతుంది. ఈనాడు మన పారాయణలు కూడా ఈ రామదాసి పారాయణలాగానే ఉన్నాయి. పారాయణవలన ప్రయోజనంలేదా? అని మీరడగవచ్చు లేకేమి? మనం చేరవలసిన గమ్యంవైపు నడలకుండా వెనుకకు నడుస్తున్నాము. గమ్యంచేరే కాలము ఎక్కువ తీసుకుంటుంది. ఎప్పుడైనా ఎవరికైనా కోరిక వదలందే జన్మచక్రంలోనుండి విముక్తిలేదు.

అతడు రామదాసుగదా? మరి దాసునకు కోపం తగదుకదా? బాబా చెప్పినట్లు పుస్తకం కావాలంటే డబ్బుపారేస్తే వస్తుంది. మనిషి అలా వస్తాడా? అందరిలో బాబాను చూచేదిపోయి అందరిపైన ద్వేషభావం పెంచుకుంటుంటే ఇక సాధనేముంది. అవతలివాడు మనమీద ద్వేషభావం పెంచుకొని దూరమైతే మనమేమీ చేయలేము. మనభావం సరిగా ఉంటే చాలు.

నీ ఆలోచనలన్నీ నీ అహంకారమే. ఇది చెప్పరానంత గొప్పమాట. ఇది మనసుయొక్క స్వభావానికి సంబంధించినది. మనలోని అహం ఎంత పలుచబడితే మన ఆలోచన అంత తగ్గుతుంది. మనం వద్దన్న విషయాలమీదకే ఈ పాడుమనసు పోతుంది. కూరగాయలు తరిగినంతసేపు కుదురుగా గురువుగారి రూపం ధారణచేస్తూ నామంచెప్పవచ్చుగదా? నిరంతరం ఏమారుస్తూనే ఉంటుంది మనస్సు. అహంకారమనే అడ్డుగోడే అందుకు కారణం. బహిరంతరములయందు వ్యాపించియునయన సాయిని వదలి లౌకిక విషయాలవెంబడి మనసు పరుగు తీయడమంటే అహంకారముకాక ఏముంది. తైలధారవలె మనస్సును సద్గురు మననంలో ఉంచవలసినదిపోయి చెత్త ఆలోచనలు రావడం ఎంత దుర్మార్గమోగదా! పట్టువీడక మనస్సు యుద్ధం కొనసాగిస్తే ఏనాటికైనా తప్పక సహాయపడకపోదు బాబా, అనే నమ్మకముతో జీవనం కొనసాగించాలి" అని బోధించారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారు.

రచన : **శ్రీ పెసల సుబ్బరామయ్య**, గొలగమూడి


**STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF SRI BHARADWAJA SADGURUVANI**

**(Quarterly)**
**Form IV**
**(See Rule 8)**

1. Name of the Publication : **SRI BHARADWAJA SADGURUVANI**
2. Periodicity of its publication : **QUARTERLY**
3. Printer's Name : **V.S. LAKSHMI BRAMARAMBA**
   Nationality : **INDIAN**
   Address : **SRI BHARADWAJA PUBLICATIONS**
   **Qtr No. 206/A, Sector-8,**
   **Ukkunagaram, Visakhapatnam-32.**
4. Publisher's Name : **V.S. LAKSHMI BRAMARAMBA**
   **For Sri Bharadwaja Publications**
   Nationality : **INDIAN**
   Address : **Qtr. No. 206/A, Sector - 8,**
   **Ukkunagaram, Visakhapatnam-32.**
5. Editor's Name : **V.V. POORNACHANDRA RAO**
   Nationality : **INDIAN**
   Address : **SRI SHIRDI SAI SEVA TRUST,**
   **Ukkunagaram, , Visakhapatnam-32.**
6. Name and address of Individuals :
   Who own the News Paper and Partners and share holders holding more than one Percent of the total capital.
   **SRI BHARADWAJA PUBLICATIONS**
   **Ukkunagaram, Visakhapatnam - 32.**

I.V.S. Lakshmi Bramaramba, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belife.


VISAKHAPATNAM
Date : 01-04-2018

**Sd/- V.S. LAKSHMI BRAMARAMBA**

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"సిద్ధ యోగీంద్రులు"

"నన్ను ఆశ్రయించిన వారిని, శరణుజొచ్చిన వారిని నిరంతరం కాపాడుటయే నా కర్తవ్యం. నా యందు ఎవరి దృష్టి కలదో, వారి యందే నా కటాక్షము కలదు. నీవు నిశ్చింతగా కూర్చో, అవసరమైనదంతా నేను చేస్తాను. నా సహాయము గాని, సలహాను గాని కోరిన తక్షణమే ఒసంగ సంసిద్ధుడను" అని అభయమిచ్చారు ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తి అయిన శ్రీ శిరిడీ సాయినాథుడు. వీటన్నింటికీ ప్రధానము మన భారాలన్నీ బాబాపై పడవేసి, నిశ్చింతగా ఉండగలగటము. అది సాధ్యమేనా? నిర్మలమైన మనస్సు అనే సరోవరములో, కోర్కెలనే రాళ్ళు వేసి, అవి సృష్టించిన అలజడిలో తలమునకలవుతూ, ప్రశాంతత పొందే సమయములో తిరిగి సముద్రంలో అలలా నిరంతరం వచ్చే కోర్కెల తరంగాలు ఆగేది ఎప్పుడు, మనస్సు నిశ్చింతగా, నిశ్చలంగా ఉండేది ఎప్పుడు. "కోర్కెలే దుఃఖానికి మూల కారణం" అన్నారు గౌతమ బుద్ధుడు. "కావాలనే కోరికను విడిచి, సర్వగతుడైన భగవంతుడి మీద మనస్సు నిలుపు గమ్యం చేరుతావు" అన్నారు జగద్గురు శ్రీ శిరిడీ సాయిబాబా. "నేను" అనేది అణిగినప్పుడే మన కోర్కెల తరంగాలు ఆగిపోయేది. నేను అనేది ఎక్కడ, ఎలా ఉంది, దాని సస్వరూపం ఏమిటి, అది తెలుసుకోవాలంటే ఏమి చేయాలి?, అరణ్యాలలో శోధించాలా? ఆధ్యాత్మిక గ్రంధాలు వల్లేవేయాలా, యోగ ప్రక్రియల ద్వారా శరీరాన్ని అదుపుచేయాలా? నిరంతరం చింతన చేస్తూ ఉండాలా, ఏమి చేయాలి? ఏలా చేయాలి? ఎప్పుడు చేయాలి? ఎక్కడ చేయాలి? అనే సమస్యల వలయములో కొట్టుమిట్టాడుతున్న సకల జనావళిని ఉద్ధరించాలనే అవతార లక్ష్యంతో అవతరించిన దత్త స్వరూపుడయిన శ్రీ శిరిడీ సాయిబాబా, "నీవు నాలో ఉన్నావు, నేను నీలో ఉన్నాను, అదే భావన చేస్తుండు, ఉన్నదంతా ఒక్కటే" అన్నారు. అందుకు ఆలంబనగా "ఎదురుగా ఉన్న నా రూపాన్ని నిరంతరం ధ్యానించు, లేకుంటే ఎదురుగా ఉన్న నా రూపాన్ని నఖశిఖ పర్యంతం చూస్తూ ఉండు. చూసే నీవు, ఎదురుగా ఉన్న నా రూపం, నేను చూస్తున్నాను అనే నీ భావన లయమై, బ్రహ్మ సమరసత కలుగుతుంది. అపుడు నీవు, నేను అనే భావం నశించి, అంతా ఆవరించి ఉన్న చైతన్యం అనుభవమయ్యి విశ్వవ్యాపకంలో నిలుస్తావు" అన్న సాయి అభయము శిరోధార్యం అయినాడు, ఆరాధన, ఆశ్రయించటము లోనికి మారి, నీళ్ళలో ఉన్న కరిగిపోయినట్లుగా "నేను" అనే ఉనికి కోల్పోతాము. అందుకు అవరోధమయిన అహంకారము నశించి,



విశ్వచైతన్య స్వరూపుడయిన సాయిలో నిలుస్తాము. "ఎదుటగా ఉన్న రూపాన్ని ధ్యానించటము" అంటే కేవలం చూస్తూ ఉండటము మాత్రమే కాకుండా, తనువు, మనస్సు, ప్రాణం సద్గురు సేవకు వినియోగించటం. తద్వారా నేను అనే అహంకారముతో కూడిన మన మనో వృత్తులు శ్రీ సాయి కృపా లీలామృతంలో కరిగిపోయి, భేదమనే అడ్డుగోడ కూలిపోయి, విశ్వచైతన్యము అనుభవమవుతుంది. ఉన్నదంతా ఒక్కటే అన్న ఎరుక కలిగి, "నీవు నాలో ఉన్నావు, నేను నీలో ఉన్నాను" అన్న సాయి బోధ అవగతమవుతుంది.

శ్రీ శిరిడీ సాయినాథుడు 12 సంవత్సరాలు తన గురువును ఆశ్రయించి చేసింది అదే, భూగృహములో ధ్యానస్థులైన తన గురువుకు ఆహార నిమిత్తమై సమీప గ్రామాలకు వెళ్ళి, భిక్ష తీసుకువచ్చి వారి నోటికి అందించి, ధ్యానావస్తలో ఉండిపోయిన వారి గురువు విసర్జించిన మలమూత్రాలు తీసి శుభ్రం చేస్తూ, నిరంతరం తన గురువు గురించే చింతన చేస్తూ, వారి సేవలోనే నిమగ్నులై, తన యావత్‌శక్తిని తన కళ్ళలో నింపుకొని, వారిపై దృష్టి నిలుపగా, 12 సంవత్సరాలు తరువాత బాహ్యస్థితిలోకి వచ్చిన వారి గురువు బాబా తల బోడి చేయించి, నిష్ట-సబూరి అనే రెండు పైసలు దక్షిణ సమర్పించమనగా, తనువు, మనస్సు, ప్రాణం ఏకంచేసి 12 సంవత్సరాలు గురువుని ఆశ్రయించి సేవించిన దానికి ప్రతిగా అద్వైత స్థితిలో నిలిచిన శ్రీ సాయి, గురుదక్షిణగా మౌనంగా తలవంచి, గురువు ఎదుట నిలిచారు. అప్పుడు ఆయన బాబా తలపై చేయి ఉంచి, "నీవు ఎక్కడ ఉన్న, ఎలా ఉన్న, నిరంతరం నీ వెంట నేను ఉంటాను, ఈ రోజు నుంచి నా స్థితి నీకు ప్రసాదించాను" అని అన్నారు బాబా వారి గురువు. "అమ్మా ఈనాటి నా ఈ స్థితికి అదే కారణం" అని శ్రీ సాయిబాబా రాధాబాయి దేశముఖ్‌తో తన గురుసేవా వృత్తాంతం గురించి వివరించి చెప్పగా, మూడు రోజులు కేవలం అన్నపానీయాలు మాని, 12 సంవత్సరాలు గురువును ఆశ్రయించి, సేవించి, సాయి పొందిన స్థితిని, మంత్రోపదేశ రూపంలో తనకు బోధించమని మూడు రోజులు ఉపవాస దీక్ష చేసిన రాధాబాయి, తన అజ్ఞానానికి పశ్చాత్తాపపడి, బాబా పాదాలపై పడి భోరున విలపిస్తూ, "అజ్ఞానంతో మూర్ఖంగా ప్రవర్తించిన తన చర్యకు పరిహారము తెలుపమని" బాధతప్త హృదయ అయ్యి వేడగా, కరుణా సముద్రుడైన సాయి, రాధాబాయి మనస్సు స్వాంతన చెందేలా చెప్పటం ప్రారంభించారు.

"అమ్మా నా గురువు నా నుండి ఏమీ ఆశించలేదు. ఆయన కోరిన రెండు పైసలు దక్షిణ కూడ ఒకటి నిష్ట, రెండవది సంతోష స్థైర్యములతో కూడిన ఓరిమి. నేను ఆ రెండింటినీ వారికి సమర్పించాను. అందుకే వారు నా పట్ల ప్రసన్నులైనారు. వారు పరిపూర్ణ ప్రేమావతారులు. వారి అపారమైన ప్రేమ కరుణకు పాత్రులవటానికి అవసరమైన శ్రద్ధ అన్నది చాలా ముఖ్యం, దానిని ఆచరించటము ద్వారా, పాపములన్ని తొలగిపోయి, కష్టాల నుండి ముక్తి లభిస్తుంది. సబూరి సుగుణాల గని, బుద్ధిని మేల్కొలిపి, సత్కర్మలవైపు నడిపిస్తుంది. అదే మనము గురువుకు సమర్పించాల్సిన నిజమైన దక్షిణ. తల్లి తాబేలు ఒక ఒడ్డున ఉండి, రెండవ ఒడ్డున ఉన్న తన పిల్లలకు ఆహారం, పాలు మొదలైనవి అందించకుండానే, తన దృష్టినిపోనిచ్చి, పిల్లలను ఎట్లా పెంచి, పోషించి తనంతవాటిగా చేస్తుందో, అదే విధముగా మనము ఎక్కడ ఉన్నా, గురువు కేవలం తన కృపాదృష్టి చేతనే మనలని తనంతటి వాడిగా చేస్తారు. అందుకు మనము చేయవలసింది, తండ్రికి తగ్గ బిడ్డలుగా ఉండటమే, నేను చేసింది అదే, అందువలనే నా గురువు అనుగ్రహము పొందగలిగేను. అంతకు మించి నా గురువు నా చెవిలో ఏ మంత్రము ఉపదేశించనూ లేదు, నా గురువు నాకు చెప్పని దానిని, వారు ఉపదేశించని దానిని, నేను నీకు ఎట్లా బోధించేది. గురువు యొక్క ప్రేమపూరితమైన చూపే మనకు శాశ్వత ఆనందాన్ని కలుగజేస్తుందని జ్ఞప్తి యందుంచుకో, అంతే గాని ఆచరణ లేకుండా, ఆధ్యాత్మిక సౌధవాన్ని అధిరోహించాలని ఆశపడకూడదు. ఒకవేళ తాత్కాలికంగా వేరొక రీతిన అధిరోహించినట్లు అనిపించినా, అది కాగితపు మేడ వలే కూలిపోక మానదు, కనుక ఇక్కడే కాదు ఇంకెక్కడకు కూడ మంత్రోపదేశం కొరకు ప్రాకులాడవద్దు. నీ ఆలోచనలు, పనులు, సమస్తమూ సద్గురువు కొరకే ఉపయోగించు, తప్పక నీవు పరమార్థం పొందుతావు. ఈ మశీదులో కూర్చుని నేను నీకు అంతా నిజమే చెబుతున్నాను. ఏదైతే సత్యమై, నిత్యమై, సృష్టి అంతటా వెలుగొందుతున్నదో అట్టి శాశ్వతమైనదాని గురించే నీకు తెలియజేశాను, గురువు మాటే ప్రమాణము, గురువు వాక్యమే శిరోధార్యము, గురువుపై అపారమైన ప్రేమ విశ్వాసములుంచి, గురువే సర్వమూ చేయువాడనే ఎరుక కలిగి జీవించిననాడు, శాస్త్రషట్కముతో గాని, సాధనా సంపత్తితో గాని పనిలేదు. త్రిమూర్తి స్వరూపుడయిన గురువే సమయానుకూలముగా సర్వమూ ప్రసాదించగలడు. అది గుర్తెరిగి జీవించిననాడు కలిబారిన పడకుండా జీవితాన్ని ధన్యం చెందించుకోగలుగుతావు. గురువే సకల దేవతా, సాధు, జీవస్వరూపి అని విశ్వసించి, త్రికరణ శుద్ధిగా సేవించిన వారి సర్వ బాధ్యతలు గురువే వహించి, నిరంతరం వెంట నుండి కాపాడి, భగవసాన్నిధ్యాన్ని ప్రసాదిస్తాడు. అది ప్రసాదించటానికే ఈ పాడుబడ్డ మశీదును "ద్వారకామాయి" చేసి, నేను ఆశీనుడనైనాను. నా గురువు అనుగ్రహానికి ప్రతీక ఈ ఇటుకరాయి, దీని ద్వారా వారిని ధ్యానిస్తాను. ద్వారకామాయిలో అడుగిడిన వారి పాపాలను భస్మీపటలం చేసి, పునీతులను చేయటానికి ధుని ఏర్పాటు చేశాను. తల్లీ! ఆలోచించు, ఈ ద్వారకామాయి ఒడిలో చేరి ఇంకా ఏదో కావాలి, ఏదో పొందాలని దుఃఖించటము ఎందుకు? నీవు నిశ్చింతగా, నిశ్చలముగా కూర్చుని, నేను చెప్పిన విధముగా జీవించు, నిన్ను చివరికంటా ఉండి గమ్యం చేరుస్తాను" అంటూ మందహాస సుందర వదనారవిందుడైన శ్రీ సాయిబాబా, రాధాబాయి దేశముఖ్‌కు ఉపదేశము చేశారు. "ఆ బోధను ప్రత్యక్షముగా నేనూ విన్నాను, ఆ సంఘటనలో నేను ప్రత్యక్ష సాక్షిని" అంటూ అంతవరకు హేమాద్రిపంత్‌కు శ్రీ సాయి సన్నిధిలో జరిగిన సంఘటన గురించి చెబుతున్న శ్యామా అకస్మాత్తుగా మౌనం వహించాడు. మదిలో ఆనందం తాండవమాడుతుండగా, నిమీలిత నేత్రములతో, ఒక అలౌకికమైన స్థితిలో, భావోద్వేగముతో ఉండిపోయిన శ్యామాను, ఆనంద ఆశ్చర్యాలతో చూస్తూ ఉండిపోయాడు హేమాద్రిపంత్. ఆ తరువాత జరిగిన సంఘటన, దాని విషయ విశేషాలు వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.


## "ఆధ్యాత్మికత" యొక్క ఆవశ్యకత ఏమిటి?

ప్రతి వ్యక్తి జీవించడానికి తిండి, గుడ్డ, ఇల్లు ప్రాథమికమైనవిగా తలుస్తాడు. కానీ అవి లభించాక తృప్తి చెందక ఇంకా ఏదో పొందితే తృప్తిగా జీవించవచ్చని తలుస్తాడు. ధనం వలన దుఃఖం నశించి తృప్తి కలుగుతుందని కొందరు భావించి, అధర్మం, అవినీతుల ద్వారా దానిని పొందటానికి ప్రాకులాడుతున్నారు. కానీ ఎవరూ నిజమైన నిలకడ కలిగిన తృప్తిని పొందలేకపోతున్నారు సరికదా వారు చేసే ప్రయత్నాలు వారిని మరింత అశాంతి, చింతలో ముంచటం చూస్తూనే ఉన్నాము. గాఢనిద్రలో మనస్సు, ఇంద్రియాలు పనిచేయవు. కనుక మనకు తృప్తిగా, శాంతిగా ఉంటుంది. అంటే మనం వెతికే తృప్తి, శాంతులు మనలోనే ఉన్నాయన్నమాట. మెలకువలో మనస్సును నిశ్చలం చేయగలిగితే అట్టి తృప్తిని, శాంతిని అనుభవించవచ్చు. అటువంటి నిశ్చలమైన ఆనందాన్ని పొందటానికి కావలసిన క్రమశిక్షణ ఇచ్చే విధానమునే "ఆధ్యాత్మికత" అంటారు. అందువలన తృప్తి, శాంతి పొందగోరే ప్రతి వ్యక్తికీ ఆధ్యాత్మికత, సాధన అత్యవసరం. 'నాకు ఆధ్యాత్మికత అక్కర్లేదు' అన్నారంటే తృప్తి, శాంతి అక్కర్లేదు అన్నమాట సుమా!

– పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

# అపార మహిమ గురు మహిమ

ప్రాణాయామాది సాధనలవల్ల శరీరం చాలా కాలం ఉండేట్లు చేయవచ్చుననీ, జ్ఞానులు ఆ విధంగా చేస్తారనీ అంటారే, నిజంగా అలా ఉంటేనే జ్ఞానులా, అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఆరకమైన సాధన చేస్తే చాలా కాలం జీవించి ఉన్నంత మాత్రాన జ్ఞానులౌతారా? కొద్ది కాలం బ్రతికిన వారు జ్ఞానులు కాకుండా ఉంటారా? శంకరులు ముప్పది రెండేండ్లే ఉన్నారు. మణివాచకులు 32, సుందరులు 18, సంబంధులు ఇంకా త్వరలోనే 16 సంవత్సరములకే శరీరం విడిచారు. వారంతా జ్ఞానులు కారా యేమి? జ్ఞానికి అసలు శరీరం మీద ప్రీతియే ఉండదు. సుఖ స్వరూపుడైన తనకు ఈ శరీరం ఒక వ్యాధిగా ఉంటుంది. ఎప్పుడు ఈ వ్యాధి బాధ తొలుగుతుందా అని చూస్తాడు. ఇది ఉండగానే పళ్ళుతోమాలి, బయటికి పోవాలి, స్నానం చేయించాలి, ఆహారం ఇవ్వాలి, ఎన్నో ఉపద్రవాలు, పుండు పడితే దాన్ని కడిగి, కట్టుకట్టకుంటే వాసన పుట్టదూ? అట్లాగే ఈ శరీరాన్ని అనుక్షణం బాగుచేయకుంటే చెడుతుంది.



జ్ఞానియైనవాడు కూలికి బరువు మోసినట్లే మోస్తాడు దేహాన్ని. గమ్యస్థానం వచ్చేది ఎప్పుడా, ఎప్పుడా అని ఎదురు చూస్తాడే కాని ప్రాణాయామాలూ, కాయకల్పములూ చేసి ఈ వ్యాధిని ఇంకా భరించాలని అనుకుంటాడా? అదంతా సిద్ధుల పద్ధతి. కొండ మీద సిద్ధశాఖలోని వారు కొందరుండేవారు. వారిని ఎవరైనా చూచేందుకు వస్తే, కూర్చోమని "మీదేవూరు నాయనా?" అంటే, "ఫలానా వూరు" అనే వారు. "మీ తాతపేరు? మీ ముత్తాత పేరు?" అని అడిగి తెలుసుకొని, "ఆ... అదే అదే... మీ ముత్తాతకు తండ్రి ఇంత పిల్లవాడయి ఉండగా, నేనిక్కడికి వచ్చాను?" అని అనేవారు. "అబ్బో! ఇన్నాళ్ళు బ్రతికి ఇంత దృఢంగా ఉన్నాడే, ఎంత గొప్పవాడో!"నని వారంతా నమస్కరించి, కానుకలు చెల్లించి వెళ్ళేవారు. అదంతా లోకాన్ని (ఏమార్చేందుకు) మోసగించేందుకు, కాని అందువల్ల జ్ఞానులౌతారా? యోగవాసిష్ఠంలో రాముడు తీర్థ యాత్రచేసి, తిరిగి వచ్చిన వెనుక "లోకమంతా దుఃఖమయమే. శరీరధారణయే దుఃఖము" అనే విరక్తితో అన్నపానాదులు సహితం పరేచ్ఛానుసారం నడుపుతూ, జడునివలె ఉండిపోయినాడట. విశ్వామిత్రుడు యాగరక్షణార్థం రాముని పంపుమని దశరథునడిగితే, "వాడు ఏదో పిచ్చిపట్టిన వాడివలె ఉన్నాడు స్వామీ!" అని చెప్పి, ఆ పిచ్చికిగల లక్షణాలు కొన్ని వివరించారట వారు. విశ్వామిత్రుడది విని "నాకు చాలా సంతోషంగా ఉన్నది, ఆ పిచ్చి అందరికీ పడుతుందా! చూద్దాం, పిలిపించు" అంటే పిలిపించారు. సభకు వచ్చిన రాముడు అందరికీ నమస్కరించి కూర్చున్నాడు. విశ్వామిత్రుడు ఆ రాముణ్ణి చూచి, విచార కారణం అడిగి తెలుసుకొని, వసిష్ఠునితో "ఏమయ్యా! మనకిద్దరకు బ్రహ్మ ఉపదేశించిన ఆత్మతత్త్వం ఈ రామునికి బోధించి కలత పోగొట్టుము" అని నియోగిస్తే, వారు "సరే" నన్నారు. ఆ బోధ వినే నిమిత్తం వినువీధి నుండి సిద్ధ సంఘం దిగివస్తూ, "ఈ రాముడు అతి బాల్యంలోనే ఇంత జ్ఞానం పొందేడే, ఎంత వింత!" అని పొగుడుతూ, "మనము ఎన్నాళ్ళు బ్రతికినా ఏమి లాభమున్నది?" అని అనుకున్నారట.

కొందరు "మేము ఇంచుమించు ఎనభై ఏళ్ళు బ్రతికాం, ఇంకేంకావాలి" అంటారు, అదొక ఘనమని భావిస్తారు. అదొక గర్వం. దానికొక కథ ఉన్నది. పూర్వం బ్రహ్మకొకసారి తానే చిరంజీవినన్న గర్వం కలిగి విష్ణు సన్నిధికి వెళ్ళి, "నేనెంత గొప్పవాడనో చూచావా? చిరంజీవిని" అన్నాడట. ఆ విష్ణువు "కాదు నాయనా! నీకంటే చాలా పెద్దవారున్నారు" అన్నాడు. "సరే చూపుతాను రమ్మని", విష్ణువు అతన్ని వెంటపెట్టుకొని పోతూ వుంటే, ఒక చోట రోమశమహాముని కనిపించాడు, "అయ్యా! తమకిప్పుడు వయస్సెంత? ఇంకెంత కాలం వుంటారు?" అని అడిగాడు విష్ణువు. "నాయనా! నా వయస్సెంతో చెపుతా విను" అని "ఇన్ని వేలయేండ్లు ఈ యుగం. అన్ని వేలు ఆ యుగం" అంటూ లెక్కించి "అవన్నీ కలిస్తే, బ్రహ్మకొక రాత్రి, పగలూను. ఆ సంఖ్య ననుసరించే బ్రహ్మకు నూరేండ్లాయుస్సు. అటువంటి ఆయుర్దాయంగల ఒక్క బ్రహ్మ గతించినప్పుడు నా దేహంలోని రోమం ఒక్కటి ఊడుతుంది, అట్లా ఒక్కొక్క బ్రహ్మ కల్పమునకు ఒక్కొక్కటిగా ఎన్నో రోమాలు పోగా, ఇంకా ఎన్నో వున్నవి. ఇవన్నీ ఎప్పుడు వూడితే అప్పటికి నా ఆయుర్దాయం సరి నాయనా" అన్నారట వారు. అందుకే ఆశ్చర్యపడుతున్న ఆ బ్రహ్మను అష్టావక్రమహాముని సన్నిధికి తీసుకొనిపోతే, వారూ పై లెక్కలన్నీ చెప్పి, అటువంటి రోమశమహామునులు ఒక్కొక్కరు గతించినప్పుడు, నా ఈ వంకరలు ఒక్కొక్కటీ సరిపడుతవి. ఈ విధంగా ఈ వంకరలన్నీ ఎప్పుడు తీరితే, అప్పుడు నా ఆయుర్దాయం సరి!" అన్నారట వారు. అంతటితో బ్రహ్మ గర్వం గుబేలున కూలింది. ఇట్లాగే ఇంకా ఎన్నో కథలున్నవి. సరియైన జ్ఞానం కలిగితే, ఈ శరీరం ఎవరికి కావాలి?


గురుకృప లేనిదే ఆ జ్ఞానం లభించదు. జడునివలె ఉన్న రామునికి గురుబోధ వల్లనేగదా తెలివి కలిగింది, గురుకృప అత్యావశ్యకము. ఒకరు "ఓ గురుదేవా! నీ దృష్టి పడ్డమాత్రంవల్లనే పులి పిల్లివలె అవుతుంది, పాము ఉడుతవలె అవుతుంది, దుష్టుడు సన్మార్గావలంబకుడౌతాడు, ఇంకా ఏదేది కాదు, ఒక్క నీ కటాక్ష వీక్షణంవల్లనే అన్నీ చక్కనౌతవి, నీ మహిమ ఏమని వర్ణింతును!" అంటూ పాడేరు. "గురుకృప అంటే సామాన్యమా!" అన్నారు భగవాన్ శ్రీ రమణ మహర్షి. (ఏప్రిల్ 14వ తేదీ భగవాన్ శ్రీ రమణ మహర్షి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీమతి వి.ఎస్. లక్ష్మి**

# ఆచార్యవాణి

ఎన్నో లౌకికమైన విషయాలలో కొట్టుమిట్టాడే మనకు దైవారాధనకు సమయం వెచ్చించాలంటేనే టైం సరిపోవటంలేదని తప్పుకుంటాము.

అది నిజముగా మనము చేసే పెద్ద పొరపాటు, ఎంత సమయాన్ని మనము వ్యర్థము చేసుకుంటామో మనలను మనము ప్రశ్నించుకుంటే నిజము మనకే తెలుస్తుంది. పూజ్యులు ఆత్మద్రష్ట అయిన ఆచార్యులవారిని నేను పై విషయమై ప్రశ్నించినపుడు వారు చెప్పిన విషయాలను ఇక్కడ పొందుపరుస్తున్నాను.



1. కాలము భగవత్ ప్రసాదితము చాలా విలువైనది. ఆయన ప్రసాదించిన కాలములో కొంత సమయాన్ని విధిగా ఆయనకు సమర్పించుకోటానికి కేటాయించుకోవాలి. (అంటే హారతులు / చరిత్ర పఠనము / పూజ మొదలైన వాటికి కేటాయించాలి.

2. మనము తింటున్న ప్రతి మెతుకు సద్గురువు ప్రసాదితమే. కనుక మనము ఏది తినేటప్పుడయినా సర్వజీవ స్వరూపా! సాయి, ఇది నీ ప్రసాదము అని కొంత ఆయనకు అర్పించి (బయటపెట్టి) మిగిలినది ఆయన ప్రసాదము అన్న భావనతో తీసుకోవాలి.

అట్టి అవకాశము లేనపుడు తినబోయేముందు వారిని స్మరించి అది వారి ప్రసాదమని తినాలి.

3. నీ సంపాదనంతా ఆసద్గురుని కృపాకటాక్షమే. అట్టి భావనను, ఏమారక నీ సంపాదనలో కొంత భాగము నీ శక్తిమేరకు సాయికి దక్షిణగా గాని, సాయి ప్రచారానికి గాని, నిరుపేదలైన విద్యార్థులకు, అంగ వికలురులకు అసహాయులైన రోగార్తులకు సాయి సేవగా సహకరించటము, వెచ్చించటము అలవాటు చేసుకోవాలి.

4. వారములో ఒక్కరోజైనా సత్సంగము ఏర్పాటు చేసుకోవాలి వీలుగాకపోతే సత్సంగము జరిగేచోటికి విధిగా వెళ్లటము అలవాటు చేసుకోవాలి. అది నిన్ను నీవు సంస్కరించుకొనే ఉత్తమమైన సాధన.

5. విరామ సమయాన్ని కాలక్షేపపు కబుర్లతో పొద్దుపుచ్చక, శాస్త్ర చర్చలతో గడపక, మహాత్ముల చరిత్రలు చదవటం అలవాటు చేసుకోవాలి. సాటివారికి సాయిని గురించి, వారి లీలలను గురించి చెప్పటం, వారికి సాయిని ఆశ్రయించమని ప్రోత్సాహించటం చాలా మంచిది.

6. శిరిడీ సదా దర్శించాలనే భావన కలిగియుండి అందుకుగాను ఒక హుండీ పెట్టుకొని నీ వద్ద మిగిలిన చిల్లరను అందులో వేసుకుంటూ, "సాయీ మీదర్శనమనుగ్రహించండి, నేను శిరిడీ రావటానికి అనుమతి ప్రసాదించండి" అని వేడుకోవాలి. అందువల్ల సాయిని తలచుకొనే అవకాశము, శిరిడీ దర్శించాలనే కోర్కె తీవ్రతరమౌతుంది. ఏదో వ్యర్థమైన పనులకు ఖర్చయ్యే ఆ చిల్లర శిరిడీకి ఉపయోగపడుతుంది. అప్పుచేసే పరిస్థితి తప్పుతుంది. సంపద పరులుకూడా ఇలాచేస్తే సాయిని రోజూ స్మరించుకొనే అవకాశం లభిస్తుంది.

7.నిరుపేదలైన సాయి భక్తులకు బాబా పటము, బాబా చరిత్ర మొదలైన పారాయణ గ్రంథములు కొని, ఉచితముగా యివ్వటము చాలా మంచికార్యము. సాటివారికి మేలు జరగాలనే ఈ సంకల్పం సాయికి ఎంతో ప్రీతిపాత్రమైనది.

8. సాయి ప్రభోధామృతము చదువుకుంటూ నిన్నటి నీ ప్రవర్తన, నేటి నీ ప్రవర్తన గురించి యోచించి, వివేకముతో ప్రవర్తనను సరిదిద్దుకోవడానికి ప్రయత్నించాలి. అట్టి సద్బుద్ధిని ఆత్మ స్థయిర్యాన్ని ప్రసాదించమని వేడుకోవాలి. నియమము తప్పకుండా సాయి పారాయణను చేసుకుంటూ పోవాలి. ఇంతకంటే ఉత్తమోత్తమమైన సాధన నీ సంస్కారానికి అవసరమయితే సాయియే తెలియజేస్తారు.

అంటూ ముగించారు ఆచార్యులవారు

ఏప్రిల్ 12వ తేదీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ.

సేకరణ : **"విరించి"**

# రామభక్త హనుమాన్‌కీ జై

నాగురువుని నేను సేవించినట్లు నన్ను సేవించిన వాళ్ళు ఒక్కడు కూడా కనిపించలేదు అన్నారు సాయి. అయితే రాధాకృష్ణమాయి, నానాసాహెబ్ చందోర్కర్, దీక్షిత్, ఖపర్దే, సాఠే, శ్యామా, నార్కే మొదలైన వాళ్ళందరూ మరి సాయికేమవుతారు. సాయి తనకు ఎటు శిష్యులు లేరన్నారు కనుక పైన ఉదాహరించిన వాళ్ళు ఏమీకానప్పుడు మనమేమౌతాం. ఇది చాలా పిచ్చి ప్రశ్న. మనము ఎటూ శిష్యులు కాలేము గనుక సాయి భక్తులం. భక్తులకు భగవంతుడు బానిస, నిరంతరం భగవంతుడు వారి వెంట ఉండి కాపాడుతూ ఉంటాడు. అట్లా మనల్ని కూడా సాయి కాపాడాలని మన భావన, అయితే భక్తుడు అంటే గుర్తుకొచ్చేది హనుమాన్ ఒక్కడే, ఎందుకంటే నిరంతరం రామ నామ స్మరణతో తాధ్యాత్మ్యం చెందడమే కాక ఆర్తితో అడిగిన వారికి తన హృదయం చీల్చి రామదర్శనం ఇప్పించగలడు. అందుకే ఆంజనేయుడు రామ భక్త హనుమాన్‌గా ప్రఖ్యాతి కెక్కాడు. మనము భక్తులమే మరి మన హృదయం చీలిస్తే ఏమొస్తుంది, ఏమౌతుంది. ఒక్కసారి ఆలోచించండి. ఇప్పటికీ మనం భక్తులమేనా.

మే 10వ తేదీ హనుజ్జయంతి శుభాకాంక్షలతో...

– **"సత్యాన్వేషి"**






# శ్రీ గురు చరిత్రామృతము

రచన : వి.వి. పూర్ణచంద్రరావు

సకల జనావళిని ఉద్ధరించాలనే లక్ష్యంతో అవతరించిన త్రిమూర్తి స్వరూపమయిన శ్రీ దత్తాత్రేయుడు కలియుగంలో మొదటి అవతారముగా శ్రీపాద శ్రీవల్లభుడిగా, తదుపరి మహారాష్ట్ర దేశంలో కారంజాలోని అంబ, మాధవ శర్మ దంపతులకు రెండవ దత్తావతారము "నరహరి"గా అవతరించటము జరిగింది. బాల్యము నుండి మౌనముగానే ఉండిపోయి, ఉపనయనము అయిన మరుక్షణం నాలుగు వేదాలు వల్లించి, తల్లి దగ్గర భిక్ష స్వీకరించి, భిక్షునిగా జీవించటానికి అనుమతి తీసుకొని, దేశాటన చేస్తూ "ఆనందకాననము" అనబడే వారణాసి పట్టణాన్ని చేరి, గంగా స్నానం ఆచరించి, విశ్వనాథుడిని దర్శించి, ఒక యోగ్యమైన స్థలములో వజ్రాసనము వేసుకొని, ప్రాణవాయువును కుంభించి, ఖేచరీ ముద్రలో నాదానుసంధానుపరులై తన దీక్ష కొనసాగిస్తూ, అచ్చటి యోగులు, తపశక్తి సంపన్నులు, సన్యాసుల ప్రార్ధనను అనుసరించి, దాదాపుగా లుబ్ధమైపోతున్న సన్యాసమార్గాన్ని పునరుద్ధరించటము కోసం, జ్ఞాన వృద్ధులు, వయో వృద్ధులు అయిన శ్రీ కృష్ణ సరస్వతిపాదులను గురువుగా స్వీకరించి, శాస్త్రపద్ధతిన వారి వద్ద సన్యాసము స్వీకరించి, గురువు ఇచ్చిన "శ్రీ నృసింహ సరస్వతి" అనే దీక్షా నామము గైకొని, అక్కడివారికి నాలుగు పురుషార్ధాలు ప్రసాదించగల వేదార్ధాన్ని ప్రవచించి, తదనంతరం అనేక పుణ్యతీర్ధాలు దర్శిస్తూ, బదరికాశ్రమము చేరి, తదనంతరం మేరు పర్వతానికి ప్రదక్షిణంగా సంచరిస్తూ, ప్రయాగలో మాధవుడనే బ్రాహ్మణుడికి తత్వం ఉపదేశించారు శ్రీ గురుడు. అక్కడ వారికి అనేకమంది శిష్యులయ్యారు. వారిలో ముఖ్యులైన మాధవుడు, సిద్ధుడు, బాలుడు, ఉపేంద్రుడు, జ్ఞానజ్యోతి, సదానందుడు, కృష్ణుడు అనే ఏడుగురు శిష్యులతో కలసి, అనేక పుణ్య, తీర్ధ క్షేత్రాలను పావనం చేస్తూ, దక్షిణ దేశమంతా తిరుగుతూ, పూర్వాశ్రమములో తన జన్మ స్థానమైన 'కారంజ' నగరం చేరగా, ఎదురొచ్చి తోడ్కొని వెళ్ళిన తల్లి తండ్రులు, తోబుట్టువులు, నగరవాసులతో ఊరిలోకి ప్రవేశించి, వారి కోరిక మన్నించి, అందరి ఇళ్ళకు ఒకేసారి, అనేక రూపాలతో వెళ్ళి భిక్ష స్వీకరించి, తాము సర్వవ్యాపకుడైన భగవంతుని అవతారమని తెలియజేసి, తన తల్లి తండ్రులకి గత అవతారమైన శ్రీపాద శ్రీవల్లభులుగా దర్శనమిచ్చి, తల్లికి పూర్వజన్మస్మృతి కలుగచేసి, తదనంతరము తత్వం ఉపదేశించగా, సంసార సాగరము నుండి తమను ఉద్ధరించమని కోరిన తల్లి తండ్రులతో, "ఏ వంశములో ఉత్తముడైన సన్యాసి జన్మిస్తాడో, ఆ వంశములోని 42 తరాలవారు తరిస్తారు, ఆ కుటుంబమంతటికీ బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుంది, అంతకు ముందు నరకంలో పడిన పితృదేవతలు కూడ బ్రహ్మలోకం పొందుతారు. మీ కుటుంబంలో నేను జన్మించాను కనుక మీకు బ్రహ్మపదం లభిస్తుంది. మీ పిల్లలు కూడ పూర్ణాయుష్మంతులై, అష్టైశ్వర్యవంతులై సుఖంగా జీవిస్తారు. మీరు వారి బిడ్డలను కూడ చూడగలుగుతారు. చివరిదశలో క్షేత్రాలన్నింటిలో ఉత్తమమైనది, వేదాలచేత కీర్తించబడినది అయిన కాశీలో మీరు నివసిస్తారు. మీకు ఏ చింతా అవసరం లేదు" అని శ్రీ గురుడిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ నృసింహ సరస్వతి తన తల్లి తండ్రులకు అభయమిచ్చారు. అప్పుడు పూర్వాశ్రమములో స్వామివారి సోదరియైన రత్న శ్రీ గురుడికి నమస్కరించి, "స్వామీ నాకు కూడ సంసార తాపత్రయము తొలగించి నిర్లిప్తత ప్రసాదిస్తే, తపస్సు చేసుకుంటాను'' అని ప్రార్ధించింది. అప్పుడు శ్రీ గురుడు చిరునవ్వుతో, "అమ్మా! స్త్రీలకు పతిసేవ వల్లనే మోక్షం లభిస్తుంది. అభీష్టాలు కూడ నెరవేరుతాయి కనుక భర్తయే పరమేశ్వరుడన్న భావంతో ఆయనను సేవించు, గృహిణులకు అదొక్కటే మార్గం అని వేదం కూడా చెబుతుంది" అని అన్నారు. అప్పుడు ఆమె, "స్వామీ మీరు త్రికాలజ్ఞానులు కదా, నా ప్రారబ్ధం ఎలా ఉన్నదో, నా భవిష్యత్తు ఏమిటో తెల్పండి" అని ప్రార్ధించింది. అందుకు శ్రీ గురుడు, "అమ్మా నీ సంస్కారము తామసికమైనది, పూర్వజన్మలో అన్యోన్యంగా ఉన్న దంపతులకు తగవు పెట్టి, వారిని విడదీశావు. అందువలన ఈ జన్మలో నీ భర్త నిన్ను విడిచి సన్యాసి అవుతాడు. గతజన్మలో నీవొక ఆవును కొట్టి చంపేవు. అందువలన నీకీ జన్మలో కుష్టురోగము వస్తుంది" అని చెప్పేరు. వెంటనే రత్న భోరున విలపిస్తూ, "స్వామీ నన్ను ఈ ప్రారబ్ధాలనుండి రక్షించు" అని శ్రీ గురుడి పాదాలపై పడి ప్రార్ధించగా, దయార్ద్ర హృదయులైన శ్రీ గురుడు ఆమెను ఓదార్చి, "అమ్మా మా అనుగ్రహం వలన నీవు ఈ కర్మఫలాన్ని వృద్ధాప్యంలో అనుభవిస్తావు, నీకు

కుష్టురోగమొచ్చినప్పుడు నీకు నా దర్శనమవుతుంది, నీకు ఆ రోగం పొడచూపగానే ఇక్కడకి దక్షిణ దిక్కున ఉన్న భీమా-అమరజా నదీ సంగమ ప్రాంతమైన గంధర్వపురములోని భీమానది తీరంలోని పాపవినాశ క్షేత్రానికి వెళ్ళు, అక్కడ మరల నీకు నా దర్శనమవుతుంది" అని చెప్పి, శ్రీ గురుడు పవిత్రమైన గోదావరి జన్మస్థానమైన నాసిక్ క్షేత్రానికి బయలుదేరేరు.


"ఏ వంశములో ఒక ఉత్తమ సన్యాసి జన్మిస్తాడో ఆ వంశములోని 42 తరాలవారు తరిస్తారు, అంతేకాక మీ పిల్లలు కూడ పూర్ణాయుష్మంతులై జీవిస్తారు" అని తన తల్లి తండ్రులతో పలికిన శ్రీ గురుడు, పూర్వాశ్రమములో తన సోదరి అయిన రత్నకు కర్మ సిద్ధాంతాన్ని బోధించి, ప్రారబ్ధాన్ని అనుభవించాలని చెప్పటంలోని ఔచిత్యము ఏమిటి? ఒక మంచి పుష్టికరమైన విత్తనాన్ని ఇచ్చి, భూమిలో నాటితే కొద్ది నెలలలోనే పుష్కలమైన ఫలాలు వస్తాయి అని చెప్పటము వాస్తవ(ధర్మ)ము అయితే, దానికి తగిన పోషణ చేయకపోతే ఫలాలు పొందలేవు అన్నది ధర్మ(కర్మ) సూక్ష్మం. "నీకు ఫలానా కాలేజీలో సీటు వచ్చింది అంటే, చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగములో చేరినట్లే" అని అంటారు. అది ఎంత వరకు వాస్తవం? కాలేజీలో చేరిన తరువాత, తగురీతిన శిక్షణ పొంది, అన్నింటిలో ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణుడయితే లక్ష్యం నెరవేరుతుంది. అంతేగాని, పేరు చెప్పుకుంటూ, ప్రయత్నం చేయకుండా ఫలితాన్ని పొందగలమా? కనుక స్వధర్మాన్ని ఆచరిస్తూ, సజ్జన సాంగత్యము, సద్బుద్ధి వలన సత్కర్మలు చేయటం వలన అనుభవించ వలసిన చెడు కర్మ ఫలితం తగ్గి, సత్కర్మల ఫలితం వెంటనే ఫలించి కర్మ విమోచనమవుతుంది.

ఆహారం తీసుకుంటూ, చూడకుండా మిరపకాయ తిన్నాం, నోరు మండిపోతున్నది, ఆత్రుతతో ప్రక్కనే ఉన్న మంచినీళ్ళ గ్లాసును అందుకోపోతే, అది చేయి తగిలి ఉన్న నీరు కాస్త నేలపాలయింది. నోటి మండిపోతున్నది, సమయానికి నీరు అందుబాటులో లేక ఆలస్యమవుతున్నది, మంట తీవ్రమవుతూ ఉంది. ఎప్పటికో గాని ఉపశమనం కలుగలేదు. మిరపకాయ తినటం 'ప్రారబ్ధం' కాగా చేసిన దుష్కర్మల కారణంగా, సంచిత కర్మను అధికముగా అనుభవించాల్సి వస్తుంది.



మిరపకాయ తిన్న వెంటనే, మంచి నీరు వెదికితే ప్రక్కన లేదు, అయితే ఎదుట కూర్చున్న వ్యక్తి తన దగ్గరున్న తీపి పదార్థాన్ని అందించటమే కాకుండా తన సంచిలోని సురక్షిత మంచి నీటి సీసాను అందించటం, సత్కర్మ, సాధు, సజ్జన సాంగత్యము వలన కలిగే ఫలితం. ఇక్కడ ప్రారబ్ధం ఉంది కాని, అది సత్కర్మల ద్వారా దాని ఫలితం అతి తక్కువగా అనుభవమయింది. అదే శ్రీ గురుడు తన సోదరి రత్నకు బోధించింది. గత జన్మలో చేసిన పనుల ఫలితంగా ఈ జన్మలో నీకు తామసికమైన సంస్కారముతో పాటు కుష్టురోగము కూడ సంక్రమిస్తుంది అని చెబుతూనే, దానికి నివారణోపాయముతో పాటు, ఆ సమయములో తన దర్శనం కూడ లభిస్తుందని, వ్యాధి నివారణ అవుతుందని చెప్పటం, ఆ వంశములో శ్రీ గురుడు పుట్టడము వలన కలిగిన సత్ఫలితం.

సత్పురుషుల దర్శనానికే అంత ప్రభావం ఉంటే, వారు చూపిన మార్గంలో పయనం చేస్తే ఇంకెంత ఫలితం ఉంటుందో కదా! అందుకు ఆలంబనే సత్సంగమము. తద్వారా సత్పురుషుల సమాగం కోరిన మనస్సు తీవ్రమైన ప్రయత్నం కొనసాగించి, పుణ్యతీర్థ యాత్రలుకు దారితీయగా, తద్వారా పాపకర్మ ప్రక్షాళనం చేసుకొని, పవిత్రత చెందుతుంది. సాయి కోరిన రెండు పైసలు దక్షిణ, ఒకటి ధనంపై మమకారం, రెండు మోహపరమైన కోరికలను త్యజించటం, ఇది మొదటి సోపానము. దక్షిణలో ఒకటి కాలం, రెండు మనస్సు, ఇది సాధనలో రెండవ సోపానము. ఇష్టా, అయిష్టాలను జయించటం ఇది మూడవ సోపానము. ఈ మూడు సోపానాలు అధిరోహించటము ద్వారా త్రిమూర్తి స్వరూపుడయిన జగద్గురువు అనుగ్రహము పొందగలుగుతాము. అందుకే "నలుగురు ఒక్కచోట చేరి నా నామం పలికేవారు, నా సంకీర్తన చేసేవారు, నా చరిత్ర పారాయణ చేసేవారు ఇహపరాలు గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు, వారి కర్మ నశిస్తుంది" అంటారు జగద్గురువు. సత్సంగము ద్వారా కాలము, మనస్సు సద్గురువుకు సమర్పించటము ప్రారంభించి, పుణ్య క్షేత్రాలు, తీర్థక్షేత్రాల యాత్రల వలన ఇష్టా అయిష్టాలు జయించుకుంటూ, అచ్చట సాధు సత్పురుషుల దర్శన, ఆశీస్సుల ద్వారా వ్యామోహాలు ఉడిగి మానవ జన్మ సార్థకం చెందించుకోవచ్చు. అందుకనే మన పూర్వీకులు ఆయా పర్వదినాలు, పండుగలు, ఉత్సవాల పేరిట తీర్థయాత్రలు చేసేవారు. వాటి అంతరార్థము మరచి నేడు వాటిని కూడ విలాసయాత్రలా చేస్తూ, సరియైన ఫలితం పొందలేక, ఆయా తీర్థాలను, పుణ్య క్షేత్రాలను నిరసిస్తూ, నిందిస్తున్నారు కొందరు. "శాస్త్రాలు ఎన్నటికీ అబద్ధం కాదు, వాటి విషయాల పట్ల పనికిరాని అన్వయాన్ని మనస్సులో పెట్టుకొని జీవిస్తున్నావు" అన్న సాయి మాట ఇక్కడ గమనార్హం. గురువు ఎప్పుడూ శాస్త్రాన్ని త్రోసిరాచరు. వాటిని నిజం చేయటానికే వస్తాడు. అందుకే త్రిమూర్తి స్వరూపుడు, దత్తావతారుడైన శ్రీ గురుడు కూడ ఇతరులకు ఆదర్శముగా నిలవటం కోసమే, గంగా ప్రదక్షిణ చేస్తూ అనేక తీర్థాలను, పుణ్యక్షేత్రాలను తన పాద స్పర్శతో పునీతం చేశారు.

తన సోదరి అయిన రత్నకు కర్మ విమోచన మార్గాన్ని బోధించిన శ్రీ గురుడు తన శిష్యులతో కలసి, నాసిక్‌కు బయలుదేరేరు. పరమేశ్వరుడైన శ్రీ గురుడు నాసిక్, త్రయంబకానికి బయలుదేరిన తరువాత జరిగిన అక్కడి విషయ విశేషాలను వచ్చే సంచికలో ప్రస్తావించుకుంటాను.




# ఒక్క క్షణం !

శ్రీ నారద మహర్షి ఒకనాడు శ్రీకృష్ణునితో "ఓ పరమాత్మ! నాకు మాయను చూపుము" అని అడిగేడు. శ్రీ కృష్ణుడు చిరునవ్వే సమాధానమిచ్చాడు. కొన్ని రోజులు గడిచినవి. ఒకరోజు శ్రీకృష్ణుడు నారదుడుని తనతోపాటు ఒక ఎడారిని చూచుటకు తీసుకొని వెళ్ళెను. చాలా దూరం నడిచాక శ్రీకృష్ణుడు నారదునితో "నేను చాల దప్పికకొని ఉన్నాను. నాకు కొంచెము నీళ్ళు తీసుకొని రాగలవా?" అని అడిగేడు. వెంటనే నారదుడు "ఇప్పుడే వెళ్తాను స్వామీ! నీళ్ళు తీసుకొని వస్తాను" అని బయలుదేరేడు నీటికోసం.



కొద్ది దూరంలో ఒక గ్రామము ఉంది. నారదుడు ఆ గ్రామములోకి వెళ్ళి నీటికోసం వెతుకుతూ ఒక ఇంటి తలుపు తట్టాడు. అతి సుందరమైన యువతి తలుపు తెరిచింది. ఆమెను చూడగానే నారదుడు తన ప్రభువైన శ్రీకృష్ణుడు చాలా దాహంతో ఉన్నాడనీ, నీరు దొరకక ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడన్న విషయమును, సర్వమూ మరిచిపోయి ఆ యువతితో మాట్లాడ ప్రారంభించాడు. ఆ యువతి సౌందర్య పిపాసలో పడి నారదుడు శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్ళలేదు. మరల మరల ఆ ఇంటికి వెళ్ళి ఆ యువతితో మాట్లాడుతూనే ఉన్నాడు. మాటలు ముదిరి ప్రేమగా మారింది. ఆ యువతి తండ్రిని, నారదుడు ఆ యువతితో వివాహము కోసమై అభ్యర్థించాడు. వారిద్దరి వివాహము జరిగింది. ఆనందముగా జీవిస్తూ, సంతానాన్ని పొందేరు.ఆ రకంగా పన్నెండు సంవత్సరాలు గడిచినవి. మామగారు చనిపోగా, ఆయన ఆస్తికి నారదుడే వారసుడైనాడు. భార్య బిడ్డలతో, పాడి పంటలతో, ఇత్యాదులన్నిటితో తాను చాలా సుఖంగా జీవిస్తున్నానని ఆనందించేవాడు నారదుడు.

అటువంటి సమయములో ఒక వరద వచ్చింది. ఆ రాత్రి నదిలో నీరు పొంగి గట్లు తెంచుకొని, గ్రామాన్నంతా నీటితో ముంచివేసినది. ఇళ్ళు కూలిపోయాయి, మనుష్యులు, జంతువులు మునిగిపోయారు, కొట్టుకొని పోయారు. ప్రతి ఒక్కటి ఆ వరద ప్రవాహపు ఉధృతిలో తేలిపోయింది. నారదుడు ఏదో విధంగా తప్పించుకోవటానికి ఒక చేత్తో భార్యని, మరొక చేత్తో ఇద్దరి పిల్లల్ని, ఒక బిడ్డను భుజాలపైన ఎక్కించుకొని ఆ భయంకరమైన వరదలో రేవు దాటడానికి ప్రయత్నిస్తున్నాడు, అతికష్టము మీద కొద్దిదూరం నడిచాడు. ప్రవాహం మరింత ఉధృతమయింది. భుజాలపై ఉన్న బిడ్డ నదిలో పడి కొట్టుకొని పోయినాడు. నిరాశతో రోదించాడు నారదుడు. ఆ బిడ్డను రక్షించాలన్న ప్రయత్నంలో చేతిలో గల బిడ్డలపై పట్టుతప్పి, ఆ బిడ్డలు కూడా నీటిలో కొట్టుకొనిపోయారు. చివరికి తన శక్తినంతా ఉపయోగించి, గట్టిగా కౌగిలించుకొని ఉన్న అతని భార్య కూడా ప్రవాహపు వేగంలో నారదుడి నుంచి విడివడి కొట్టుకొనిపోయింది. నారదుడు తీరానికి విసిరి వేయబడ్డాడు. అతి దీనంగా బిగ్గరగా విలపిస్తూ, రోదిస్తూ ఉన్నాడు నారదుడు.

ఇంతలో అతని వెనుక ఒక మృదువైన స్వరం "నారదా! దాహంతో నాలిక పిడచకట్టుకు పోతున్నది, ఘడియలు గడుస్తున్నా ఆలోచనా స్రవంతిలో మునిగి బయటకు రావా! నీరు తీసుకురావా!" అని వినిపించటముతో, ఉలిక్కిపడి బాహ్య ప్రపంచములోకి వచ్చాడు నారదుడు. తనను, తన కుటుంబాన్ని నాశనం చేసిన వరదనీరు, ఆ పరిసరాలు ఎక్కడా కనిపించలేదు. ఎడారిలో తాను, తనప్రక్కన శ్రీకృష్ణుడు ఉన్నాడు. అంటే ఇంతవరకు తాను అనుభవించిన జీవితం కలలోనా, వాస్తవం కాదా? అది అంతా మాయ అన్నమాట అని అనుకున్నాడు నారదుడు. అతని భావన పసికట్టిన శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వేరు.

"బ్రహ్మ నా తండ్రి, మాయ నా తల్లి. వారిద్దరి ఐక్యత వల్లనే నాకీ దేహం వచ్చింది" అన్నారు సాయి. పుట్టుకకు కారణమై పెంచి, పోషించి తన ఎదుగుదల కాంక్షిస్తూ, తనకన్నా ఉన్నత స్థితికి ఎదగాలని కోరుకునేవాడు తండ్రి. మనచుట్టూ (స్త్రీ – ప్రకృతి) తల్లి, చెల్లి, భార్య, పిల్లల రూపంలో నిరంతరం చుట్టూ ఆవరించి అనురాగ రూపంలో బంధించివేసి, గమనిస్తూ గడిపినవారికి సంతోషాన్ని, ఆదమరిచి అందులో చిక్కుకున్నవారికి దుఃఖాన్ని ప్రసాదించేది, మాయా రూపంలోని ప్రకృతి. ఏ ప్రకృతి అయితే సాధకులకు సహకారి అయ్యి, వారిని గమ్యానికి చేరుస్తుందో, అదే ప్రకృతి గమనించలేని వారిపట్ల వికృతియై వారిని భావాలలో చిక్కి నశించేలా చేస్తుంది, ఆ భ్రమే మనలను ఈ రీతిలో జీవింపచేస్తుంది. దాని పొందుకై నిరంతరం తహతహలాడుతూ, సుఖ దుఃఖాలలో మునిగితేలుతూ, కర్మవలయంలో చిక్కి కొట్టుమిట్టాడుతూ, ఏ పూర్వజన్మ సుకృతం వల్లనో సద్గురువు సాంగత్యం లభించినా, లౌకిక సుఖ సంపదలు కోరి, వాటిలో మునిగి తేలుతూ, అవి ప్రసాదించిన సద్గురువుకు దూరంగా జరిగి, కాలప్రవాహంలో కొట్టుకుపోవటం జరుగుతున్నది. జగత్పిత అయినటువంటి సాయినాధుడు పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లు అనేక మిషలమీద తన దగ్గరకు లాగి, కార్యకారణ సంబంధం వలన కోరికలు కష్టాలు తీరుస్తున్నా, నిరంతరం వాటి ప్రవాహంలో మునిగితేలుతూ, ఏ మిషమీద, ఏమి ప్రసాదించటానికి తన వద్దకు లాగేడో మరచి, ఆయన ప్రసాదించే శాశ్వత ఆధ్యాత్మిక సంపదవైపు తేరిపార చూడకుండా, ఆయన ఇవ్వదలచింది పొందకుండా, పూవులా, పిందెలా రాలిపోవటం జరుగుతున్నది. "నిరంతరం నాగురించే చింతన చేస్తూ, నా లీలలు పారాయణ చేసేవారు, ఇహపరాల గురించి ఆలోచించాల్సిని పనిలేదు, వారి కర్మ నశిస్తుంది, వారే నేనుగా మారిపోతారు" అన్న సద్గురు అభయం కూడ మరిచి, "కాలప్రవాహము అనే నీరు, నీమీద ప్రవహిస్తుంటుంది, కదలక నిలిచి ఉండు, నిన్ను నీవు కడుక్కోనక్కరలేదు, మట్టికొన్న నిన్ను బంగారం ముద్దలాగ మార్చేస్తుంది" అని సాయిమాస్టర్ అనుభవసారాన్ని అందించినా, అందుకోలేక ఎన్నో సంవత్సరాలనుండి పారాయణ చేస్తూ కూడా పరిణితి రాకుండా, చెల్లని నాణెంలా సద్గురువు చేతిలో నుండి జారిపోయి, మాయా ప్రపంచపు ప్రవాహంలో కొట్టుకుపోతామో లేక "తండ్రికి తగ్గ బిడ్డలుకండి మీ భాండగారాలు నింపుకోండి" అన్న సాయి హెచ్చరికను ఆచరణచేసి, ఉత్తమబిడ్డలుగా మిగులుదామో ఒక్క క్షణం ఆలోచించి ముందుకుసాగుదాం.

మీ **వి.వి.పూర్ణచంద్రరావు**

# అవధూత శ్రీ చివటం అమ్మ

ఆంధ్రదేశంలో అవధూత సంప్రదాయంలో విలసిల్లిన ముగ్గురు స్త్రీమూర్తులను అవధూత ప్రపంచానికి సామ్రాట్టులుగా చెప్పవచ్చు. వారు పరమాత్మ సాక్షాత్కారం పొందిన పుణ్యశీలురు. వారే 1. కురుమద్దాళి మాలపిచ్చెమ్మ 2. మావుళూరు బుచ్చెమ్మ 3. చివటం అచ్చెమ్మలు. పూజ్యశ్రీ భరద్వాజ మాస్టారుగారు దర్శించిన పుణ్యమూర్తి అవధూత సాధుమాతశ్రీ చివటం అమ్మ.



అమ్మ తపస్సు చేశారు. నామజపం చేశారు. రామనామం చాలా ప్రీతిగా చేసేవారు. సామాన్య గృహిణిగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ నిరంతర నామస్మరణ చేసి అవధూతగా మారారు. ఆసాధనే తాను చేశారు, ఇతరులను అదే చెయ్యమన్నారు. "ఈ రోజు మరలా రాదే! రామ, రామ అనుకో అదే సాధన" అన్నారు.

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారుగారు అమ్మను దర్శించిన సన్నివేశం చాలా గొప్పది. ఆచార్యుల వారికి ఎదురువచ్చి అమ్మ స్వాగతం చెప్పారు. ఆచార్యులవారు రాకముందే వారు చివటం వస్తున్నారని చెప్పి అన్ని సౌకర్యాలు చూచేవారు అమ్మ. ఆచార్యులవారు వచ్చినప్పుడు శ్రీసాయినాధులవారు వచ్చినంతగా ఆనందించేవారు. ఆచార్యుల వారిని పెదబాబు అని సంభోదించేవారు చివటం అమ్మ. వారు పెద్దగా మాట్లాడుకొన్న సన్నివేశాలు చాలా తక్కువ. మౌనమే వారి సంభాషణ. ఆచార్యులవారు వచ్చిన ప్రతిసారి రామాలయంలో సత్సంగం చేసేవారు. అమ్మ ఎంతటి గొప్ప వ్యక్తో వివరించేవారు.

పూజ్యశ్రీ ఆచార్యులవారు ఒకసారి రామాలయంలో సాయిని, అమ్మను పూజించుకోవాలని సంకల్పించారు. కృష్ణ అనే భక్తుడిని అమ్మను ఆహ్వానించి ఆలయానికి తీసుకొని రావలసినదిగా చెప్పారు. ఎన్నిసార్లు బ్రతిమిలాడినా అమ్మరాలేదు. ఆ విషయం కృష్ణగారు ఆచార్యుల వారితో చెప్పగానే, "ఓహో అలాగా" అని ధ్యానస్థులైనారు. ఆశ్చర్యంగా 10 నిముషములలో ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ అమ్మ రామాలయానికి వచ్చారు. అమ్మను సాయిపటం ప్రక్కన ఆశీనురాలును చేసి, పూలతో అమ్మను పూజించారు ఆచార్యులవారు. తమపై పడిన పూలను అమ్మ సాయిపటం మీద వేసి నవ్వుకోసాగారు. ధ్యాత-ధ్యేయ-ధ్యానముల ఏకరూపతకు ఇది ప్రత్యక్ష నిదర్శనం.

ఆచార్యులవారి భక్తులు ఎవ్వరు వచ్చినా అమ్మ 'సాయిలీలామృతం' చదివించేవారు. సాయిభక్తులు ఎవరువచ్చినా మౌనము విడనాడి సాయిబాబా, సాయిబాబా అనేవారు. సాయిబాబాను నమ్ముకోమని ఆ మార్గాన్ని అనుసరించమని బోధించేవారు. తృప్తిగా భోజనం పెట్టి పంపించేవారు.

ఆచార్యుల వారు అమ్మ భౌతిక దేహంతో ఇంక ఎక్కువకాలముఉండరని తెలిసికొని త్వరగా అమ్మను దర్శించుకోమని సాయిభక్తులకు చెప్పేవారు. ఒక భక్తురాలి ద్వారా అమ్మ వివరాలు సేకరించి "సద్గురు దర్శనం" అనే సావనీర్‌లో అమ్మను గురించి ప్రచురించారు. అది చదివి చాలామంది అమ్మను దర్శించుకొని ధన్యత చెందేరు.

ఒకసారి మాష్టరుగారు చివటంలో వున్నప్పుడు మాష్టరుగారిని భోజనానికి రమ్మనమని అమ్మ కబురు చేశారు. మాష్టరుగారు రామాలయం వద్దకురాగానే అమ్మ కూడా వచ్చారు. మాష్టరుగారి చేతివేళ్ళను తన చేతివేళ్ళతో పట్టుకొని నడిచారు అమ్మ. అలా వెళ్తున్న సమయంలో మాష్టరుగారు అమ్మపొట్టను నొక్కేరు. వెంటనే అమ్మ రెండుచేతులు చూపించి నవ్వేరు. మాష్టరుగారు ఇంకొంచెం అమ్మపొట్టను గట్టిగా నొక్కారు. అమ్మ రెండు చేతులు దూరంగా జరిపి నవ్వేరు. మాష్టరుగారు ఎంత అన్నట్లుగా చూశారు. అమ్మ చేతులు ఇంకా జరిపి "ఇంత" అన్నట్లుగా నవ్వేరు. తర్వాత కొంతకాలానికి గాని ఈ వింత చర్య మాకు అర్థంకాలేదు. అమ్మ తన పార్థివ దేహాన్ని వీడి, అనంత చైతన్యంలో విలీనమవుతున్నానని ఆచార్యుల వారికి సూచించారన్నమాట.

ఒకసారి ఒక భక్తుడు అమ్మవద్దకు వచ్చి నేను పెద్దల వద్ద రామమంత్రం. శివమంత్రం, మేధాదక్షిణామూర్తి మంత్రం ఉపదేశం పొందాను. అవి చేస్తున్నాను. వాటితో కలిపి సాయి మంత్రం కూడా జపించవచ్చా? అని అడిగారు. అమ్మ, **"సాయి వద్దకు వచ్చిన తర్వాత ఏ మంత్రంతో పనిలేదు. ఆ మార్గంలో సాగిపొండి"** అన్నారు.

నిజమైన మహాత్ములు ఎలా వుంటారో, వారి సన్నిధి ప్రభావం ఎలాంటిదో తెలియచెయ్యటానికి అమ్మ జీవిత విశేషాలను సేకరించి గ్రంధరూపంలో అమ్మ జీవిత సంగ్రహాన్ని సాయిభక్త లోకానికి అందించారు ఆచార్యులవారు.

ఆచార్యులవారిని గురించి అమ్మ ఒకసారి ఇలా అన్నారు. "భరద్వాజ అంటే ఏమిటి? త్యాగం" అన్నారు. అదే ఆచార్యులవారి స్థితి.

అమ్మ సిద్ధి పొందిన తరువాత ఆచార్యులవారు గ్రామ పెద్దలతో అమ్మ అంతటి అవధూత అరుదు. వారు మీకు లభించటం ఎంతో అదృష్టం. వారిని ఊరి బయటనో, శ్మశానంలోనో సమాధి చెయ్యకండి, ఇక్కడే సమాధి చెయ్యండని చెప్పారు. భక్తులు మనస్ఫూర్తిగా ఆచార్యులవారి ఆదేశాన్ని అమ్మ సిద్ధి పొందినప్పుడు ఆచరించారు.

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణం నుండి 7 కి.మీ.ల దూరంలోని చివటం గ్రామంలో అమ్మ సమాధి మందిరం కలదు.

(జేష్టశుద్ధ సప్తమి జూన్ 20వతేదీ బుధవారం శ్రీ చివటం అమ్మ ఆరాధనోత్సవం సందర్భముగా ప్రత్యేక వ్యాసం)

రచన : **కె.వి. రంగారావు**, ఒంగోలు

# జిజ్ఞాస

**ప్రశ్న : బాబాగారి వద్ద కుక్కలు ఎప్పుడు ఎందుకు వుంటాయి? అసలు దత్తాత్రేయుని వెంట ఈ కుక్కల రహస్యం ఏమిటి?**

**జవాబు :** "The Origin of Dattatreya" అనే Ph.D గ్రంథంలో శ్రీ దత్తమూర్తి వెంట కుక్కలు ఇతిహాసకాలం నుంచి వుంటూ వచ్చాయని వ్రాయబడి వుంది.

భగవంతుడు ఎవరైనా అన్నీతానే అయిన ఆయన ఈశ్వరుడు. ఈశ్వరుని క్షేత్ర పాలకుడు భైరవుడు. కుక్కలకు అతీంద్రియ జ్ఞానం వున్నట్లు చాలా చోట్ల చదివినాము. పసిగట్టే శక్తి దానికి జన్మతః వున్న లక్షణం. విశ్వాసానికి మారు పేరు భైరవం. అంటే పరబ్రహ్మ స్వరూపాన్ని త్వరగా గుర్తించే శక్తి ఆ జాతికి వున్నది. పురాణాలలో వున్న కుక్కల మాట అటుంచి కంచికామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి వారిని అనుసరించి తరించిన కుక్క వివరము చూస్తే దాని "అతీంద్రియ జ్ఞానం" దైవత్వాన్ని గుర్తించగలదు అని తెలుస్తుంది. అందుకనే దత్త స్వరూపుల వెంట దత్తాత్రేయుల వారి అంశావతారముల వెంట కుక్కలు ఎప్పుడు ఉంటాయి. ఇంతెందుకు ఆచార్యులవారి సత్సంగానికి విధిగా కుక్కలు వచ్చేవి. అందులో కొన్ని శ్రద్ధగా చెవులు నిక్కబొడుచుకొని వినేవి. ఇది చాలా మంది చూచిన ప్రత్యక్ష నిదర్శనం. పైగా సామెతగా ఒక కథ చెబుతారు. కుక్క దాని గుంటలో వున్నంతసేపు మంచి ఆలోచనలు చేస్తుందని, లేవగానే తన సహజగుణాలకు లోనవుతుందని, అందరినీ సద్గురు సన్నిధి వదలవద్దని, కుక్కలు దత్తమూర్తి వెంట వుంటాయేమో!

అందుకనే వాటి మాదిరి విశ్వాసంతో సద్గురువును అనుసరించమని ఆ జీవులు దత్తమూర్తిని అనుసరిస్తాయేమో మరి! పైగా కృతజ్ఞతను ఎన్నడూ మర్చిపోని జీవి కుక్క. దైవానికి సదా కృతజ్ఞత తెల్పడంలోని ఆంతర్యం ఇలా సూచించబడి వుండవచ్చు.

**ప్రశ్న : బాబా 12 సంవత్సరాలు గురుసేవ చేశారు అన్నారు కదా? 12 సంవత్సరాలు గురుసేవలో అంతరార్థం ఏమిటి?**

**జవాబు :** శ్రీ సాయినాధుల వారు 12 సంవత్సరాలు భూగృహంలో తపము ఆచరించినట్లు చెబుతారు. భగవాన్ శ్రీ రమణులు తిరువణ్ణామలై దేవాలయంలోని ఒక గుహలో 12 సంవత్సరాలు తపము ఆచరించారు. శ్రీరామకృష్ణుల సాధన అంతయూ దక్షిణేశ్వరమున 12 సంవత్సరాల పాటు కొనసాగింది. (రామకృష్ణులు దక్షిణేశ్వరము చేరి, నిర్వికల్ప సమాధి నొందేవరకు ఆ సమయంలో రమారమి 12 సంవత్సరాలు తోచుచున్నది.) పూజ్యశ్రీ ఆచార్యులవారి అన్వేషణ 12 సంవత్సరాలు కొనసాగి, వారు దివ్యాత్మస్థితిని పొందినట్లుగా వారి గ్రంథములలో కనపడుచున్నది. ఈ పన్నెండు అనే సంఖ్య గురుశిష్య సంప్రదాయంలో చాలా ప్రాముఖ్యమును పొందింది.

దానికి శ్రీ పరమహంస ఇలా చెప్పారు : 12 సంవత్సరాలు ధైర్యరేతస్కుడై (పూర్వము కామ సుఖము అనుభవించి యున్నను అటుపై అఖండ బ్రహ్మచర్యము అవలంభించినవాడు "ధైర్యరేతస్కుడు" అని పరమహంస ఉవాచ) బ్రహ్మ చర్యమును పరిపాలించు వాడు అసాధారణ శక్తిని పొందును. వానియందు అంతర్గతమైన "మేధనాడి" అను కొత్త నాడి బయలుదేరును. నందుమూలమున నతడు సమస్తము గ్రహింప గలుగును. సమస్తము ప్రసాదించగలుగును.

**ప్రశ్న : "నాకర్పించకుండా ఎవరు ఏమీ తినరో వారికి నేను బానిసను" అన్నారు సాయి, అర్థం వివరించగలరు.**

**జవాబు :** సాయి "నాకేమి అర్పించకుండా తినడో" అన్నారు, అంటే అర్పించి తినాలి. ఏమి అర్పించాలి? భగవంతుడు లేక సద్గురువు దయతో అనాయాచితంగా ప్రసాదించినది ఈ జీవితం. ఈ జీవితంలో ఆయన మనకు సమకూర్చినవి, తిరిగి ఆయనకు కొంతలో కొంతైనా అర్పించడమే నిజమైన కృతజ్ఞతా భావం.

ఈ దేహానికి సర్వ, అవయవములు పనిచేసేలా సృష్టించి ప్రసాదించాడు. ఉపాధి కొరకు ఈ దేహాన్ని పోషిస్తున్నా, ఆయన దయతో సమకూర్చినందుకు, ఆయన సేవ ఈ దేహంతో (కాయికసేవ) కొంతలో కొంతైనా చేయాలి. కాలము ఈశ్వర ప్రసాదితము. యీ కాలాన్ని, సమయాన్ని మనకొరకే వాడుకున్నా, కొంతకాలము లేక సమయం ఆయనకు విధిగా అర్పించాలి. (పారాయణ, పూజ, ధ్యానం, ఆరతి ఇలా)మనకు సంప్రాప్తించే సంపద అయాచితంగా ఆయన ప్రసాదించినదే, అందుకని అందులో కొంత, మనశక్తి మేరకు సాయి సేవగా ఇతరులను నిజమైన అవసరము ఉన్నవారిని ఆదుకోవడం, మన కర్తవ్యంగా భావించాలి.

మనం భుజించే ఆహారం పంచభూతముల సమిష్టి యజ్ఞం వల్ల లభిస్తుంది. శ్రీసాయి పంచభూతాత్మ స్వరూపులు. అలా "అమ్మా! ఆకలి!" అన్న అన్నార్తునికి ఆహారం అర్పించడం మన కర్తవ్యంగా భావించాలి.

మనం చేసే ప్రతి కామ్యకర్మ ఏదో లబ్ధిని ఆశించే చేస్తాము. ఆ లబ్ధి పొందినప్పుడు అది శ్రీసాయి దయతో సమకూడినది అని గుర్తుంచుకొని "ఆ కర్మఫలం"లో కొంత సాయికి అర్పించడం (అనగా సాటి వారిలో అర్హులైన నిరుపేదలకు) మన విధి. ఇలా చేయడం వలన కొంత కాలానికి "నిష్కామకర్మ" సులువు అవుతుంది.

ఇలా అర్పించడం అభ్యాసం చేస్తే చివరకు ఈ జీవితము ఆయనకే అర్పణ అవుతుంది. – ఇలా అన్నీ అర్పించిన వానికి, అలా అర్పించి తినేవారికి నేను బానిసను అని బాబా భావం.


సమాధానములు : **"నామధారకుడు"**

సేకరణ : **శ్రీమతి కె. సాయి ప్రత్యూష**, గోవా

# శ్రీ శివనేశన్ స్వామి

శ్రీ శిరిడీసాయిబాబా దేహానంతరము యితర ప్రాంతము నుండి వచ్చి శిరిడీలోనే ఉండి తన జీవితమును సాయిసేవలో పూర్తిగా గడిపి జన్మను తాను సార్ధకత చేసుకొనుటయే కాక, ఎందరికో సాయిభక్తి కలిగించిన సాయి అంకిత భక్తులు వీరు.

తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరు జిల్లా రత్నషేగపల్లీలో శ్రీకాళప్పనాయకర్ ముత్తయ్య, శ్రీమతి అమేరులకు చివరి సంతానముగా 1927 సం.. ఏప్రిల్ నెల 12వ తేదీ శ్రీరామనవమి రోజు పూజ్యశ్రీ శివనేశన్‌స్వామి జన్మించిరి. కారణజన్ములైన వీరు పుట్టుకతోనే నోటి యందు రెండుపళ్ళు, తలపై బ్రహ్మజ్ఞానమునకు చిహ్నమైన పిలకతో ఉండిరి. వీరి కుటుంబములోని వారందరూ శివభక్తులగుటచే స్వామీజీకి శివనేశన్ అని నామకరణ చేసినారు.



చిన్నతనములో వీరు పడుకునప్పుడు ఒక త్రాచుపాము పడగ విప్పి వారి శిరస్సుపై పడగ పట్టినది. శ్రీ శివానంద స్వామీజీ, వారి దైవభక్తిని గమనించి భారత భాగవతములను బోధించిరి. పేదరికం వలన చదువుసాగక చిన్నతనంలోనే అనేక కష్టాలుపడి చిన్న చిన్న పనులు చేసి తల్లిని పోషించుచుండిరి. తల్లి మరణముతో ఎవరికి చెప్పక 15వ సం.. వయస్సులో బొంబాయి నగరము చేరిరి. అక్కడ ఒక తమిళ ముసల్మాన్ దగ్గర ఆశ్రయము పొంది, ఉద్యోగ ప్రయత్నంలో అనేక రోజులు ఉపవాసము ఉండెడివారు. ఎన్నో కష్టాలకు ఓర్చుకొని రాత్రిళ్ళు సముద్రపు ఒడ్డున ధ్యానము చేయుచుండెడివారు.

ఇలాటి సమయంలో వారికి వారి గురువు గారైన శ్రీముత్తయ్యతో పరిచయము ఏర్పడినది. వారు మనస్సును శుభ్రముగా ఏ మలినము లేకుండా స్వాదీనములో ఉంచుకొని దైవధ్యానం చేయడం ఒక్కటే ధ్యానానికి మార్గమని బోధించిరి. దినమంతా పనిచేసి, గురువుగారి సేవలో ఉండీ, తీరిక సమయంలో భారత, భాగవత, రామాయణ గ్రంథాలను పఠించి, సందేహాలను గురువుగారి నడిగి తీర్చుకొనేవారు. ఒకసారి కాలినడకన బొంబాయి నుండి గణేశపురికి వెళ్ళి నిత్యానందస్వామిని దర్శించుకున్నారు. స్వప్నములోని ఫకీరు వేషధారి అయిన ఒక సాధువు దర్శనం "శిరిడీకిరా" అన్న పిలుపు మేరకు , తన గురువుగారి అనుమతి పొంది, చేతిలో చిల్లిగవ్వ లేనందున రైలు పట్టాల వెంబడి నడచుకుంటూ మార్గములో ధబోళ్కరు, చందోర్కరు గృహములు చూచి నాసిక్ చేరారు. తన భక్తుని రాకకు తానే ఏర్పాట్లు ఎలా చేసారో సాయిబాబా జీవిత చరిత్రలో చూడవచ్చు. అలానే స్వామీజీ విషయంలో కూడ బాబా వారికి దారిలో ముగ్గురు సాధువులతో పరిచయం, మరియు రాత్రి పూట పోలీసులు వారిని జీపులో ఎక్కించుకొని స్టేషన్ దగ్గర దింపడం, మరియు ఎవరో తెలియని వారు వీరికి టీలు, బిస్కెట్లు ఇచ్చుట జరిగినది. 1953లో తన 26వ ఏట శ్రీశివనేశన్ స్వామి పవిత్రమైన సాయిపాద స్పర్శతో పునీతమైన శిరిడీ చేరిరి. అప్పటినుండి 1996 వరకు 43 సం..లు స్వామి సాయిసేవలో తన జీవితము గడిపిరి.

ప్రతిరోజు స్నానం చేసి నాలుగు గంటల వరకు ధ్యానం చేసి, ద్వారకామాయి తెరిచే సమయానికి లెండిబాగ్‌లోని బావి నుండి నీరు తెచ్చి ద్వారకామాయి శుభ్రము చేసి, బాబా పటములకు గంధము, కుంకుమ బొట్లు పెట్టి అలంకరించేవారు. ద్వారకామాయిలో దీపాలు శుభ్రము చేసి వెలిగించేవారు. ఇలా నిస్వార్ధసేవ చేయుచున్న స్వామిజీని గుర్తించి సాయి సంస్థాన్‌వారు చావడి బాధ్యతను ఆయనకు అప్పగించారు. వారు ప్రతి గురువారం చావడి తెరిచి శుభ్రము చేసి ఎంతో అందముగా అలంకరించేవారు. చావడిలో సంకీర్తన చేయటంతో స్వామిజీని "చావడి బాబా' అని పిలిచేవారు. వారు చాలాసంవత్సరాలు ఒక తుండు మాత్రము కట్టుకునే వారు. సమాధి మందిరములో శ్రీ సాయిబాబాకు నివేదించిన భోజన ప్రసాదాన్ని సంస్థానము వారు స్వామిజీకి ఇచ్చు చుండిరి. ద్వారకామాయిలో పల్లకి ప్రక్కన గల గదిలో ఉండటానికి వసతి కల్పించిరి. ప్రసాదం పంపే కవర్లపై చిరునామాలు వ్రాసే పని చేయుచున్నందుకు నెలకు రూ. 15/-లు ఇచ్చేవారు. ఇలా శిరిడీ పిలిపించుకొని తన సేవ చేయించుకుంటూ స్వామీజీకి కావలసిన అన్ని ఏర్పాట్లు బాబాయే చేసారు.

శిరిడీ దర్శించే అనేకమందికి అన్ని సదుపాయాలు వీరు కలిగించేవారు. ఊది దివ్యౌషధమని, శ్రీసాయిబాబాపై భారమువేసి ఊదిని సేవిస్తే ఎటువంటి అనారోగ్యమైన పూర్తిగా తగ్గి ఆరోగ్యం పొందుతారు అని చెప్పేవారు. బాబా తన వాక్కు స్వామికి వినిపించటమే కాదు శ్రీశివనేశన్ స్వామి రూపములో భక్తులను ఆదుకొనుచుండిరి. ఎందరో భక్తులకు వారి రోగములకు సరిపడు మందును బాబా స్వామి ద్వారా ప్రసాదించుచుండిరి. ఎన్ని లీలలు జరిగినా స్వామీజీ తాను "సాయిసేవక్'' సాయిసేవకుడనని మాత్రమే చెప్పుకొనేవారు. 1980 నుండి శిరిడీ దర్శించు ఆంధ్రులు ఎక్కువగుటలో శ్రీ ఎక్కిరాల భరద్వాజ మొదలగు పెద్దలే గాక అనేక మంది ఆంధ్రులు శ్రీ శివనేశన్ స్వామిని దర్శించి వారి ఆశీస్సులు పొందేవారు. తమని దర్శించ వచ్చిన వారికి, స్వామిజీ వారి సమస్యలకు మార్గములు, ఆధ్యాత్మిక సాధనలు, సాయిబాబాను ఆశ్రయించు మార్గములు, బోధించు వారు. తనవద్దకు వచ్చిన వారికి బాబాప్రసాదమో, తీర్థమో, ఫలమో లేక సాయిచిత్ర పటమో ఏదో ఒకటి ఇచ్చి పంపేవారు.

1953లో శిరిడీ చేరి 43 సంవత్సరములు నిస్వార్ధముగా శ్రీ సాయిబాబా సేవలో జీవించిన శ్రీ శివనేశన్ స్వామివారు 1996 ఫిబ్రవరి 12వ తేది ఉదయము మాఘ బహుళ సప్తమీ సోమవారము తమ తుది శ్వాసను వదిలి శ్రీ సాయినాథునిలో ఐక్యమైరి. వీరి సమాధి పింపన్‌వాడి రోడ్డులో, ప్రసాదాలయమునుంచి 2.5 కలోమీటర్ల దూరములో వున్నది.

**(ఏప్రిల్ 12వ తేదీ శ్రీ శివనేశన్‌స్వామి జన్మదిన సందర్భముగా సమర్పణ)**

సేకరణ : **'శ్రీ'**




మన జీవితం తీసిన సినిమా, వ్రాసిన నవల లాంటిది. ముందు ముందు ఏమవుతుందని మనము ఎలా ఊహించినా, దాని ముగింపు ముందే నిర్ణయించబడే ఉంటుంది. ఒకసారి మొదిలియార్ అనే వ్యక్తి, భగవాన్ రమణ మహర్షి వద్ద కూర్చొని, మహర్షి వారికి విసనకర్రతో విసురుతూ, "స్వామి నాకొక సందేహం, జీవితంలో ప్రతి సంఘటన ముందే నిర్ణయించబడి తగురీతినే జరుగుతుంది అని అంటారు కదా! అది నిజమేనా" అని అడిగేరు మొదిలియార్. "అవును అది నిజమే, అతి పెద్ద సంఘటన దగ్గర నుండి సూక్ష్మాతి విషయము వరకు ముందే నిర్ణయించబడి తగురీతినే జరుగుతాయి" అని బదులిచ్చారు భగవాన్. అది విన్న వెంటనే ఒక్క క్షణం ఆలోచించి, చేతిలో విసనకర్ర క్రింద ఉంచి, "ఇంతకు ముందు నేను మీకు సేవ చేయటం, ఇప్పుడు ఆపివేయటం కూడ ముందే నిర్ణయించబడిందా లేక నా నిర్ణయమా" అని అడిగేరు మొదిలియార్. మహర్షివారు చిరునవ్వు చిందిస్తూ, "అట్లా నిర్దేశించబడి ఉన్నది కనుకనే తగురీతిన నీవు వ్యవహరించావు" అని బదులిచ్చారు భగవాన్. "కర్మను అనుసరించి బుద్ధి, బుద్ధిని అనుసరించి కర్మ ఉంటుంది" అంటారు. మనలోని భావాలు మాటల రూపంలో వ్యక్తమయ్యి క్రియారూపం దాలుస్తాయి. ఆ మనోభావాలు గత జన్మ సంస్కారాలపై ఆధారపడి తగురీతిన వ్యవహరించటము జరుగుతుంది. "గత జన్మలోని ఉత్తమ సంస్కారాలను పెంపొందించుకుంటూ, కుసంస్కారాలను రూపుమాపుకోవటానికి చేసే తీవ్రమయిన ప్రయత్నమే సాధన. అది మానవ జన్మలో మాత్రమే సాధ్యము, అది కూడ గురుసాన్నిధ్యముతోనే సాధ్యము" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారుగారు.

ఆ సంస్కారాలు ఎంత బలీయమైనవో తెలిపే ఒక ఉదాహరణ, మహారాష్ట్రలో బాంద్రాలోని ప్రభుత్వ కార్యాలయములో పనిచేసే రఘువీర పురందరే, సాయిబాబాపై అమిత భక్తి ప్రపత్తులు కలిగి ఉండేవాడు, అంతే చనువుతో వ్యవహరించే వాడు. హార్దా నివాసులు బాబాకు పంపిన పల్లకీ మూడు నెలలుగా మూలపడిఉండటం చూసిన పురందరే, బాబా వద్దని వారిస్తున్నా, ఆ పార్సిల్ విప్పి, దానిని అలంకరించి, పల్లకీ ఉత్సవము కొరకు బాబాను ఒప్పించి, చివరకు బాబా ఆనతిపై, బాబా పాదుకలు, సటకా పల్లకీలో ఉంచి ఊరేగించటము జరిగింది. పల్లకీ ఉత్సవము ముగిసిన తరువాత మశీదు ముంగిట్లో పల్లకీని ఉంచగా, దానికున్న వెండి సింహబొమ్మలను ఎవరో ఎత్తుకుపోయారు. పల్లకీ ఎత్తుకుపోయినా బాబా పట్టించుకోరని భావించిన పురందరే పల్లకీ కోసం, బాబా అనుమతి లేకుండానే మశీదు ప్రక్కనే ఒక గది కట్టటము ప్రారంభించాడు. అది చూసిన సాయి, పల్లకీనే వద్దంటే, దానికి ఒక షెడ్డా, వద్దు అంటూ పురందరేను తిడుతూ, సటకాతో కొడతానికి రాగా, మశీదు చుట్టూ పరిగెత్తి, బాబా మశీదులో ఆశీనులైనప్పుడు, గది కట్టటము ప్రారంభించాడు. మధ్యాహ్న హారతి పూర్తయి భోజన నిమిత్తము భక్తులందరూ వాడాకు వెళ్ళేరు. దీక్షిత్, బాబాను భోజనం స్వీకరించమని అడుగగా, "ఆ పనికిమాలిన వాడు భోజనానికైనా పోకుండా, నా ప్రాణం తీస్తున్నాడు. కడుపు ఆకలితో నకనకలాడిపోతుంది. వాడిని విడిచి నేను ఎట్లా భోజనము చేస్తాను. ముందు వాడిని భోజనానికి తీసుకొని వెళ్ళు" అని కాకాసాహెబ్‌తో బాబా అన్నారు. ఆ మాటలు విన్న పురందరే పరుగున వచ్చి బాబా పాదాలపైపడి, పసిపిల్లవాడిలా భోరున ఏడుస్తూ, "బాబా ఉదయం నుండి నీకు నచ్చని పని చేస్తున్నందుకు నన్ను అంత తీవ్రంగా తిడుతూ, కొడతాను అని కూడ బెదిరిస్తున్నారే, కాని నేనొక్కపూట భోజనం చేయలేదని మీరు అంతలా తల్లడిల్లిపోతున్నారే, నేనంటే మీకెంతటి ప్రేమ, మీ వలెనే మమ్ములను

కనిపెట్టుకొని ఉండే వారు ఎవరు బాబా, నీవు కాక ఇంకెవరు ఇంతటి అవ్యాజమైన ప్రేమ మాపై చూపించగలరు" అంటూ కన్నీటి పర్యంతమయిన పురందరేతో బాబా, "నీ మాటలు కట్టిపెట్టి ముందు త్వరగా వెళ్ళి భోజనము చెయ్యి, నా ప్రేగులు ఆకలితో మాడిపోతున్నాయి" అన్నారు. భోజనానికై ముందుకు రెండు అడుగులు వేసిన పురందరే, తిరిగి వెనక్కి వచ్చి, "నేను వెళ్ళను, నేను భోజనానికని అటు వెళ్ళగానే, కట్టిన గది కూల్చివేస్తారు, నేను వెళ్ళను" అన్నాడు (అదీ జన్మ సంస్కారం, అది సద్గురు సాన్నిధ్యములోనే సంస్కరించబడాలి). ఆ మాటకు పురందరే వైపు చూసిన బాబా, ''బిడ్డ కాలిమీద మలం ఏరిగితే, కాలు నరుకుతామా? బిడ్డను నరుకుతామా? నేను పెరికివేయను గాని, వెళ్ళి భోజనము చేసి వచ్చి పని పూర్తి చేయి, ఏదయినా పని చేయటానికి ఒప్పుకున్నప్పుడు క్షుణ్ణంగా చేయి, లేదా చేయటానికి ఒప్పుకోకు అని" బాబా చెప్పటంతో, భోజనానికి వెళ్ళి తిరిగి వచ్చి, మర్నాటి సాయంత్రానికి పని పూర్తి చేసి, బాంద్రా వెళ్ళటానికి బాబా అనుమతి కోరటంతో, "వీలయినంత తరచుగా శిరిడీ వస్తుండాలి" అన్నారు సాయి. "బాబా మీరు రమ్మన్నప్పుడు, ఇక్కడకు వస్తాము. మీరు వెళ్ళమని ఆదేశించినప్పుడు వెళతాము" అన్నాడు పురందరే. "నేను అందరినీ తరచుగా శిరిడీకి పిలుస్తూ ఉంటాను, కాని పిలిచినప్పుడల్లా రావటానికి అందరూ సిద్ధంగా ఉండరు" అని నవ్వేరు బాబా. అయితే బాబా పిలవకపోవటం వలన పురందరే లాంటి మనము కూడ శిరిడీ వెళ్ళలేక పోతున్నామా? లేక పిలిచినా సాకులు చెప్పి తప్పించుకుంటున్నామా?

నా ఆజ్ఞ లేకుండా ఆకయినా కదలదు అన్నారు సాయి, శ్రీ రమణ మహర్షి చెప్పినట్లు, అన్నీ ముందే నిర్ణయింపబడి తగురీతిన మనము వ్యవహరిస్తూంటే, మనకు స్వేచ్ఛ ఎక్కడది. సాయి ఆజ్ఞ లేకుండా, అంగుళం కూడ కదలలేని మనము, "తరచూ శిరిడీ వస్తుండమని" అంటూనే, "పిలిచినా ఎంత మంది వస్తారు" అని బాబా అనటంలోని ఔచిత్యమేమిటి?. ఆలోచించగా, మాస్టారుగారు చెప్పిన ఒక విషయము గుర్తుకు వస్తున్నది. "నా దగ్గర రెండు ప్రశ్నలు ఉన్నాయి. వాటికి ఎవరూ నాకు సంతృప్తి కలిగేలా సమాధానమివ్వలేదు. ఒకటి సృష్టిలో భగవంతుడు అనేవాడు ఒకడు ఉంటే, అన్నీ ఆయన అనుకున్నట్లే, ఆయన అనుకున్నప్పుడే జరిగేటట్లయితే ఇక మనము ప్రయత్నం చేసి పొందేది ఏముంది. అట్లా కాకుండా, మన ప్రయత్నం చేతనే మనము అనుకున్న రీతిలో, అనుకున్న విధముగా మనవే సాధించుకోగలిగితే ఇక భగవంతుడితో పని ఏముంది. ఈ రెండు ప్రశ్నల గురించి ఎంత మందినో విచారించినా, నాకు తృప్తి కలిగే విధముగా ఎవరూ సమాధానమివ్వలేదు. ఏది ఏమయితేనేమి, 1963 ఫిబ్రవరి 9వ తేదీన శిరిడీలో సాయి దర్శనంతో ఒక అద్భుతమైన అనుభవం కలిగింది. అంతటితో నా మనస్సుకు స్వాంతన చిక్కి, నా అన్వేషణ సంపూర్ణమయింది. అది భగవంతుడు అనుకోవటం వల్లనయితేనేమి, దేనివలన అయితేనేమి, సాయి ప్రసాదించిన అనుభవంతో, నా ప్రశ్నలకు సమాధానం దొరికింది" అంటారు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. "ఈ సృష్టిలో మానవ ప్రయత్నం చేత సాధించలేనిది ఏదిలేదు అయితే దానికి భగవంతుడు కృప తోడయితే సఫలీకృతమవుతుంది" అన్నది వశిష్ట గీతా వాక్యం.

"అప్పా అనే సాధువు ఇచ్చిన విచారసాగరం గ్రంధ పఠనం వలన ఇక్కడకు వచ్చావు, అయితే కేవలం పుస్తక పఠనం సరిపోదు, అందుకు అవసరమైన అనుభవం ఎంతో అవసరం, అది ఇక్కడ లభిస్తుంది, అయితే ఆధ్యాతిక విద్య అంత సులభమైనది కాదు, పదునైన కత్తిమీద నడకలాంటిది. తెగుతుందని, అంటీఅంటనట్లు నడిస్తే, జారి అగాధంలో పడతావు. బలవంతంగా నడిస్తే, కాలు తెగి, అడుగు ముందుకు సాగదు. అందుకే చేసే పని, ఎంతో ఇష్టంగా, ఏమరుపాటు లేకుండా, యావత్‌శక్తిని ఉపయోగించి ప్రయత్నించినప్పుడే గమ్యం చేరగలవు. అందుకు నీవు ఒక్క అడుగు వేస్తే, ప్రతిగా సద్గురువు పది అడుగులు నీ వైపు వేసి ముందుకు నడిపిస్తారు" అన్న బాబా అభయం ఇక్కడ గమనార్హం.

సృష్టిలో ఇతర జీవులకు, మానవులకు ఉన్న తేడా, జరిగే సంఘటనలపై మనస్సు స్పందించి తగురీతిన వ్యవహరించటము. ఆ స్పందన సంస్కారాలపై ఆధారపడి ఉంటుంది. దానిని మార్చుకోవటానికి సద్గురు సాన్నిధ్యం ఎనలేని ప్రభావాన్ని ఇస్తుంది. ఆ దిశగా ప్రయత్నం కొనసాగించటమే, ఆలోచనా జ్ఞానం కలిగిన మనము విధిగా చేయవలసిన పని.

ఎన్నో జన్మల క్రిందట, పక్షులగానో, పశువులగానో ఉన్నవాటిని సంస్కరిస్తూ వచ్చి ఈ జన్మలో మనుష్యులుగా తన చెంతకు సాయి చేర్చుకోవటం బాబా చరిత్రలో చూడవచ్చు. జన్మ సార్ధకతకై మనము వేసే ప్రతి అడుగు, ముందుకు సాగనీయకుండా మనస్సు అనేక సాకులు చెబుతుంది. దానిని అణచటము మన ప్రధమ కర్తవ్యం.

"మనస్సే మోక్షానికి, బంధానికి కారణమవుతుంది" అని గీతా వాక్యం. రోహిల్లా ద్వారా సాయి తెలియజేసింది అదే, మనస్సును పదే పదే గురువు నామంతో అణచటం ద్వారా అదుపులో ఉన్న మనస్సును సద్గురు చరిత్ర పారాయణ ద్వారా సక్రమమైన మార్గంలో మళ్ళించటము అనే మన ప్రయత్నం ఒక్క అంగుళమైనా ముందుకు సాగితే, అప్పుడు గురువు అనేక మిషలమీద, కార్యకారణ సంబంధముగా తన వద్దకు మనలను లాగుతారు. మన అర్హత కంటే గురువు యొక్క అనుగ్రహమే మిన్న, సకల జనావళిని ఉద్ధరించాలనేది వారి అవతార లక్ష్యం కదా!.

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి దర్శన భాగ్యము కూడ తదనుగుణముగానే నాకు కలిగింది అని నా భావన. అందుకే శ్రీ

నారాయణతో కలిసి వారి దర్శనానికి వెళ్ళినప్పుడు, "నాకు పూర్ణచంద్రరావు ముందు నుంచే తెలుసు" అని అనటములో మాస్టారుగారి యొక్క విశ్వతత్వం అవగతమవుతుంది. ''ముక్తిధామానికి నడిచిపోయే చెక్క వంతెనగా నేను ఉపయోగపడతాను" అన్నారు మాస్టారుగారు. "నా దగ్గరకు వచ్చిన ప్రతి పైసాను భగవంతుడుకి అప్ప చెబుతాను'' అన్నారు సాయిబాబా. సాయిపథంలో నడిపి, సాయి చెంతకు చేర్చే మన జీవన నౌక శ్రీ మాస్టారుగారు, ఎన్నో జన్మల నుండి సంస్కరించుకుంటూ తీసుకొని వచ్చి, వారి దర్శనము చేసుకోవాలనే నా కోరిక అనే మిషను ఆధారముగా చేసుకొని, వారి చెంతకు లాగేరు. అందుకే వారి ప్రధమ దర్శనంతో, మనస్సు అప్రయత్నంగా ప్రశాంతత పొంది, అలౌకికమైన ఆనందం పొందింది. మాస్టారుగారిని దర్శించుకొని, మర్నాడు జరిగే తన వివాహానికి మాస్టారుగారిని ఆహ్వానిస్తూ శుభలేఖ అందించి, అంగీకార ఆశీస్సులు అందుకొన్న నారాయణతో పాటు, నేను వారి ప్రేమామృతపు దృక్కులను హృదయంలో నింపుకొని, ద్వారకామయికి వెళ్ళి, అక్కడ బాబా దగ్గర శుభలేఖ ఉంచి, సాయి-మాస్టర్‌ల అనుగ్రహ ఆశీస్సులతో ఇరువురం విడిది ఇంటికి చేరేము. ప్రతి సన్నివేశంలో, నా అర్హత కన్నా, మాస్టారిగారి అనుగ్రహమే మిన్న అని ప్రస్ఫుటమవుతూనే ఉన్నది. వివాహానికి ఫోటోలు తీయటముతో పాటు, వివాహానికి విచ్చేసే మాస్టారుగారికి సౌకర్యాలు చూడమన్న నారాయణ కోర్కెను మహదానందముగా అంగీకరించాను.

ఉదయం 10 గంటల ప్రాంతములో, సత్సంగ సభ్యులు కొంత మంది వెంటరాగా దవళ వస్త్రధారియైన మాస్టారుగారు వసంత వెన్నెలలా కళ్యాణ మంటపము (ఫాన్సీ గూడ్స్ & మర్చంట్స్ అసోసియేషన్ హాలు) లోనికి అడుగిడుతూ ఉండగానే, మాస్టారుగారు వచ్చారు, మాస్టారుగారు వచ్చారు అంటూ అందరూ లేచి నమస్కరిస్తూ, మాస్టారుగారికి కళ్యాణవేదిక వద్దకు దారి ఇచ్చేరు. వెంటనే మాస్టారుగారిని అనుసరించాను. వివాహ తంతు జరుగుతున్నది. ఇంకొక అరగంటలో సంపూర్ణమవుతుందని చెప్పగా, "అంతవరకు ఉండి వెళతాను" అంటూ మాస్టారుగారు, తన దర్శనానికి వచ్చేవారి వలన కార్యక్రమానికి అంతరాయము కలుగకుండా, మండపానికి కొంచెము దూరంగా కూర్చొన్నారు. బహుమతి పేపరుతో చుట్టబడిన మూడు పుస్తకాలు శ్రీ మాస్టారుగారి చేతిలో ఉన్నాయి. పెళ్ళి వారిని, ఆహ్వానితులను ఫోటో తీస్తూ, నారాయణ కోరికపై శ్రీ మాస్టారుగారిని కూడ ఫోటో తీయటానికి అనుమతి అడిగేను. శ్రీ మాస్టారుగారు చిరునవ్వుతో దగ్గరకు రమ్మని సైగ చేశారు. ఆనందోద్వేగముతో నెమ్మదిగా శ్రీ మాస్టారుగారి వైపు కదిలేను.

అప్పుడు జరిగిన సంఘటన, అందులో భాగమైన శ్రీ మాస్టారుగారి అవాజ్యమైన ప్రేమ, వారి కరుణాదృక్కులు, దృశ్యంలా నా కళ్ళ ముందు కదలాడుతుంటే, ఆనందాశ్రువులతో నిండిన నేత్రాలు, మనస్సుతో మాట కలపగా, మౌనంగా ఉండిపోయాను. అప్రయత్నంగా నా కన్నుల వెంట వస్తున్న అశ్రువులను చూస్తూ, నిశ్శబ్దంగా ఉండిపోయారు, అంత వరకు నేను చెబుతున్నది శ్రద్ధగా వింటున్న శ్రీ విశ్వనాధ శాస్త్రి, శ్రీ జగన్నాధాచార్యులు.

వసంతుడి రాకతో పులకించిన ప్రకృతి, పచ్చటి చెరుగుపై వర్ణపుష్పంలా ఉన్న ఉద్యానవనాన్ని, భానుడి రాకకై ఎదురు చూస్తున్న కమల పుష్పాలతో నిండిన సరస్సును చూస్తూ, మానస సరోవరములో మధుర భావనల నౌక హృదయటంచులను తాకగా, వసంత గాలితో కూడిన శవణేంద్రియాన్ని స్పృశించి, హృదయ కవాటాన్ని తెరచిన సంకీర్తన పదరవళి పరవశ మొందించగా ఆస్వాదనలో ఉండిపోయింది అంతరంగం.

"నారాయణ గిరి శిఖరాలలో తొలి సంధ్య వెలుగులు వ్యాపిస్తున్నాయి, తిరుమల వీధులలో ఉషోదయం అలుముకున్నది, కొండగాలులు స్వామి పుష్కరిణిని తాకి జలతరంగాలను కదిలిస్తూ, ఒక మధురమైన గానాన్ని మోసుకొని ఆనందనిలయం ప్రవేశించాయి, అవి అలివేలు మంగమ్మ అలకలను స్పృశించి, శ్రీనివాసుని ఎద చేరి నిలిచాయి". మదిలో నిండుగా కొలువై ఉన్న కోనేటి రాయుడిని తన సంకీర్తనా రవళులతో మేల్కొల్పుతున్నాడు అన్నమయ్య.

మధుర జ్ఞాపకాల భావనతో ఎదనిండగా, మౌనమే భాషగా మిగిలి, ఉషోదయపు ప్రకృతి పరిమళాలు ఆస్వాదిస్తూ ఉండిపోయాను.

మీ... **వి.వి.పూర్ణచంద్రరావు**

## మార్గం

మహాత్ముల మార్గం అత్యంత సూక్ష్మం
వారి జ్ఞానం అగాధం, అనిర్వచనీయం
ఆదర్శప్రాయం, అనుసరణీయం.

గడ్డకట్టిన ప్రవాహమును దాటుతున్నట్లు,
శత్రుదేశంలోని గూఢచారిలాగా
మహాత్ములు ఎల్లప్పుడూ జాగరూకులు.

అతిథి వలె ఆదరణీయంగా, నీటి కంటే స్వచ్ఛంగా,
లోయ కంటే స్వీకారయోగ్యంగా ఉంటారు.

వారి నిజరూప దర్శనం చేయాలనుందా?
అయితే మలినాలన్నీ అట్టడుగుకు చేరి,
స్వచ్ఛమైన నీరు పైకి తేలేవరకు ఎదురుచూడగలవా?
ఆలోచనల ఇసుళ్ళు అణిగి, ప్రశాంతత నెలకొని
సాన్నిధ్యాన్ని అనుభవించే ఆ క్షణం కోసం ఎంతకాలమైనా
ఎదురుచూడగలిగే సహనం నీకుందా?

మహాత్ముడు పరిపూర్ణతను అన్వేషించడు, ఆశించడు
ఎలా ఉన్నదాన్ని అలా యథాతథంగా ఆహ్వానిస్తాడు.
అదే పరిపూర్ణత!

సౌజన్యం : **తావో సూక్తి ప్రస్థానం**

# వందనమయ్యా సాయినాధ

జనన మరణాలు అజ్ఞాన భావ జనితాలు. అవి కేవలం భ్రాంతి మాత్రమే. సంపూర్ణ జ్ఞానులు ఎంతో పరిశోధించి గ్రహించిన సత్యమిది. అట్టి అజ్ఞాన తిమిరాన్ని నశింపజేసే నీకు జనన మరణాలు లేవు. సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడవైన నీవు వాటికతీతుడవే కాదు, నిజానికి వాటిని శాసించే మహారాజువు కూడా! ఓ సాయి సమర్థా! అందుకే సకల పాపాలు నిర్మూలించగల నీ దివ్య చరణారవిందాలను నేనాశ్రయించాను. దేవా! నా అవగుణాలు పరిగణించి నిరాదరించకు. నన్ను దయతో కాపాడు. ఓ దయాఘనా! సాయిదేవా! నేను దీనుణ్ణి, హీనుణ్ణి, అజ్ఞానిని, మహాపాపిని, దుష్కర్మాసక్తుణ్ణి, సకల దుర్గుణాలు ఉన్నవాణ్ణి. అయినప్పటికీ నన్ను ఉపేక్షించకు. దీనబంధూ! గ్రామ గ్రామాలనుంచి వచ్చి తనలో కలిసే మురికి కాలువలను గోదావరినది తిరస్కరిస్తుందా! పరశువేది ఇనుములోని దోషాలను పరిగణిస్తుందా! ఓ అనాధనాధా! నీవు పరశువేదివి. నేను పాపాత్ముడనని నన్ను విడవకు. నీ దరి చేర్చుకో. నాలో ఎన్నో కల్మషాలున్నాయి. ఓ పతిత పావనా! నీ కరుణా కటాక్షవీక్షణాలు నాపై ప్రసరించి, వాటిని తక్షణమే సమూలంగా నిర్మూలించు. ఇదే ఈ దాసుని విన్నపం. బాబా! దీనబంధూ! నా భాగ్య ప్రదాత మీరే. నన్ను పాపవిముక్తిణ్ణి చెయ్యండి. నన్ను పవిత్రుడిగా చెయ్యండి. మీరు పరశువేది. నేను ఇనుపముక్కలాంటి వాణ్ణి. సాయిమాతా! బిడ్డలు తప్పు చేయటం సహజమే. కాని తల్లి కోపగించుకొంటుందా? వాళ్ళను ప్రేమగా లాలించి చేరదీయదా! అదే విధంగా నన్ను కరుణించు. నాపై కోపించకు. ఓ సమర్థ సద్గురూ! మీరు మా కోరికలు తీర్చే కల్పతరువు. ఈ భవ సాగరాన్ని దాటించే 'నావ' మీరే. ఇది నిస్సంశయం. ఓ సాయినాధా! నీవే కామధేనువు. నీవే జ్ఞానాకాశంలో ప్రకాశించే భాస్కరుడవు. నీవే సద్గుణాల నిధి. స్వర్గధామం చేర్చే సోపానం కూడా నీవే. ఓ పరమ పావనా! పుణ్య పురుషా! ఓ శాంత స్వరూపా! ఆనంద నిలయా! చిత్స్వరూపా! పూర్ణావతారా! భేద వర్జితా! జ్ఞాన సింధూ! వందనం. ఓ విజ్ఞామూర్తీ! పురుషోత్తమా! క్షమ, శాంతి నిలయమా! భక్తలోక విశ్రాంతి ధామమా! మమ్ములను గ్రహించండి. మీ చల్లని కృపావర్షం మాపై కురిపించండి.

(శ్రీ దాసగణు మహారాజ్ విరచిత మహా మహిమాన్వితమైన నిత్య పారాయణ వచన గ్రంధము శ్రీ సాయినాధ స్తవన మంజరి నుండి సేకరించినది.)

సేకరణ : **శ్రీమతి కె.సాయి ప్రత్యూష,** గోవా.

## పండుగలు - పర్వదినాలు

**ఏప్రిల్ - 2018**

6 మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి ఆరాధనోత్సవము (తేదీ ప్రకారం)

12 పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము (తేదీ ప్రకారం)

శ్రీ శివనేశన్ స్వామి జయంతి (తేదీ ప్రకారం)

14 భగవాన్ శ్రీ రమణ మహర్షి ఆరాధనోత్సవము

18 "అక్షయ తృతీయ", చందనోత్సవము – శ్రీ సింహచలేశ్వరుని నిజరూప దర్శనం – సింహచలం

30 వైశాఖ పూర్ణిమ – బుద్ధ జయంతి

మాతృశ్రీ ఆనందమాయి జయంతి (తేదీ ప్రకారం)

**మే**

6 మొగిలిచెర్ల శ్రీ దత్తాత్రేయస్వామి ఆరాధనోత్సవము

10 హనుమజ్జయంతి

మొహద్దీన్ చిస్టీ (అజ్మీర్) ఆరాధనోత్సవము

15 శ్రీ ఉపాసనీబాబా జయంతి (తేదీ ప్రకారం)

20 కంచి పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర స్వామి జయంతి

25 పేద విద్యార్థినీ విద్యార్థులకు పుస్తక–వస్త్ర బహుకరణ మరియు వివిధ సేవా కార్యక్రమములు – ఉక్కునగరం

**జూన్**

7 అవధూత శ్రీ నాగమునీంద్ర స్వామి ఆరాధనోత్సవము – అనంతసాగరం (తేదీ ప్రకారం)

16 రంజాన్

20 అవధూత శ్రీ చివటం అమ్మ ఆరాధనోత్సవము – చివటం

26 శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వామి ఆరాధనోత్సవము

28 శ్రీ దామరాజు వేంకట రామ యోగీంద్రులు (శ్రీ పాకలపాటి గురువుగారు) జయంతి – నర్సీపట్నం

**జూలై**

1 శ్రీ గులాబ్‌బాబా జయంతి – కాటేల్

17 దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభం

25,26,27 శ్రీ గురుపూర్ణిమ మహోత్సవాలు – ఉక్కునగరం

27 శ్రీ గురుపూర్ణిమ

సంపూర్ణ చంద్రగ్రహణం

# శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - రజతోత్సవ వేడుకలు

గత 28 సంవత్సరాల క్రితం, ఉక్కునగరం–విశాఖపట్నంలో ఒక ఇంటిలో సత్సంగ రూపేనా ప్రారంభమయ్యి, శ్రీరామ నవమి, గురుపూర్ణిమ, విజయ దశమి, దత్త జయంతి పర్వదినాలలో అన్నదాన రూపేనా సేవా కార్యక్రమాలు ప్రారంభము కాగా, క్రమేపి సత్సంగ సభ్యుల సంఖ్య పెరుగుతూ, వారి సహాయ, సహకారములతో గత 25 సంవత్సరాల క్రితం శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టుగా మార్పు చెంది, ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలలో భాగముగా, వేలాది మంది అతి నిరుపేద విద్యార్థినీ విద్యార్థులను, ఇంటర్, డిగ్రీ చదివించి, స్వయం ప్రతిపత్తిలో తమ కుటుంబాలకు వారు ఆసరాగా నిలచే స్థితికి సహకరించటమే కాకుండా, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళంలోని అనేక మారుమూల గిరిజన గ్రామాలలో శ్రీ సాయి భరద్వాజ సత్సంగాలు నెలకొల్పి, ఆధ్యాత్మికతతో పాటు వారి సామాజిక అవసరాలకు చేయూతనిస్తూ, అనేక గిరిజన గ్రామాలలో శ్రీ శిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్టలు గావించి, వారిలో మానసిక బలహీనతలను, భయాలను ప్రారదోలి, వారి అభివృద్ధికి ఇతోధికముగా సహకరిస్తున్న శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు, నిర్దుష్టమైన సాయి మార్గాన్ని సాయి భక్తకోటికి అందించిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి పేరిట 19 సంవత్సరాల క్రితం, శ్రీ అఖిలాంధ్ర సాయి మాస్టర్ భక్త సమ్మేళనానికి నాంది పలకటమే కాకుండా, గత 18 సంవత్సరాలుగా "శ్రీ భరద్వాజ సద్గురువాణి" ఆధ్యాత్మిక పత్రిక ద్వారా వేలాది మందికి నిర్దుష్టమైన సాయిమార్గాన్ని కేవలం నామమాత్ర రుసుముతో అందించటమే కాకుండా, రాష్ట్రం నలుమూలలా సాయి భక్తులను ఏకం చేస్తూ గత 12 సంవత్సరాలుగా అఖిలాంధ్ర సాయి భక్త సమ్మేళనాలు నిర్వహిస్తూ, గత 24 సంవత్సరాలుగా శ్రీ దత్తావతార, అవధూతల, మహాత్ముల పాదుకలను, వారు ఉపయోగించిన దివ్య వస్తు, వస్త్ర సముదాయమును ఒక్కచోట చేర్చి, సద్గురు పాదుకా మహోత్సవాలని ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడ నిర్వహించటం జరుగుతున్నది. గత 3 సంవత్సరాల నుండి ప్రతి నెల, శారీరక, మానసిక, దివ్యాంగుల, అతి నిరుపేద వితంతు కుటుంబాలకు "శ్రీ సాయి భరద్వాజ ఆపన్న హస్తం" పేరిట నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను ఉచితముగా అందించటం జరుగుతుంది. ఇంకనూ అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు తన రజతోత్స(25వ వార్షికోత్స)వ వేడుకలను 2018 ఫిబ్రవరి 1,2 మరియు 3 తేదీలలో ఉక్కునగరంలోని శ్రీ ఆంధ్రకేసరి కళా క్షేత్రములో అత్యంత వైభవంగా నిర్వహించటము జరిగింది.

మూడు రోజులు ప్రతిరోజూ నాలుగు హారతులు, శ్రీదత్తావతార, అవధూతల, మహాత్ముల పాదుకా సహిత శ్రీ దత్త సాయి భరద్వాజలకు షోడశోపచార పూజలుతో పాటు అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది.

రజతోత్సవాలలో భాగముగా ఫిబ్రవరి 1వ తేదీ గురువారము, లోక కళ్యాణార్థము వందలాది మందిచే సామూహిక శ్రీ సాయి సచ్చరిత్ర ఏకాహ పారాయణ నిర్వహించి, అనంతరం వారికి ఆయా గ్రంధాలు ఉచితముగా అందజేయటము జరిగింది. సాయంత్రం, ఉక్కునగరం శ్రీ వెంకటేశ్వ భక్త మండలి వారిచే భక్తి రంజని కార్యక్రమ అనంతరం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భీమిలి శ్రీ యోగానందస్వామి శిష్యులు శ్రీ రామకృష్ణానంద "ఆధ్యాత్మిక చక్రవర్తి శ్రీ శిరిడీ సాయి" అనే అంశముపై శ్రోతలను ఆకట్టుకునేలా ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు. ఆ సందర్భముగా "శ్రీ శిరిడీ సాయి ఆరాధన" అనే పుస్తకాన్ని ఆవిష్కరించటము జరిగింది. ఇంకను ఆ కార్యక్రమములో ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు, హైదరాబాదు నిమ్స్ ఆసుపత్రి నుంచి విచ్చేసిన హృద్రోగ నిపుణులు పాల్గొన్నారు. అనంతరం ట్రస్టు ఛైర్మన్ వారిని ఘనంగా సత్కరించారు.

రజతోత్సవాలలో ప్రధానమైన రోజు ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం ప్రత్యేక కార్యక్రమముగా "శ్రీ సాయి సత్యవ్రతాల"ను అత్యంత శాస్త్రోక్తముగా నిర్వహించటము జరిగింది. విచ్చేసిన భక్తులకు పూజా సామాగ్రి ఉచితంగా అందజేయటము జరిగింది. ఆ సందర్భముగా ట్రస్టు ఛైర్మన్ పూజ–వ్రతము–సాయి సంప్రదాయము గురించి తెలియజేశారు. మధ్యాహ్న హారతి, భక్త సమారాధన అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు "శ్రీ సాయి భరద్వాజ ఆపన్న హస్తం" పేరిట 100 మంది శారీరక, మానసిక, దివ్యాంగుల, అతి నిరుపేద వితంతు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను, ఆ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన శ్రీ వి.వి.వేణుగోపాలరావు (డైరెక్టర్ ఫైనాన్స్, విశాఖపట్నం స్టీలు ప్లాంట్) చేతులు మీదుగా పంపిణీ చేయటము జరిగింది. ఆ సందర్భముగా శ్రీ వేణుగోపాలరావుగారు మాట్లాడుతూ, "మనకు ఎంత సంపద ఉన్నా, ఎన్ని సౌకర్యాలు అనుభవిస్తున్నా, మనస్సుకు నిజమైన ఆనందాన్ని, సంతృప్తిని కలుగజేసేవి ఇటువంటి కార్యక్రమాలు మాత్రమే" అన్నారు. అనంతరం 'ఆధ్యాత్మికత – సామాజికత' అనే అంశముపై శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు గోష్టి నిర్వహించి, విద్యార్థినీ విద్యార్థులకు నోట్సు పుస్తకాలు, స్త్రీలకు వస్త్రాలు బహుకరించారు.

సాయంత్రం హారతి అనంతరం శ్రీ వి.దుర్గారావు ఆధ్వర్యములో సంగీత జనకుల బృందముచే "సుందరకాండ" గానలహరి నిర్వహించటము జరిగింది. అనంతరం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమములో విశిష్ట అతిథిగా విచ్చేసిన శ్రీ

వి.వి.వేణుగోపాలరావుగారు (డైరెక్టర్ ఫైనాన్స్, విశాఖపట్నం స్టీలుప్లాంట్) "శ్రీ దత్త పంచకము" అనే గ్రంధము ఆవిష్కరించారు. అనంతరం పరమహంస హిమాలయ సంత్ శ్రీశ్రీశ్రీ స్వామి వేదానంద సరస్వతి మహరాజ్ అనుగ్రహభాషణం చేయగా, శ్రీ సాహిత్య సుధ వ్యవస్థాపకులు శ్రీ అద్దంకి రాఘవాచార్యులు, శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు "గురు తత్వము – సాయి సంప్రదాయము"పై ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు. కార్యక్రమములో ప్రత్యేక ఆహ్వానితురాలుగా విచ్చేసిన శ్రీమతి కె.సుధారాణి ("శ్రీ భరద్వాజ సద్గురువాణి" ఆధ్యాత్మిక పత్రిక యు.యస్.ఏ కోఆర్డినేటర్ శ్రీ కె.కరుణారెడ్డి సతీమణి) గురు అనుగ్రహము గురించి తమ అనుభవాలను తెలియజేస్తూ, ఎన్నో సంవత్సరాలుగా తాము ట్రస్టుతో అనుబంధము కొనసాగిస్తూ, అమెరికాలో కూడ సత్సంగాలు నిర్వహించుకుంటున్నామని, ఇక్కడ ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలు తమకు ఎంతో స్ఫూర్తినిస్తున్నాయి అని తెలియజేస్తూ, సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారముగా ఆర్థిక సహకారము అందజేశారు. ఆ కార్యక్రమములో విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీ వి.వి.వేణుగోపాలరావుగారు మాట్లాడుతూ "మానవ జీవితంలో గురువు ఆవశ్యకత, గురువును అనుసరించాల్సిన విషయము గురించి" సోదాహరణముగా తెలియజేశారు. ఆనాటి కార్యక్రమానికి శ్రీ రామకృష్ణానంద సమన్వయకర్తగా వ్యవహరించారు. అనంతరం అతిథులను ఘనముగా ట్రస్టు ఛైర్మన్ దంపతులు సత్కరించారు. శేజ హారతి అనంతరం సమారాధనతో ఆ రోజు కార్యక్రమాలు ముగిసినయ్యి.

రజతోత్సవాలు ముగింపు రోజు అయిన ఫిబ్రవరి 3వ తేదీ శనివారము విశిష్ట కార్యక్రమముగా హైదరాబాదు నుంచి విచ్చేసిన శ్రీ కోదండ రామయ్యగారు "ఓం శ్రీ సాయినాథాయ" అనే నామం, సామూహిక జపయజ్ఞంగా చేయించారు. ఆ కార్యక్రమములో విశేషముగా పాల్గొన్న భక్తులచే ప్రతి నామానికి ఒక్కొక్క బియ్యపు గింజను వేయిస్తూ 45 లక్షల నామజపం జరిపించటము జరిగింది. అందుకు తగిన అన్ని ఏర్పాట్లు ట్రస్టు ఏర్పాటు చేయటం జరిగింది.

మధ్యాహ్న హారతి, సమారాధన అనంతరం వివిధ ప్రాంతాలనుండి విచ్చేసిన సత్సంగ నిర్వాహకులచే ఇష్టాగోష్ఠి కార్యక్రమము నిర్వహించటము జరిగింది.

సాయంత్రం శేజ హారతి, అనంతరం శ్రీ యస్.వి.రమణ బృందం ఆధ్వర్యములో "శ్రీ రాగవర్షిణి" ఆర్కెస్ట్రా వారు భక్తి గీతాలాపన చేశారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి, విశిష్ట అతిథిగా విచ్చేసిన రాజయోగి శ్రీశ్రీశ్రీ సాయి సుధాకర పూర్ణానందస్వామి (శ్రీ సాయి గోకుల దత్త విహార్, విశాఖపట్నం) "శ్రీ సాయిచరణాలు" అనే గ్రంధాన్ని ఆవిష్కరించి, "శ్రీ దత్త సంప్రదాయము, పాదుకుల విశిష్టత'' అనే అంశముపై అనుగ్రహభాషణము చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ వై.అర్జున్ కుమార్ (డి.జి.యమ్ ఇన్‌చార్జి, టెలికమ్ డిపార్టుమెంట్, విశాఖపట్నం స్టీలు ప్లాంట్) ట్రస్టు గత 25 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సేవలను కొనియాడారు. బాబా అనుగ్రహం గురించి తన అనుభవాన్ని తెలియజేశారు. పూజ్యశ్రీ వేదానందసరస్వతీస్వామి అనుగ్రహభాషణము చేయగా, ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు "ట్రస్టు కార్యక్రమాలు – సాధనా మార్గము" గురించి తెలియజేశారు. ఆ కార్యక్రమములో పాల్గొన్న శ్రీ ఎ.సూర్యనారాయణ సాయి అనుగ్రహముపై తన అనుభవాలను తెలియజేశారు. తన చక్కటి వాగ్ధాటి, సమయస్ఫూర్తితో శ్రీ రామకృష్ణానంద కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తూ ఆద్యంతము చక్కటి ఆధ్యాత్మిక భావనతో కార్యక్రమాన్ని నడిపేరు.

రాజయోగి శ్రీ సాయిసుధాకర పూర్ణానందస్వామి శ్రీ దత్త సాయి భరద్వాజలకు మంగళనీరాజనాలు సమర్పించటముతో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు రజతోత్సవ వేడుకలు అత్యంత వైభవముగా, ఆధ్యాత్మిక ఉన్నతితో సంపూర్ణమయినాయి.

రజతోత్సవాలకి సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన వందలాది మంది ప్రతినిధులకు మూడు రోజులూ చక్కటి భోజన వసతులు ఏర్పాటు చేయటము జరిగింది.

కార్యక్రమము మూడు రోజులూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం, తేనీరు, రాత్రికి భోజనము మొదలైనవి కార్యక్రమములో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సాయి ప్రసాదముగా అందజేయటం జరిగింది.

మూడు రోజులు ఆవిష్కరించబడిన శ్రీ సాయి ఆరాధన, శ్రీ దత్త పంచకము, శ్రీ సాయిచరణాలు గ్రంధాల సహిత శ్రీ శిరిడీసాయి చిత్రపటాలు ప్రతి ఒక్కరికీ ఆహ్వాన కమిటీ ద్వారా అందజేయటము జరిగింది.

ట్రస్టు సభ్యులు, సత్సంగ సభ్యులు, అనుబంధ సంస్థల సభ్యులు ప్రతి ఒక్కరూ అత్యంత భక్తి శ్రద్ధలతో తమ వంతు పూర్తి సహాయ సహకారములు అందజేశారు.

రజతోత్సవాల సందర్భముగా, వేదిక వద్ద ఏర్పాటు చేసిన శ్రీ దత్తావతార, అవధూతల, మహాత్ముల పాదుకల సహిత వారి దివ్య వస్తు, వస్త్ర సముదాయమును వేలాదిమంది దర్శించుకున్నారు.

గత 25 సంవత్సరాలుగా ఉక్కునగరం కేంద్రముగా చేసుకొని, రాష్ట్రం నలుమూలలా ట్రస్టు నిర్వహిస్తున్న అనేక ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనివ్వటమే కాకుండా, ఉక్కునగరంలో నిర్వహించే అనేక బృహత్తరమైన కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారములు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ మరియు ట్రస్టు చేసే ప్రతి కార్యక్రమానికి ప్రత్యక్షముగా, పరోక్షముగా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ట్రస్టు వ్యవస్థాపక ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు హృదయపూర్వక వినమ్రపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియజేయటముతో రజతోత్సవ వేడుకలు సర్వం సంపూర్ణమయినాయి.

సమీక్ష : **"జ్యోతిర్మయి"**, విశాఖపట్నం.

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - ఉక్కునగరం

## (2018 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి శుభాశీస్సులతో విశ్వవ్యాపకుడు, విశ్వచైతన్య స్వరూపుడు అయిన శ్రీ శిరిడీసాయి అనేక రూపాలలో అనేక విధాలుగా అందిస్తున్న బోధనామృతాన్ని ఒక్కటిగా చేర్చి అందరితో కలిసి పంచుకోవాలనే భావనతో 2001వ సంవత్సరములో ప్రారంభించబడిన శ్రీ భరద్వాజ సద్గురువాణి 17 వసంతాలు పూర్తి చేసుకొని 18వ వసంతములోనికి అడుగిడుతున్న శుభ సందర్భము మరియు శ్రీ శిరిడీ సాయిబాబా మహాసమాధి చెంది వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న తరుణంలో "శ్రీ భరద్వాజ సద్గురువాణి" 18వ సంపుటి ప్రథమ సంచికను శ్రీ శిరిడీసాయి మహాసమాధి శతాబ్ది ప్రత్యేక సంచికగా, జనవరి 1వ తేదీ సద్గురు పాదుకాక్షేత్రములో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు సభ్యులు, అనుబంధ సంస్థల మరియు సత్సంగ సభ్యులు సమక్షములో శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ అధినేత్రి శ్రీమతి వి.యస్.లక్ష్మి, "సద్గురువాణి" ప్రత్యేక సంచికను ఆవిష్కరించగా, ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు, శ్రీ శిరిడీసాయి శతాబ్ది మహాసమాధి సంవత్సర ప్రత్యేక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ట్రస్టు సభ్యులు శ్రీ యస్.రామకృష్ణ, 2018 పాకెట్ క్యాలెండర్‌ను, యునైటెడ్ ప్రింటర్ తరుపున శ్రీ శ్రీరామ్, శ్రీ రమేష్, 2018 శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అంతకు ముందు నూతన సంవత్సరం 2018 ఆగమనాన్ని పురస్కరించుకొని, శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ప్రత్యేక సత్సంగమము నిర్వహించారు. అనంతరం భక్తులకు క్యాలెండరు, ప్రసాదములు, పోకెట్టు పుస్తకాలు మొదలైనవి నూతన సంవత్సర కానుకలుగా అందజేయటం జరిగింది.

జనవరి 1వ తేదీ మధ్యాహ్నం విశాఖపట్నం దగ్గర కూర్మన్నపాలెంలోని శ్రీ సాయి ఉపాసనా కేంద్రము వారి ఆహ్వానము మేరకు, అక్కడి కార్యక్రమములో ట్రస్టు దంపతులు పాల్గొన్నారు. ఆ సందర్భముగా ''ధ్యానము-సాయిమార్గము''పై శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు. అనంతరం శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు దంపతులను, ఉపాసనా కేంద్రము వారు ఘనముగా సత్కరించారు.

జనవరి 5వ తేదీ సద్గురు పాదుకా క్షేత్రములో ట్రస్టు మరియు అనుబంధ సంస్థల సమావేశము జరిగింది. శ్రీ శిరిడీ సాయిబాబా శతాబ్ది మహాసమాధి సంవత్సర సందర్భముగా చేపట్టదలచే వివిధ కార్యక్రమాల గురించి చర్చింటము జరిగింది. అనంతరం భక్త సమారాధన నిర్వహించారు.

జనవరి 15వ తేదీ అవధూత శ్రీ రామిరెడ్డి తాత 25వ ఆరాధన మహోత్సవాలను, సద్గురు పాదుకా క్షేత్రములో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించటం జరిగింది. ఆ సందర్భముగా "దత్త సంప్రదాయము - అవధూతతత్వం'' గురించి శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ప్రవచనము చేశారు. అనంతరం సమారాధన జరిగింది.

జనవరి 19వ తేదీ సద్గురు పాదుకా క్షేత్రములో సామూహిక శ్రీ సాయి నామ జపం, పారాయణ నిర్వహించటం జరిగింది.

జనవరి 25వ తేదీ తెలంగాణా రాష్ట్రంలోని కామారెడ్డిలో శ్రీ శిరిడీసాయి నిలయం కమిటీ వారి కోరిక మేరకు, శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు ఆధ్వర్యములో, సద్గురువుల పాదుకా మహోత్సవం నిర్వహించటం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, పాదుకలను దర్శించి పరవశించారు.

జనవరి 26వ తేదీ నిజామాబాద్ కంఠేశ్వర్‌లోని శ్రీ తేనె సాయి ద్వారకామాయి మందిర ప్రాంగణములో, సద్గురువుల పాదుకా మహోత్సవము నిర్వహించటం జరిగింది. వేలాదిగా భక్తులు పాదుకలను దర్శించి పులకించిపోయారు. ఇంతమంది అవధూతల, మహాత్ముల పాదుకలను, వారి దివ్య వస్తు, వస్త్ర సముదాయాలు ఒక్కచోట దర్శించుకోవటం ఇదే ప్రథమమని, అలా దర్శించుకోవటం మా అదృష్టమని, ఆనందాన్ని వ్యక్తం చేశారు. సాయంత్రము నిజామాబాద్ పురవీధులలో అంగరంగ వైభవంగా చావడి ఉత్సవ రీతిలో పాదుకల ఊరేగింపు, ఆలయ కమిటీ వారు నిర్వహించారు. దాదాపు 4 గంటల పాటు భారీ బందోబస్తుతో జరిగిన ఊరేగింపులో వందలాది మంది పాల్గొనగా, దారిపొడుగునా వేలాది మంది పాదుకలను దర్శించుకున్నారు. సాయి మందిర నిర్వాహకురాలు శ్రీమతి శ్యామలగారు చక్కటి ఏర్పాట్లుతో కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

జనవరి 30వ తేదీ స్థానిక టిటిడి కళ్యాణ మండపములో జరిగిన రాజయోగి శ్రీశ్రీశ్రీ సాయి సుధాకర పూర్ణానందస్వామి వారి 62వ జన్మదిన వేడుకల సందర్భముగా విచ్చేసిన కుర్తాళ పీఠాధిపతి పరమపూజ్య జగద్గురు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందస్వామి వారు అనుగ్రహ భాషణం చేసి, శ్రీ సాయి సుధాకరస్వామి విరచిత "ఉపదేశ సారామృతము" గ్రంధము ఆవిష్కరించారు. అనంతరం "శ్రీ గురు దత్తాత్రేయ విశిష్టత" అనే అంశముపై ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు. ఆహ్వానితులను ఘనముగా సత్కరించి, అనంతరం ఆహ్వాన కమిటీ వారు సమారాధన నిర్వహించారు.

ఫిబ్రవరి 1,2 మరియు 3 తేదీలలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు రజతోత్సవ వేడుకలను అత్యంత వైభవోపేతముగా స్థానిక శ్రీ ఆంధ్రకేసరి కళాక్షేత్రములో నిర్వహించటం జరిగింది. ఆ సందర్భముగా ప్రతిరోజూ నాలుగు హారతులు, సామూహిక పారాయణ, నామ జపము, పూజలు, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. పూర్తి వివరాలు రజతోత్సవ వేడుకల

సమీక్ష 19వ పేజిలో వివరించటము జరిగింది.

ఫిబ్రవరి 7,8 మరియు 9 తేదీలలో నెల్లూరు జిల్లా గొలగమూడిలో అవధూత శ్రీ వెంకయ్యస్వామి వారి సన్నిధిలో జరిగిన 19వ అఖిలాంధ్ర శ్రీ సాయి మాస్టర్ భక్త సమ్మేళనములో ట్రస్టు మరియు దాని అనుబంధ సంస్థల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆ సందర్భముగా ట్రస్టు ఆధ్వర్యములో శ్రీ దత్తావతార, అవధూత, మహాత్ముల పాదుకల సహిత, వారి దివ్య వస్తు, వస్త్ర సముదాయమును భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేయటం జరిగింది.

ఫిబ్రవరి 9వ తేదీ ఉదయం సమ్మేళనం కార్యక్రమములో "విశ్వచైతన్యానుభూతి – ధ్యానం" అనే అంశముపై శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ప్రవచించి, సామూహిక ధ్యానం నిర్వహించారు. సమ్మేళన పూర్తి విషయ విశేషాలు 33వ పేజిలో వివరించటం జరిగింది.

ఫిబ్రవరి 11, 12 తేదీలలో విశాఖపట్నం జిల్లా, పాడేరు దగ్గర పెదబయలు, ముంచంగి పుట్టు మండలాలలోని అతి మారుమూల గిరిజన గ్రామాలైన బొర్లాడ, వద్దేపుట్టు, ముక్కిపుట్టు గ్రామాల సరిహద్దు అయిన బొర్లాడ గ్రామములో శ్రీ శిరిడీ సాయి మందిర వార్షికోత్సవములో ట్రస్టు ఛైర్మన్ పాల్గొనటం జరిగింది. ఆ సందర్భముగా సామూహిక శ్రీ దత్త సాయి భరద్వాజ హోమం, సామూహిక గురుపూజలు నిర్వహించి, జగద్గురువు శ్రీ శిరిడీ సాయిబాబా ఔన్నత్యము గురించి ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు. ఆ సందర్భముగా కమిటీ వారు, అనేక మారుమూల గ్రామాల నుంచి వచ్చిన వారికి అన్నసమారాధన చేసి, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. అక్కడ గ్రామ ప్రజల కోరిక మేరకు, అతి క్లిష్టమైన రహదారిలో ఉక్కునగరం నుండి దాదాపు 6 గంటలు (110 కిలోమీటర్లు) పయనించి, అక్కడ వారి మధ్య శాస్త్రోక్తముగా హోమ పూజాదికాలు ట్రస్టు ఛైర్మన్ నిర్వహించటముతో ఆ గిరిజనులు పులకించిపోయారు.

ఫిబ్రవరి 13వ తేదీ శివరాత్రి సందర్భముగా నర్సీపట్నం శ్రీ పాకలపాటి గురువుగారి ఆశ్రమములో జరిగిన విశేష కార్యక్రమాలలో ట్రస్టు ఛైర్మన్ దంపతులు పాల్గొని పూజాదికాలు నిర్వహించారు.

ఫిబ్రవరి 13వ తేదీ శివరాత్రి లింగోద్భవ సమయములో సద్గురు పాదుకా క్షేత్రములో, శ్రీ దత్తసాయిభరద్వాజులకు, పంచామృతాభిషేక సహిత, వివిధ పండ్ల రసాలు, క్షీరముతో సామూహిక అభిషేకము నిర్వహించి, అనంతరం ప్రసాద వినియోగము చేయటమైనది. అంతకు ముందు "శ్రీ శిరిడీ సాయిశ్వీరుడు" అనే అంశముపై ట్రస్టు ఛైర్మన్ సత్సంగము నిర్వహించారు.

మార్చి 18వ తేదీ తెలుగు నూతన సంవత్సరము ఉగాది, శ్రీ విళంబి నామ సంవత్సర సందర్భముగా, సద్గురు పాదుకా క్షేత్రములో, "గురు బలము – గ్రహ బలము" అనే అంశముపై సత్సంగము నిర్వహించి, అనంతరం శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు పంచాంగ పఠనం చేశారు.

మార్చి 24వ తేదీ ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవాన్ని (తిథి ప్రకారం) పురస్కరించుకొని సద్గురు పాదుకా క్షేత్రములో సామూహిక "సాయి మాస్టర్" పారాయణ చేయటము జరిగింది.

మార్చి 25వ తేదీ శ్రీరామ నవమిని పురస్కరించుకొని సద్గురు పాదుకా క్షేత్రములో, ఉదయం సామూహిక శ్రీరామాయణ పారాయణ చేసి, "శ్రీ సాయి భరద్వాజ ఆపన్న హస్తం" పేరిట 50 నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి, సమారాధన చేయటం జరిగింది. సాయంత్రం "శ్రీ సాయి – రాముడు" అనే అంశముపై ప్రత్యేక సత్సంగము నిర్వహించి, చందనోత్సవము జరిపి అనంతరం సమారాధన నిర్వహించారు.

జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో ట్రస్టు ఛైర్మన్ దంపతులు ఇంకనూ అనేక కార్యక్రమాలలో పాల్గొనటము జరిగింది. స్థలాభావము వలన కొన్నింటి వివరాలు మాత్రమే సంక్షిప్తముగా తెలియజేయటము జరిగింది.

సమీక్ష : **"జ్యోతిర్మయి"**, ఉక్కునగరం

# మేము సహితం సాయి సేవలో భాగస్వాములై...

ఆధ్యాత్మిక సామాజిక సేవలో భాగముగా 2018 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు కూడ నిర్వహించటం జరిగింది. ప్రతి నెల 'శ్రీ సాయి భరద్వాజ ఆపన్నహస్తం' పేరిట మానసిక, శారీరక, దివ్యాంగులు మరియు అతి నిరుపేద వితంతు కుటుంబాలకు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించటమే కాకుండా, శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు రజతోత్సవ వేడుకుల సందర్భముగా 75 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, వస్త్రాలు బహుకరణ, విద్యార్థులకు నోట్సు పుస్తకాల పంపిణీతో పాటు, సాయి సచ్చరిత్ర, శ్రీ సాయిలీలామృతము, శ్రీ గురుచరిత్ర గ్రంధాలు బహుకరించటం జరిగింది. శ్రీకాకుళంలోని అమ్మఫౌండేషన్ వారి అభ్యర్ధన మేరకు నీటిపైపు, బక్కెట్లు, అనాధ బాల సంఘములోని చిన్నారులకు పలకలు, పుస్తకాలు మొదలైనవి బహుకరించటము జరిగింది.

2018-19 విద్యా సంవత్సరమునకు గాను మారుమూల గ్రామాలలోని, నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కాలేజీ యూనిఫామ్స్, విద్యా సామాగ్రి, నోట్సు పుస్తకాలు బహుకరించటంతో పాటు, ఆధ్యాత్మిక సేవలో భాగంగా, శ్రీ శిరిడీసాయి శతాబ్ది మహాసమాధి

సంవత్సర సందర్భముగా అనేక మారుమూల గ్రామాలలో నూతన సత్సంగాలు స్థాపించి, అందుకు అవసరమైన బాబా చిత్రపటాలు, పూజా సామాగ్రి, భజన సామాగ్రి మొదలైనవి అందించదలచాము.

మేము చేపట్టే ప్రతి సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతాభి వందనములు అర్పించుకుంటూ, మీరిచ్చే ప్రతి రూపాయి సద్వినియోగము చేయుచున్నామని, చేయగలమని సవినయముగా తెలియజేసుకుంటూ, సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ కృపానుగ్రహముతో మరింతగా సేవా కార్యక్రమాలో పాల్గొనే శారీరక, మానసిక, ఆర్థిక శక్తిని ప్రసాదించాలని జగద్గురువును వేడుకుంటూ, సహాయ సహకారములు అందించిన వారి వివరాలు ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

### సహాయ సహకారములు అందించిన సహృదయులు

| | |
|---|---|
| శ్రీ కె.కరుణారెడ్డి మరియి మిత్ర బృందం, యు.యస్.ఏ | 70,276/– |
| శ్రీ కె.కామరాజు, శ్రీకాకుళం | 5100/– |
| శ్రీ బి.యశోభరత్, సింగపూర్ | 5000/– |
| శ్రీ సాయి భరద్వాజ సత్సంగం, గోపాలపట్నం, వైజాగ్ | 4531/– |
| శ్రీ కె.శరత్ చంద్రబాబు, కూర్మన్నపాలెం | 3348/– |
| శ్రీ సి.హెచ్.నరసింహరావు | 3000/– |
| శ్రీ వి.రమేష్ బాబు, శ్రీనగర్, విశాఖపట్నం | 3000/– |
| శ్రీ కె.అప్పలరాజు, యన్.టి.పి.సి, పరవాడ | 1503/– |
| సాయి భక్తుడు | 1200/– |
| శ్రీ బి.శివరామ కృష్ణారావు, ఉక్కునగరం | 1180/– |
| శ్రీ పి.దుర్గా ప్రసాదరావు | 1116/– |
| శ్రీమతి జి.వినీత, ఉక్కునగరం | 1001/– |
| శ్రీ వి.చిన్నంనాయుడు, ఉక్కునగరం | 1000/– |
| శ్రీ ఆర్.అప్పలరాజు, విశాఖపట్నం | 1000/– |
| చి॥ బి.సాయి సుజిత, ఉక్కునగరం | 1000/– |
| సాయి భక్తురాలు, విశాఖపట్నం | 1000/– |
| సాయి భక్తుడు, నెల్లూరు | 1000/– |
| సాయి భక్తుడు | 1000/– |
| సాయి భక్తుడు | 1000/– |
| కుమారి కె.ప్రమీల, శ్రీకాకుళం | 900/– |
| శ్రీమతి కె.మాణిక్యాంబ, కాకినాడ | 501/– |
| శ్రీ కె.సూర్యారావు, పెందుర్తి, విశాఖపట్నం | 501/– |
| శ్రీమతి యమ్.లలితకుమారి, అమలాపురం | 501/– |
| శ్రీ యన్.వి.కుమార్, శ్రీకాకుళం | 500/– |
| శ్రీ యస్.వి.రమణ, విశాఖపట్నం | 500/– |
| శ్రీ పి.యస్.వి.సతీష్ | 500/– |
| శ్రీ ఆర్.అప్పలరాజు, ఆర్.ఆర్.పురం | 500/– |
| సాయి భక్తురాలు, గాజువాక | 500/– |
| శ్రీ జి.భిక్షపతి, హైదరాబాదు | 360/– |
| శ్రీ యస్.వి.రమణయ్య, గుంటూరు | 300/– |
| శ్రీ టి.వెంకట రమణారావు, సికింద్రాబాదు | 300/– |
| శ్రీ కె.వీర రాఘవులు, రామరాజుపల్లి | 250/– |
| శ్రీ బి.ముత్యాలు, శ్రీకాకుళం | 200/– |
| శ్రీ బి.దామోదరు, శ్రీకాకుళం | 200/– |
| శ్రీమతి పి.జయశ్రీ, శ్రీకాకుళం | 200/– |
| శ్రీమతి పి.దీపిక, శ్రీకాకుళం | 200/– |
| శ్రీ కె.యస్.ఆర్.మూర్తి, కిర్లంపూడి | 116/– |
| శ్రీ వి.యస్.వి.ఆర్.కిషోర్, శ్రీకాకుళం | 110/– |
| శ్రీ బి.కృష్ణారావు, యల్.ఐ.సి, విశాఖపట్నం | 108/– |
| శ్రీ ఏ.వి.ప్రసాద్, శ్రీకాకుళం | 101/– |
| శ్రీ కె.అశోక్ కుమార్, నిజామాబాదు | 101/– |
| శ్రీమతి షీలా సర్పిత | 100/– |
| శ్రీ యమ్.నాగేశ్వర రావు, శ్రీకాకుళం | 100/– |
| శ్రీ జె.సాయి, శ్రీకాకుళం | 100/– |

## అక్షర యజ్ఞానికి చేయూత

శ్రీ శిరిడీ సాయిబాబా మహాసమాధి శతాబ్ది మహోత్సవాల సందర్భముగా "శ్రీ భరద్వాజ సద్గురువాణి" 2018వ సంవత్సరములో వెలువడే నాలుగు సంచికలు (జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు) శ్రీ శిరిడీ సాయి సంప్రదాయాన్ని మరింత విస్తృతముగా అందించే వివిధ వ్యాసాలతో ప్రత్యేక సంచికలుగా రూపొందించి అందించదలచాము. వ్యాసములు, ఆయా పేజీల సమర్పణ మరియు ప్రకటనల రూపంలో మీ సహాయ సహకారములందిస్తూ, ఈ బృహత్తర అక్షర యజ్ఞములో భాగస్వాములు కావలసినదిగా "శ్రీ భరద్వాజ సద్గురువాణి" సవినయముగా ఆహ్వానము పలుకుతున్నది. అక్షర యజ్ఞానికి చేయూతనిస్తున్న వారి వివరాలను ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

### అక్షర యజ్ఞంలో మేము సహితం

| | |
|---|---|
| శ్రీ కె.కరుణారెడ్డి, యు.యస్.ఏ | 19,858/– |
| శ్రీ బి.యశోభరత్, సింగపూర్ | 17,500/– |
| శ్రీ బి.చంద్రశేఖర్, సిక్కిం | 15,000/– |
| శ్రీ కె.శరత్ చంద్రబాబు | 7,000/– |

**ధన, వస్తు రూపేణా మీ విరాళములు పంపవలసిన చిరునామా:**

**శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్ట్ (రిజిష్టర్డ్)**

**సెక్టార్ - 8, క్వార్టర్ నెం. 206/ఎ, ఉక్కునగరం,**
**విశాఖపట్నం - 530 032. సెల్ : 9849645224**

E-mail : poorna.sai09@gmail.com
Visit : www.saisadguruvani.org
Facebook : SriShiridiSaiSevaTrust

**SRI BHARADWAJA PUBLICATIONS**
Online A/C No. 095510011006491

**SRI SHIRIDI SAI SEVA TRUST®**
Online A/C No. 095510011006492
IFSC Code: ANDB0000955
Andhra Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

**విన్నపము :** శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు నిర్వహించే సేవా కార్యక్రమాలకు చేయూతనిస్తూ, బ్యాంకు (ఆన్‌లైన్) ద్వారా విరాళములు పంపేవారు తమ పూర్తి వివరాలతో కూడిన సమాచారమును ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

**సెల్ నెం. : 98496 45224**

# జన్మదిన శుభాకాంక్షలు

ఏప్రిల్ 6వ తేదీన ఎన్.టి.పి.సి. పరవాడలో జన్మదినము
జరుపుకుంటున్న శ్రీ బి. చంద్రశేఖర్,
శ్రీమతి బి.వి. సుశీల ల కుమార్తె అయిన
**చి॥ సాయి గౌతమి** కి
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.

ఏప్రిల్ 17వ తేదీన విశాఖపట్నంలో
జన్మదినము జరుపుకుంటున్న శ్రీ కె. కామేశ్వరరావు,
శ్రీమతి సత్యగౌరిల కుమారుడైన
**చి॥ వెంకట సాయి శ్రవణ్** కు
జూన్ 1వ తేదీన పెళ్ళిరోజు జరుపుకుంటున్న
**శ్రీ కె. కామేశ్వర రావు, శ్రీమతి సత్యగౌరి** దంపతులకు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని
కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

విశాఖపట్నం, గాజువాక, శ్రీనగర్, అఫీషియల్ కోలనీలో
ఏప్రిల్ 23న జన్మదినం జరుపుకుంటున్న
**శ్రీ అల్లు శ్రీరాములు నాయుడు, శ్రీమతి అరుణ కుమారి** ల
కుమార్తె **చి॥ కావ్యశ్రీ** కు
మరియు ఏప్రిల్ 26న జన్మదినం జరుపుకుంటున్న
కుమారుడు **చి॥ ధనుష్ కుమార్** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని
కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

మే 1వ తేదీన ఉక్కునగరంలో పెళ్లిరోజు
జరుపుకుంటున్న **శ్రీ చెబోలు త్రినాధరావు**
**శ్రీమతి కృష్ణవేణి** దంపతులకు మరియు
మే 1వ తేదీన జన్మదినం జరుపుకుంటున్న
**చి॥ వరుణ్ కుమార్** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.

జూన్ 16వ తేదీన పరవాడలో జన్మదినము
జరుపుకుంటున్న శ్రీ పి. అప్పలరాజు,
శ్రీమతి పి. రాజేశ్వరి ల కుమార్తె అయిన
**చి॥ జ్ఞానిక** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.

## జన్మదిన శుభాకాంక్షలు

**ఏప్రిల్ 30వ తేదీన గురుగామ్‌లో ప్రధమ జన్మదినము జరుపుకుంటున్న**
**శ్రీ ఆర్.కాళీప్రసాద్, శ్రీమతి ఆర్.సాయి సృజన**ల కుమారుడు అయిన



**చి॥ వేంకట సాయి ఆదిత్య** కు
శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ కృపానుగ్రహము అందించాలని
కోరుకుంటూ శ్రీ భరద్వాజ సద్గురువాణి శుభాకాంక్షలు అందజేస్తున్నది.

శుభాశ్శీసులు అందజేస్తున్నవారు
తాతయ్య : శ్రీ ఆర్.సత్యన్నారాయణ   తాతయ్య : శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు
బామ్మ : శ్రీమతి ఆర్.రమాదేవి   అమ్మమ్మ : శ్రీమతి వి.యిస్.లక్ష్మీ
మరియు బంధువర్గము

## జన్మదిన శుభాకాంక్షలు

జూన్ 26వ తేదీ బెంగుళూరులో జన్మదినము జరుపుకుంటున్న
**శ్రీ వై. సాయికుమార్** ధర్మపత్నియైన



**శ్రీమతి వై. సాయి శిరీష** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు

**మే 6వ తేదీన అప్పాపురం గ్రామంలో**
**పెళ్ళిరోజు జరుపుకుంటున్న**



### శ్రీ యడ్ల నాగభూషణం, శ్రీమతి యడ్ల లక్ష్మి

దంపతుల వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు

**మే 29వ తేదీన పోతయ్యవలస గ్రామంలో**
**పెళ్ళిరోజు జరుపుకుంటున్న**



### శ్రీ కొంపెల్ల చిన్నిక్రిష్ణ, శ్రీమతి శ్రీలక్ష్మి

దంపతుల వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు

**మే 4వ తేదీన కూర్మన్న పాలెంలో**
**పెళ్ళిరోజు జరుపుకుంటున్న**



### శ్రీ కె.యస్.యస్. గిరినాద్, శ్రీమతి రమ్య

దంపతుల వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు

**ఏప్రిల్ 28వ తేదీన శ్రీకాకుళంలో**
**పెళ్ళిరోజు జరుపుకుంటున్న**



### శ్రీ కె. వెంకటరమణ, శ్రీమతి జయలక్ష్మి

దంపతుల వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.



# ద్వాదశ (12వ) వార్షికోత్సవము

తే 01-06-2018 దిన ద్వాదశ (12వ) వార్షికోత్సవము
జరుపుకొంటున్న శుభ సందర్భములో
తే 10-05-2018 దిన శ్రీసాయినాథుని మందిర **కుంభాభిషేకం**
మరియు
**శ్రీసాయి విశ్వేశ్వరాలయ ధ్వజస్తంభం ఆవిష్కరణోత్సవములు**
జరుపబడుచున్నవి.

పై కార్యక్రమముల సందర్భములో సాయిభక్తులందరికీ
శ్రీసాయినాథుని కృపాకటాక్షములు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థిస్తూ...

**శ్రీ షిరిడి సాయిబాబా సేవా సంస్థాన్**
ద్వారకానగర్, పాత ఎంప్లాయిమెంట్ ఆఫీసు దరి
ఇల్లిసిపురం, శ్రీకాకుళం, సెల్: 9908336785, 9440168667

విన్నపము: ధ్వజస్తంభ నిర్మాణం కొరకై సహాయం చేయదలచిన
దాతలు పై చిరునామాకు సంప్రదించవలెను.

## జన్మదిన శుభాకాంక్షలు

ఏప్రిల్ 20వ తేదీన ఎన్.టి.పి.సి పరవాడలో జన్మదినము
జరుపుకుంటున్న శ్రీ కె. అప్పలరాజు,
శ్రీమతి కె. హైమవతిల కుమార్తె అయిన
**చి॥ బేబిసాయి శరణ్య** కు
శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు

మే 31వ తేదీన ఎన్.టి.పి.సి, పరవాడలో
పెళ్ళిరోజు జరుపుకుంటున్న
**శ్రీ కె.అప్పలరాజు, శ్రీమతి హైమవతి**
దంపతుల వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో
గడవాలని అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ
కృపానుగ్రహము అందించాలని కోరుతూ
**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## జన్మదిన శుభాకాంక్షలు



జూన్ 15వ మరియు జూన్ 21వ తేదీన
పొందూరులో జన్మదినం జరుపుకుంటున్న
**శ్రీ యు. జనార్ధనరావు, శ్రీమతి జోత్స్న** దంపతుల
కుమార్తె చి॥ **ఝాన్సీ**
కుమారుడు చి॥ **సిద్ధార్ధ** కు
శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ
కృపానుగ్రహములు అందించాలని కోరుతూ
సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది

Birla White | Birla White | WALL CARE
White Cement Based Putty

**M.S.R. GUPTA**
Partner



# AYYAPPA ENTERPRISES

**Deepamahal Side, Srikakulam - 532 001.**
**Ph : 221733 (S), Cell : 9440061911**

*Dealers in :*
**Birla White Cement, Novapan, Royale Touche Laminates, Masaiq Chips, PVC Doors, Plywood & Cine Arc Carbons**

---



M. శ్రీనివాస గుప్త
సెల్ : 9440348009
8885348009

# శ్రీ విజయ దుర్గ గ్రానైట్స్ & టైల్స్

మా వద్ద అన్ని రకముల గ్రానైట్స్, కడప, మార్బుల్స్, ఫ్లోరింగ్ టైల్స్, ఎలివేషన్ టైల్స్, పార్కింగ్ టైల్స్ మొదలగునవి లభించును.

కిచెన్ ప్లాట్‌ఫామ్స్, షింకులు మీకు నచ్చినవిధంగా తయారు చేయబడును.

**హోల్ సేల్ రేట్లకే రిటైల్‌గా లభించును**

కంప్యూటరైజ్డ్ నేమ్ బోర్డ్స్ మరియు ఫిగర్ వర్క్స్ గ్రానైట్ & మార్బుల్స్‌పై వర్క్ చేయబడును.

Opp. P.S.N.M.H. స్కూల్, కొన్నా వీధి, శ్రీకాకుళం.

---

జై గురుదేవ  కృష్ణమ్‌వందే జగద్గురుమ్



హనుమాన్ జయంతి శుభాకాంక్షలు



కర్నేన అశ్వని శ్రీనివాస్
(మార్బుల్ శ్రీను)

# శ్రీ సాయి పల్లవి మార్బుల్స్, గ్రానైట్స్ & టైల్స్

ఐ.డి.బి.ఐ. బ్యాంక్ వెనుక, సానా వీధి,
శ్రీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా, శ్రీకాకుళం.
సెల్ : 9440168399, 9010533566

**మా వద్ద మార్బుల్స్, గ్రానైట్స్, టైల్స్ హోల్ సేల్ రేట్లకే రిటైల్‌గా లభించును**

మా ప్రత్యేకత గ్రానైట్ & మార్బుల్స్‌కు సంబంధించిన డిజైనింగ్ వర్క్స్ చేయబడును.

---



9440153738
✆ 9441072736
9246453738

మాచర్ల హరి  M.N. ఆంజనేయులు

# ఓం శ్రీ సాయి మార్బుల్స్

ఒన్-వే ట్రాఫిక్ రోడ్, Opp. I.D.B.I. బ్యాంక్,
మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం.

*: మా వద్ద :*
అన్ని రకముల మార్బుల్స్, గ్రానైట్స్, టైల్స్ మరియు ఎలివేషన్ టైల్స్ సరసమైన ధరలకు లభించును.

మా ప్రత్యేకత : **శ్రీ సాయినాథుడు** మరియు సకల దేవతల విగ్రహములు మీ ఆర్డరుపై సప్లయి చేయబడును.

# ఉపాసనా మార్గము

"మన మందరము అనేక జన్మలుగా అనుభవించుచు వచ్చుచున్న జననమరణములు అనెడి దుఃఖసముద్రము నందుండి తప్పించుకొని నిత్యానందసుఖము అనుభవింప కోరుచున్నాము. దాని కేమి చేయవలయునో దానిని ఈక్రింద చెప్పు చున్నాను. ఒక కన్యకు ఋతుకాలము వచ్చి వివాహమైన వెనుక తన కుటుంబములోని సకల కార్యములను చేయుచు,తన అత్త, మామ, బావ, మరిది మొదలగువారియందు ప్రీతిగలదై ఉండి, వారలకుపచారము చేయుచున్ననూ, తన ప్రాణనాథుని యందు మాత్రము అధిక ప్రీతి నుంచి, మిక్కిలి ప్రేమతో ఉండును. అట్టి స్త్రీకి పుత్రసంతానము కలిగెనేని మగనికన్నను, తన పుత్రునిపై అధికప్రీతి నుంచి, పాలిచ్చి, ముద్దు పెట్టి, ఊయాలలో పవ్వళింపజేసి, జోకొట్టి కీర్తనలను పాడి, లాలించి, నిదురపుచ్చి, అప్పుడప్పుడు తన పనులను వదలి బిడ్డతో చెల్లాటము లాడుచు ఆనందించుచుండును. అటులనే మనము అనేక జన్మములుగా చేయుచువచ్చిన పుణ్యవిశేషమువలన మానవ జన్మ మెత్తినను, కొన్ని దినములలో నీటిబుగ్గవలె నశించిపోవునట్టి భార్య, బిడ్డ, ధన, ధాన్యాదులయందు అధిక ప్రీతినుంచి, నిలుకడలేని సకల భోగములను నిజమని తలచి మన కాలమంతయు, ద్రవ్యము సంపాదించుటయందు గడిపి, మరణమునకు భయపడకయు, పరమాత్ముని వెదుకకయు, నాశనమైపోవుచున్నాము. గనుక పరమాత్ముని ఎడతెగక జపముచేయుచు రావలయును. అట్లు కానియెడల దేవాలయమునకు వెళ్ళి, అచ్చట ఉండు దేవతా విగ్రహములపై దృష్టినిలిపి, అంతర్ముఖముగా (లోజూపుగా) జూచి ధ్యానించుచుండవలయును. మనము దేవాలయములో ప్రవేశించునపుడు మొదట ధ్వజస్తంభము, దానిముందు బలిపీఠము ఉండును.



మన మనస్సులో నిండి ఉండు కామక్రోధాదులు, అహంకార మమకారము లనెడి దుర్గుణములను ఆ బలిపీఠముపై బలి ఇచ్చి, ఏ తలంపులులేక నిర్మలమగు మనస్సుతో నందికి, ఎడమప్రక్కగా మూలస్థానములో ప్రవేశించి, ఆ మూల విగ్రహముపై బాగుగా దృష్టిపెట్టి చూసి, ఆ రూపమును కళ్ళుమూసి భ్రూమధ్యంబున నిలిపి, లోజూపుగా చూసి, కొంతసేపు ఏకధ్యానముగా ఉండిన పిమ్మట గుడిఅర్చకునిచే విభూతి ప్రసాదముల పుచ్చుకొని వెళ్ళునపుడు నందిని అడ్డగించి పోరాదు. ఎందుకనగా నంది ఈశ్వరునికి ఎదుట ఉండి తన ముక్కు ద్వారములగుండా లోపల వెలుపల విడుచుచు పీల్చుచుండెడి ఉచ్ఛ్వాసనిశ్వాసములనెడి నూలుచే ఈశ్వరునికి చామరము వీయుచున్నది. కనుక నందిని అడ్డగించి పోరాదు, ఈశ్వరుడు మహాయోగి,ఎల్లప్పుడు అగ్ని స్వరూపుడుగా ఉండువాడు. ఆయనకు అభిషేకమే ప్రీతి గనుక "అభిషేకప్రియః శివః" అని చెప్పబడును. నైవేద్యముగా టెంకాయ కొట్టడములోని భావము ఏమనగా పీచు తీయని టెంకాయ పై చూపునకు మిక్కిలి చక్కగాను, నునుపుగా ఉండునట్లు – స్త్రీ పురుషులయొక్క పై చర్మములంతయు అనేక వర్ణములుగా నునుపుగా కనబడుచుండును. పై చెప్పిన టెంకాయ పీచును తీయునపుడు విశేషముగా చిక్కులు చిక్కులుగా వచ్చుచుండును. అటులనే స్త్రీ పురుషుల యొక్క శరీరముయొక్క పై చర్మము మాత్రము నునుపుగా ఉన్నను శరీరము లోపల అనేక విధములైన ఆశాపాశములు, టెంకాయను చిక్కుతో కప్పుకొనియుండు పీచువలె కప్పుకొని ఉన్నవి. ఇట్టి ఆశాపాశము లనెడి చిక్కులను విడదీసి చూచునపుడు టెంకాయలో తెలుపు ఉండునట్లు, మనిషిలో శుద్ధ పరమాత్మ స్వరూపము కప్పుకొని ఉన్నది.

ఆ పరమాత్మ స్వరూపమును కప్పుకొనియుండు ఆశాపాశములనెడి చిక్కులను పారద్రోలి (విడదీసి), నన్ను పరమాత్మ స్వరూపములో చేర్పింపవలయునని దేవునకు కొబ్బరికాయను కొట్టి చూపుటకు కారణముగా ఉన్నది. టెంకాయను పగులగొట్టి పళ్ళెములో ఉంచి దేవునియెదుట పెట్టి, యిదిగో యిట్టి తెల్లవర్ణమువంటి ఆత్మస్వరూపము నాలోనున్నది. టెంకాయపై మూసికొని ఉండిన చిక్కు పీచువలె, అనేక జన్మములుగా ఆశాపాశములనెడి అనేక చిక్కులు నాలో ఉండు ఆత్మస్వరూపమును కానరాకుండునట్లు చేయుచున్నది అని వేడుకొనటమే కాక, కర్పూరపు గడ్డ వెలిగించి చూపి, ఇదిగో కర్పూరమంతయు వెలిగి ఏమియు మిగులక జ్యోతిస్వరూపమై కరిగిపోవునట్లు, నా ఆశాపాశములనెడి కర్మములన్నియు పై చెప్పిన కర్పూరపు గడ్డవలె కరిగి, నాలో ఉండు ఆత్మ స్వరూపమును, పరమాత్మ స్వరూపములో చేరునట్లు చేయవలయునని యెరుంగ వలయును. కాబట్టి యెవరెవరికి ఏయే దేవతల మీద ప్రీతియో, ఆయా దేవతలయందు పై చెప్పిన కుటుంబములోని స్త్రీవలె అధిక ప్రీతినుంచి, ధ్యానించుచు రావలయును. అభిషేకపు నీటిధారవలె ఈశ్వరుని ఎడతెగక ధ్యానించుచు వచ్చుచున్న ఎడల, ఆ ఉపాసనామూర్తి కృపచే పరమాత్మ దర్శనము కలుగును. అట్లు దర్శనమైన వెంటనే వేలకొలది కాకులముందు ఒక రాయి రువ్వితిమేని, ఆ కాకులన్నియు ఆ క్షణమే పరుగెత్తి ఎట్లు కానరాక ఎగిరిపోవునో, అదే విధముగా అనేక జన్మములుగా మనము చేయుచువచ్చిన పాపకర్మములన్నియు మనలను విడిచి తొలగిపోవును. ఇట్టి సాధనములో ఉండువారు సకల జీవరాశులను తమవలె భావించి, విశేష ప్రీతిగలవారై ఉందురు. వారికి బీదవాడు, ధనికుడు, మంచివాడు, చెడ్డవాడు, పుణ్యవంతుడు, పాపి, కులములో హెచ్చైనవాడు, తక్కువైనవాడు, విద్వాంసుడు, మూఢుడు అనెడు ఎట్టి భేదములు లేక అందరిని సమముగా భావించి, శాంతి, దయయు గలవారై ఈశ్వరునితో సమానులై ఉందురు. ఉపాసనామూర్తి మోక్షమునకు దారిచూపెడి దేవత. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని అనుకొనేవాడు నన్నసలు చూడనట్లే. నీవు చూసేదంతాకలసి నేను" అన్నారు సాయి.

సేకరణ : **"అంగీరస"**

# భిక్షను కోరిన దత్త దిగంబరుడు



## సాయి భిక్ష చేసిన మార్గము

బాబా షిరిడీలో స్థిర నివాసమేర్పరచుకున్నది మొదలు మహా సమాధివరకు నిత్యము భిక్షను కొనసాగించెను. బాబా మొదటి మూడు సంవత్సరములు దినమునకు ఎనిమిది పర్యాయములు, అటు పిమ్మట మూడు సంవత్సరములు దినమునకు నాలుగు పర్యాయములు, తదుపరి పుష్కరకాలము దినమునకు రెండు పర్యాయములు తరువాత మహా సమాధి వరకు దినమునకు ఒక్క పర్యాయము భిక్షను చేశారు.

1916లో ప్రొ. జి.జి. నార్కేకు బాబా తరపున భిక్షచేయు అదృష్టము కలిగెను. బాబా అనేక మందిని తన తరపున భిక్షకు పంపుట గాంచిన నార్కే తనకు కూడ అట్టి అదృష్టము లభించవలెనని మనసునందే బాబాను వేడెను. 1910 లో నార్కే బాబాను దర్శించగా **"నేడు ఇతను నా తరపున భిక్ష చేయవలె"** నని చెప్పి అతని కోర్కె నెరవేర్చెను.

బాబా ఉదయము 8 గంటలకు భిక్షాటన ప్రారంభించెడి వారు. ఎల్లప్పుడూ తానెంచు కొనిన ఐదు గృహముల నుండి మాత్రమే భిక్షను స్వీకరించెడివారు. బాబా తన శిరమున పెద్ద వస్త్రమును కప్పుకొనెడివారు. దాని రెండంచులు మడువగా అది జోలెగా మారెడిది. ఆ జోలెలోనే బాబా రొట్టెలు, అన్నము మొదలగునవి వేసుకొనెడివారు. లోటాలో ద్రవ పదార్థములైన పులుసు, కూరలు మొదలగునవి వేసుకొనెడివారు.


ద్వారకామాయి నుండి బయలుదేరి తూర్పుదిశగా చావడిని దాటగానే సఖారాం షెల్కే, వామన్‌రావు గోండకర్ గృహములకు ఎదురుగా గల రహదారిలో నిలబడి భిక్షను స్వీకరించెడివారు. నిత్యము ఒకే ప్రదేశమున నిలబడి "ఓ లస్సీ రొట్టె ముక్క పెట్టు" అని పిలచెడివాడు. అక్కడ నుండి బయ్యాజిపాటిల్ గృహము వైపుకు సాగెడివాడు. దారిలో చిన్న మిట్ట ఉండెడిది. బాబా అక్కడ కొంత తడవు నిలిచి పక్షులకు ఆహారమును తినిపించెడివారు. ఈ సంఘటనకు గుర్తుగ ఆ పవిత్ర ప్రదేశమందు పాదుకలను ప్రతిష్ఠంచుట జరిగినది. ప్రస్తుతము ఈ పాదుకలు నరసింహ లాడ్జి కుడ్యములో గల చిన్న మందిరమున గలవు. ఈ పాదుకలు చలువ రాతిపై చెక్కబడి ఉన్నవి. ఈ రెండు పాదుకలకు మధ్యన చిన్న నీటి గుంట గలదు. పక్షుల దాహార్తి తీర్చుటకై బాబా ఈ గుంతను నీటితో నింపెడివాడు. బయ్యాజి మరియు తాత్యాల గృహములు ఒకే సందులో ఒకదానికొకటి అతి సమీపమున గలవు. ఈ రెండు గృహముల నుండి భిక్షను స్వీకరించిన పిదప బాబా తాజిమ్‌ఖాన్ దర్గా మార్గమున నందరాం గృహమునకు చేరి అక్కడ భిక్షను స్వీకరించిన పిదప మసీదుకు చేరెడివారు.

## బాబా భిక్ష స్వీకరించిన ఐదు ఇండ్లు



### సఖారాంషెల్కే :

ఈ గృహము బాబా చావడికి అతి సమీపమున గలదు. ఇది పడమర ముఖి గృహము. సఖారాం ధనిక కుటుంబమునకు చెందిన భూస్వామి. బాబా యందు అచంచల విశ్వాసము గలవాడు. ఇతని మనుమడి భార్యయైన హరిబావ్ (సాకర్‌బాయి) బాబా సఖారాంను ఏ రీతిన ప్రేమించినది ఎంతో చక్కగా వివరించెను. బాబా భిక్షకేగినప్పుడు వామన్‌రావ్ గోండకర్ సఖారాంల గృహములకు మధ్యగల రహదారిలో నిలబడి "సఖారాం రోట్ దే" (సఖారాం రొట్టె నివ్వు) అని పిలచెడివారు. సాకర్‌బాయి తన కురమారుడైన త్రయంబక్ కొంత స్థలమును బాబా సంస్థానమునకు విరాళమిచ్చినట్లు తెలియజేసెను. ఈ త్రయంబక్ సమాధి ఈ గృహమునకు ప్రక్కనే గల నరసింహ మందిర ప్రాంగణమందు గలదు. ఈ నరసింహ మందిరమును షెల్కే వంశస్తులే నిర్మించిరి.



### వామన్‌రావు గోండకర్ :

ఈ గృహము చావడికి ఎదురుగా, షెల్కే గృహమునకు సమీపమున గలదు. వామన్‌రావు షిరిడీలోనే పుట్టి పెరిగెను. ఈ వంశస్థులు పెద్ద భూస్వాములు. వామన్‌రావు వారసులు తెలిపిన ప్రకారము వీరికి షిరిడీ మరియు పరిసర గ్రామములందు షుమారు

500 ఎకరముల భూమి గలదు. లెండీబాగ్ మరియు చుట్టుప్రక్కల స్థలము కూడ వీరిదే కాగ లెండీబాగ్‌ను మోరేశ్వర ప్రధాన్ కొనుగోలు చేసి సంస్థానమునకు సమర్పించెను. బాబా భిక్షను స్వీకరించిన ఐదు గృహములలో ఇది ఒకటి.

రాధాకృష్ణమాయి తీవ్రమైన జ్వరముతో బాధపడుచుండగ బాబా నిచ్చెన సహాయముతో వామన్‌రావు ఇంటిమీదకు ఎక్కి రాధాకృష్ణమాయి ఇంటి పైకప్పునెక్కి రెండవ వైపు నుండి క్రిందకు దిగెను. నిచ్చెన తెచ్చిన షింపే కాంబ్లేకర్ కష్టమునకు బాబా రూ౹౹ 2/- లు నివ్వగా అక్కడున్న భక్తులందరు నిచ్చెన తెచ్చినందులకే రూ. 2/- చాల ఎక్కువ అని చెప్పగా బాబా వారితో ఎవ్వరి శ్రమను ఉచితముగ స్వీకరించరాదనియు, కష్టమునకు మించిన కూలి నివ్వవలెనని హితవు పలికెను. అంతవరకు సంతానములేని కాంబ్లేకర్ బాబా ప్రసాదించిన రెండు రూపాయలను పూజించగా, అనతి కాలమందే అతనికి ఇరువురు కుమారులు కల్గిరి. వామన్‌రావు 15-3-1964లో సమాధి చెందెను. ఇతని వారసులు షిరిడీలోనే నివసించుచు వారసత్వపు సంక్రమణమును కొనసాగించుచున్నారు.




### బయ్యాజి అప్పాకోతే పాటిల్ (సాయి కుటీర్) :

బయ్యాజి అప్పాకోతేపాటిల్ పెద్ద ఆసామి. బీర్‌గాంకు శిస్తువసూలు అధికారి మరియు పోలీసు ఆఫీసరు. బయ్యాజీ పదకొండు సంవత్సరముల వయస్సునుంచే బాబాను సేవించుట ప్రారంభించెను. బాబా అన్ని మతముల వారిని సమాన దృష్టితో చూచుట, ముస్లింలు నమాజు చేయునపుడు హిందువులను నిశ్శబ్దము పాటించమని చెప్పుట, హిందువులు పూజలు చేయునపుడు ముస్లింలను వారిని అభ్యంతరపరచ కుండునట్లుగాను చూచుట బయ్యాజిని ఎంతో ఆకర్షించెను. బాబా ప్రసాదములు, మిఠాయిలు అందరికి సమానముగా వితరణ చేసెడివారు. బాబా దృష్టిలో సమస్త ప్రాణికోటికి సమాన స్థానముండెడిది. బయ్యాజి తండ్రి మరణమును బాబా ముందుగానే హెచ్చరించెను. బాబా తెలియజేసిన ప్రకారమే అతను స్వర్గస్తుడయ్యెను.

బాబా బయ్యాజికి నిత్యము రూ. 4/- నిచ్చి **"వీటితో తిని విసర్జన చేయవద్దు"** అని చెప్పగా బయ్యాజి ఆ ధనమును భద్రపరచి ఒకేసారి 64 ఎకరముల భూమిని కొనుగోలు చేసెను. ఆ భూమియందు ఏమి పండించవలసినది కూడ బాబాయే చెప్పెడివాడు. బాబా సలహాను పాటించిన బయ్యాజి అనతి కాలములోనే ధనికుడయ్యెను.

బాబా మహాసమాధి చెందు సమయమున బాబా చెంతగల కొద్దిమంది భక్తులలో బయ్యాజి ఒకడు. **"నేను వెళ్ళి పోవుచున్నాను, నన్ను రాతివాడలోనికి తీసుకు పొందు. బ్రాహ్మణులందరు నా చెంతనే వసింతురు"** అని బాబా చెప్పినట్లు బయ్యాజి చెప్పెను. బాబా చివరి క్షణములలో బయ్యాజిపై ఒరిగి మహాసమాధి చెందెను.



### బయుజాబాయి కోతే పాటిల్ (బయజామా) :

సాయి కుటీర్ ప్రక్కనే ఈ గృహము కలదు. బయజామా షిరిడీకి చెందిన ధనికుడు, భూస్వామియైన గణపతి కోతే పాటిల్‌ను వివాహమాడి షిరిడీలో సుఖశాంతులతో జీవించసాగెను. ఆమె బాధ్యతాయుతమైన గృహిణిగా ఇంటి పనులన్నియు స్వయముగా చేయుటయే గాక పెద్దల ఎడ గౌరవ మర్యాదలతోను, పిన్నల ఎడ ప్రేమాభిమానములతోను మెలగెడిది. రుచికరమైన వంటచేసి అతిథులను తృప్తిపరచుట అన్నిటికంటే ఆమెకు ఇష్టమైన పని. అన్నము పరబ్రహ్మ స్వరూపమన్న సత్యమును గ్రహించిన వ్యక్తి. బాబా షిరిడీకి వచ్చిన తొలి రోజులలోనే బాబాకు భోజనము సమకూర్చిన ప్రథమ భక్తురాలు బయజామా, బాబా దివ్యత్వమును గ్రహించిన బయజామా బాబా ఎచటనున్నను వెదకి, వెదకి బాబాకు భోజనము సమర్పించెడిది. బాబా భుజించిన తరువాతనే తాను భుజించెడిది. బాబా మసీదులో స్థిరనివాసమేర్పరచుకున్న తరువాత బాబాను వెదికే శ్రమ బయజామాకు తప్పెను.

బాబా నిత్యము బయజామా నుండి భిక్షను గైకొనెడివాడు. ఆమె కూడ బాబా కొరకు తాజాగాను, రుచికరమైన పదార్థములను వండి ప్రేమతో అర్పించెడిది. ఒకసారి బాబా **"నీకు సంపద కావలయునా లేక నీ వంశాభివృద్ధి (కుటుంబ సంక్షేమము) కావలెనా?"** అని అడుగగా ఆమె వెంటనే నిశ్శందేహముగా వంశాభివృద్ధినే కోరెను. అప్పటివరకు తాత్యాకు ముగ్గురు భార్యలున్నను సంతాన ప్రాప్తి కలుగలేదు. బాబా ఆశీర్వాదముతో అతనికి ముగ్గురు కుమారులు, ఇరువురు కుమార్తెలు జన్మించి వారి వంశాభివృద్ధి జరిగెను. బాబా తన అభయమును నిలుపుకొనుటకు వారిని అహర్నిశలు కాపాడుటయే గాక తాత్యా కొరకు తన ప్రాణములను సహితము త్యజించెను.



**నందరాం మార్వాడి :**

నందరాం మార్వాడి ధనిక కుటుంబమునకు చెందిన వ్యక్తి. ఇతను వడ్డీ వ్యాపారియైనను దయార్ద్ర హృదయుడు, సహనశీలి. నందరాం పితామహుడు రాజస్థాన్‌లో గల ఖరాడ్ గ్రామమునుండి షిరిడీకి వచ్చి స్థిరపడెను. నందరాం 1866లో షిరిడీలో జన్మించెను. బాబా నిత్యము భిక్షను స్వీరించిన ఐదు గృహములలో నందరాం గృహము కూడ ఒకటి. ఈ గృహము ద్వారకామాయికి ఎదురుగా అతి సమీపమున ఉన్నను బాబా మాత్రము ఈ గృహమునుండి చిట్టచివరిగా భిక్షను స్వీకరించెడివారు. బాబా ఈ గృహస్తులను మిక్కిలి ప్రేమించెడివాడు. నందరాం భార్యకు కొద్దిగా నత్తి ఉండుటచే బాబా **"ఓ బోపడీబాయి భిక్షా దే"** (ఓ నత్తమ్మా భిక్షనిమ్ము) అని వేళాకోళముగా పిలచెడివారు. ఆమె భిక్ష తెచ్చుట ఆలస్యము చేసిన బాబా ఆమెను దుర్భాషలాడెడి వారు. బాబా చాల అరుదుగా ఆమెను బొబ్బట్లు మరియు వివిధ రకములైన కూరలతో భోజనము పెట్టమని అడిగెడివారు. ఆమె బాబా ఆజ్ఞను తలదాల్చి బాబా కోరిన పదార్థములన్నిటిని తయారుచేసి సమర్పించగా బాబా వాటిని రుచి చూచి మిగిలిన పదార్థములను భక్తులకు పంచెడివారు. 1911వ సంవత్సరములో షిరిడీలో ప్లేగు వ్యాధి వ్యాపించగ చాలమంది గ్రామము విడిచి ఇతర గ్రామములకు వలస పోయిరి. అదే లక్షణముగా గుర్తించి భయకంపితుడై షిరిడీ వదలి వేరే గ్రామమునకు వలసపోవ నిశ్చయించుకొని బాబా అనుమతి వేడగా బాబా అతనికి అనుమతి నివ్వక "నేను మరణించు వరకు నీ చెంతకు మృత్యువును రానివ్వను" అని అభయమొసంగి ఊది ప్రసాదము నిచ్చి ఆశీర్వదించెను. దానితో అతని ప్లేగు వ్యాధి పలాయనము చిత్తగించెను. నందరాం పితామహి, రాధాబాయి, తన కుటుంబములో మగ సంతానము పసితనమందే మరణించుచుండుటచే బాబాను శరణువేడగా, బాబా ఆమెకు మూడు మామిడిపళ్ళనొసంగగా ఆమె ముగ్గురు కుమారులకు జన్మనిచ్చెను. వారు బాబా ఆశీర్వాదముతో చిరకాలము జీవించిరి. నందరాం చేసిన అనేక ఉత్తమ కార్యములలో అత్యుత్తమ మైనది బూటివాడ ద్వారకామాయికి మధ్యగల స్థలమును బాబాకు సమర్పించి ధన్యుడయ్యెను. దాము అన్నా ప్రేరణతో ఈ పుణ్యకార్యమును చేయగా సమాధి మందిరము ముందుభాగమున సభామండపము నిర్మించుట జరిగెను. నందరాం మంచి కార్యములు చేయుటలో అందరికంటే ముందుండెడివాడు. ఇతను ఎల్లపుడు ఇతరులనుండి ఏమీ ఆశించక ఇతరులకు తన శక్తి కొలది సహాయపడెడివాడు. ఇతను మారుతి మరియు గణపతి మందిరములకు మరమ్మత్తులు కూడ చేయించెను.

ఈ మహాభక్తుడు 13-10-1946న సమాధి చెందెను. నందరాం వంశస్థులు నేటికినీ ఆయన అడుగుజాడలలో నడచుచు ఆయన ఆశయసిద్ధికై పాటుబడుచున్నారు.

సౌజన్యం : **'విన్ని' చిట్టూరి "షిరిడీలోని అమృతధారలు"**

సేకరణ : **"సత్యేంద్ర"**

# సద్గురువు ఎలా ఉంటారు

సద్గురువు బ్రహ్మనిష్టుడు, శ్రోత్రియుడు అయి ఉంటారని శాస్త్రం. బ్రహ్మనిష్ట అనగా బ్రహ్మను పొందినవాడు. శ్రోత్రియుడు అనగా సర్వమూ తెలిసినవాడు అని అర్థము.

అయితే సాయిబాబా వాచా బోధించలేదు గనుక వారిని చూచి తెలుసుకున్న వివరాలు బట్టి, పై లక్షణాలు సద్గురువు కలిగి ఉంటారని భావించవచ్చు. చూచి ఏమి తెలుసుకున్నాము?

**వారి సర్వజ్ఞత :**

భక్తుల భూత, భవిష్యత్, వర్తమానములు కాక, సర్వజీవుల చర్యలు వారికి తెలుస్తుండేవని భక్తులకు అనుభవమయ్యేది. అది ఏ ధ్యానస్థితిలో కాక, సహజంగానే వారినుంచి అలాంటి అనుభవాలు వెలువడుతుండేవి. పైగా గతజన్మల తప్పిదాలు కూడా ఎఱుకపరచి కర్మ నివృత్తి తెలిపేవారు సాయి. బల్లిరాకడ, మేకల ఆదరింపు, కప్ప-పాముల వైరము, ఇలా ఒకవైపు నరదేహంతో శిరిడీలో సాయి సంచరిస్తూ, విశ్వాత్మస్థితిని అనుభవించేవారు. భక్తుని హృదయగత భావాలు అనుక్షణం ఆయనకు తెలుస్తుండేవి. ఏ పని ఎప్పుడు ఏ సమయంలో అవుతుందో, విఫలమవుతుందో చెప్పేవారు. ఒకవైపు ఎలుకలు ఇంట్లో చచ్చి పడుతున్నా, ప్లేగు భయంకరంగా వ్యాపించియున్నా, ఇల్లు మారమంటారా? అని కోరిన భక్తుడిని "వద్దు" అని ఆదేశించి, అది అతను పాటించేలాగా భక్తిని హృదయంలో పటిష్టము చేసిన వారి అద్భుతశక్తి అమోఘం. వారి సర్వజ్ఞత, అనుభవాలు ఈనాటికీ (సమాధి చెందిన తర్వాత కూడా) అందిస్తున్న సాయి పరబ్రహ్మ స్వరూపుడు. కనుక సద్గురువు సర్వజ్ఞుడు అయి ఉంటాడు. జీవ బ్రహ్మైక్య స్థితిని కలిగి ఉంటాడు. ఇవన్నీ కలిగి ఉన్న వారు సద్గురువు అంటే **"సద్గురువు శిరిడీ సాయిలా ఉంటారు".** – **"నామధారకుడు"**

# ధర్మానుష్ఠానంలో అందరి శ్రేయస్సు యిమిడివుంది

"కాలగతిలో సమాజంలోని అన్ని రంగాలవలె ఆధ్యాత్మిక రంగంలో కూడా అధర్మపరులు ఎక్కువై, భ్రష్టుపట్టిస్తూ ఆధునిక నాగరికతా ప్రభావ విషవలయం జనులను ప్రలోభపెడుతుండడంతో, తమకూ సమాజానికి శ్రేయస్సు కలిగించే ఆధ్యాత్మిక పూర్ణత్వం చెందించగల జీవిత లక్ష్యమే మరుగున పడిపోయింది" అంటారు శ్రీ భరద్వాజ సద్గురువులు.




ఈ మధ్యలో ఆధ్యాత్మికత పేరిట పూర్ణత్వం పొందని వారు గురువులై, వివిధ రకాల నకిలీ సంప్రదాయాలు తలెత్తి తమదొక కొత్త మార్గంగా ప్రచారం చేసుకుంటూండడం, అసలేదో, నకిలీ ఏదో తేల్చుకోలేని అయోమయంలో వడిపోతున్నారు సామాన్యజనులు. శాంతి ఆనందాల కొరకు అట్టి గురువుల నాశ్రయిస్తున్న జనావళి అట్టివి పొందలేక సందేహాస్పదులై మరొక గురువు వద్దకు పరుగులు పెడుతూ, ఏది మంచో ఏది చెడో గుర్తించలేకున్నారనేది సద్గురు శ్రీ భరద్వాజ వాణి.

నేటి కాలంలో సామాజికంగా, నైసర్గికంగా ప్రజలలో అనేక మార్పులు అతి త్వరగా సంభవిస్తున్నాయి, సమాజంలో అధర్మం, స్వార్థం, అశాంతి, అసౌఖ్యం పెచ్చు మీరుతున్నాయి. ప్రజలకు ధర్మబోధ చేయాల్సిన వ్యవస్థలలో కూడా దానిని ప్రబోధించే వ్యక్తులు బలహీనులై, అధర్మవర్తనులై మహాత్ములు చెప్పిన సామాజిక శ్రేయోధర్మాన్ని తప్పి ప్రవర్తిస్తున్నారనేది సద్గురు శ్రీ భరద్వాజ మహరాజ్‌గారి ఆవేదన. చిరకాలంగా మహాత్ములంతా ధర్మాన్ని ఆచరిస్తూ ప్రబోధిస్తూ వస్తున్నారు. మన శ్రేయస్సుకు, యితరుల సుఖసంతోషాల కొరకు మనమంతా అట్టి మహాత్ముల ప్రవచనాలను విధిగా ఆచరించి తీరాలి. ఇది అందరి శ్రేయస్సుకొరకు కాబట్టి ఎవరికోసం వారాచరించే ధర్మాచరణలో అందరి శ్రేయస్సు యిమిడి వుందనేది సద్గురు శ్రీ భరద్వాజ వ్యాఖ్య.

ఇటువంటి అసలు, నకిలీల గందరగోళాల నుండి మనస్సును ఉద్ధరించడానికే భగవంతుడు సద్గురు శ్రీ సాయినాధుని రూపంలో అవతరించి, 60 సంవత్సరాలు మనమధ్య నివసించిన సాయి ఎన్నడూ అధర్మానికి పాలుపడలేదని వారి చరిత్రను అధ్యయనం చేసిన వారందరికీ తెలిసినదనేది మాస్టారిగారి ధృడవిశ్వాసం. అలాగే సద్గురు భరద్వాజులు కూడా ఎన్నడూ ధర్మం తప్పినడిచినట్లు ఎక్కడా ధాఖలాలు లేవనేది ఈ వ్యాస రచయిత అనుభవం, ధృడవిశ్వాసం కూడా.

సాయినాధుని యధేచ్ఛగా సందర్శించడం ఆయనలోని ప్రత్యేకత. వారి దర్బారు అన్నివేళలా తెరచి వుండేది. జాతి, కుల, మత, వర్ణ వివక్షత లేకుండా అందరూ వారిని దర్శించేరు. వారి చర్యలన్నీ మరుగులేక బాహాటంగా వుండేవి. తమను నిశితంగా విమర్శగా పరిశీలించే భక్తుల దృష్టి నుండి దేన్నీ మరుగుపరచుకోలేదు. సాయి చర్యలన్నీ సంశయించడానికి వీల్లేనివిగా, బాహాటంగా వుండేవి.

మనిషి తాను, దైవం వేరనే భ్రమలో చిక్కుకోవడం వలన దుఃఖంలో మునిగుంటాడని, ఆ భ్రమనుండి తొలగి తిరిగి దైవంతో తాదాత్మ్యం చెందటమే శాశ్వత దుఃఖ నివారణకు మార్గమని ఋషులు కనుగొన్నారు. తమనుతాము దేహబద్ధులమని, మిగిలినదంతా తమ నుండి భిన్నంగా వున్నదని భావిస్తున్న జీవులు తిరిగి భగవంతునితో ఐక్యమవడమే ముక్తి లేక దుఃఖరాహిత్యమని, సకల జీవుల లక్ష్యమదేనని అటువంటి స్థితి ననుభవించిన మహాత్ములూ చెపుతున్నారు. మానవులెలా నడుచుకుంటే అటువంటి స్థితిని పొందుతారో, వాటికి కొన్ని నియమాలు నిర్దేశించారు. దానినే ధర్మమని ఆధ్యాత్మ వేత్తలందరూ చెబుతున్నారు. ఆధ్యాత్మవేత్తలందరూ మనిషిలోగల తీరని అసంతృప్తిని, దుఃఖాన్ని విశ్లేషించి పై వాక్యాలనుటంకించటం గమనార్హం.

విశ్వమంతా నిండిన జడజీవ పదార్థాలలో ఒకే 'శక్తి' వ్యాపించివున్నదని ఆధునిక విజ్ఞాన శాస్త్రమంతా నిరూపిస్తున్నది. సర్వత్రా నిండిన ఆ చైతన్యమే భగవంతుడని, ఆ స్థితి శాశ్వతమని, జ్ఞానమని తిరుగులేని ఆనందమని, సచ్చిదానందమని ఆధ్యాత్మిక విద్య చెబుతున్నది, ఆచార్య శ్రీ భరద్వాజ వాణి ఘోషిస్తున్నది. అది వినవదేవిధంగా మన దైనందిన జీవితాలను సరిచేసుకుందాము, సరి అయిన పథంలో పయనిద్దాము.

(ఏప్రిల్ 12వ తేదీ ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

రచన : **శ్రీ వి.సి. వెంకటేశ్వర్లు**, పుత్తూరు






# 19వ అఖిలాంధ్ర శ్రీ సాయి మాస్టర్ భక్త సమ్మేళనం - సమీక్ష

సర్వగతమైన చైతన్యమే విశ్వగురుడైన శ్రీ శిరిడీ సాయి నిజతత్వం. ఆ విశ్వచైతన్యానుభూతిని 1963 సంవత్సరం ఫిబ్రవరి 9వ తేదీన శ్రీ శిరిడీ సాయి సమాధి మందిరములో, శ్రీ సాయిమూర్తి చెంత అనుభవించిన కారణజన్ములు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారు గారు, తాను పొందిన దివ్యానుభూతిని, సత్యానుభూతిని, విశ్వచైతన్యానుభూతిని అందరికీ అందజేయటమే తన జన్మ సార్ధకమని భావించి, శ్రీ శిరిడీ సాయి ధర్మతత్వ ప్రచార యజ్ఞంలో ఐ.ఏ.యస్ లాంటి పదవుల్ని సహితం వదిలివేసి, లోక కళ్యాణానికై బద్ధకంకణులయ్యారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. వారిని ఆశ్రయించిన వారు, దానికి ప్రతిగా మనము ఏమి చేస్తున్నాము? ఏమి చేయాలి? అని సమీక్షించుకోవటానికి 2018 ఫిబ్రవరి 7,8 మరియు 9 తేదీలలో, మాస్టారుగారిని అత్యంత సన్నిహితంగా సేవించుకున్న శ్రీ డి.జయచంద్రారెడ్డి, శ్రీమతి డి.జయమ్మల సారధ్యములో, శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము, భరద్వాజ ఓం నారాయణ ఆశ్రమ కమిటీ వారి సహకారముతో, నెల్లూరు జిల్లా గొలగమూడి గ్రామములో భగవాన్, అవధూత శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వామి వారి సన్నిధిలో 19వ అఖిలాంధ్ర సాయి మాస్టర్ భక్త సమ్మేళనము అత్యంత వైభవంగా జరిగింది.

మాస్టారుగారిని హృదయపూర్వకముగా సేవించుకున్న శ్రీమతి&శ్రీ జయమ్మ, జయచంద్రారెడ్డి గారల ఆత్మీయ పిలుపు మేరకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, వివిధ రాష్ట్రాల నుండి కూడ విశేష సంఖ్యలో ప్రతినిధులు సమ్మేళనానికి విచ్చేయటము జరిగింది.

ఫిబ్రవరి 7వ తేదీ ఉదయము నుండే దూర ప్రాంతాల నుండి విచ్చేసే వారికి, శ్రీ జయచంద్రారెడ్డి దంపతులు, చక్కటి వసతి ఏర్పాట్లు గావించారు.

ఫిబ్రవరి 7వ తేదీ సాయంత్రం, అందముగా ఆధునీకరణతో అలంకరించిన వాహనములో అవధూత శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ దత్తాత్రేయుడు, శ్రీ శిరిడీ సాయిబాబా, శ్రీ భరద్వాజ మాస్టారుగారల చిత్రపటాలను గొలగమూడి వీధులలో అత్యంత కోలాహలముగా ఊరేగించటము జరిగింది. అనంతరం చిత్ర పటాలను, సమ్మేళన వేదికపైన అమర్చటముతో నాటి కార్యక్రమము పూర్తి అయ్యింది.

ఫిబ్రవరి 8వ తేదీ ఉదయం 06.00 గంటలకు కార్యక్రమమునకు నాంది పలికి, ఉదయం 09.00 గంటలకు పూజ్యశ్రీ అవధూత మునిరామయ్య స్వామి (గట్టు స్వామి) వారు జ్యోతి ప్రజ్వలన చేయటముతో సమ్మేళన సభ ప్రారంభమయింది. ఉదయం 09.30 నుండి రాత్రి 08.30 వరకు మధ్యలో తేనీరు, భోజన, అల్పాహార, విరామము మినహాయించి, ప్రతి అర గంటకు ఒక వక్త చొప్పున వివిధ అంశాలపై తమ అనుభవాలను, అనుభూతిని తెలియజేశారు.

ఫిబ్రవరి 9వ తేదీ ఉదయం సామూహిక గురుపూజలు, అనంతరం 09.00 గంటలకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు శిరిడీలో విశ్వచైతన్యానుభూతి పొందిన రోజు, సమయాన్ని పురస్కరించుకొని, శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు, "విశ్వచైతన్యానుభవము" అనే అంశముపై ప్రవచించి, సామూహిక ధ్యానము నిర్వహించటముతో రెండవ రోజు కార్యక్రమాలు ప్రారంభమయ్యి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగినాయి.

శ్రీ షిరిడీ సాయి మందిరము, శ్రీ సాయి భరద్వాజ సత్సంగము (శ్యామలానగర్) వారు 20వ అఖిలాంధ్ర సాయి మాస్టర్ భక్త సమ్మేళనము, గుంటూరులో 2019 ఫిబ్రవరి 7,8,9 తేదీలలో నిర్వహించటానికి సమాయుక్తమవ్వగా, 21వ అఖిలాంధ్ర సాయి మాస్టర్ భక్త సమ్మేళనము, 2020 సంవత్సరము ఫిబ్రవరి 7,8,9 తేదీలలో బెంగుళూరులో నిర్వహించటానికి, శ్రీ సాయి భరద్వాజ సత్సంగ నిర్వాహకులు సమాయుక్తమయినారని, సమ్మేళన సభలో

తెలియజేయటము జరిగింది. సాయంకాలం 05.00 గంటలకు శ్రీ డి.జయచంద్రారెడ్డి, శ్రీమతి డి.జయమ్మల తమ అనుభూతి, అనుభవాలు పంచుకుంటూ వందన సమర్పణ చేయటముతో 19వ సమ్మేళనము సంపూర్ణమయింది.

## సమ్మేళన సంక్షిప్త విషయ విశేషాలు

1. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి గారి పూర్తి సహాయ సహకారములతో, సమ్మేళనమునకు విచ్చేసిన వారందరికీ 7వ తేదీ నుండే చక్కటి వసతి సౌకర్యములు ఏర్పాటు చేయటమైనది.

2. పూజ్య శ్రీ గట్టుస్వామి వారి చేతుల మీదుగా 8వ తేదీ సమ్మేళన ప్రత్యేక సంచిక "మాస్టారి సన్నిధిలో" ఆవిష్కరించారు. అనంతరం భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి తపోక్షేత్రము "కోటి తీర్ధ మహాత్యం" పుస్తకాన్ని శ్రీ స్వామి ఆవిష్కరించారు.

3. తమకు కేటాయించిన సమయంలో, ఇచ్చిన అంశముపై చాలా మంది వక్తలు చక్కటి ప్రవచనం చేశారు.

4. ఫిబ్రవరి 8, 9 తేదీలలో ప్రతినిధులకు అల్పాహార, భోజనాలు, ఏర్పాటు చేయుటములో సమ్మేళన నిర్వాహకులు కృతకృత్యులయినారు.

5. ఆయా సంఘాల ప్రతినిధులు వారి వారి ప్రచురణలు, కరపత్రాలు, చిత్రపటాలు, కార్యక్రమాల మధ్యలో ఎవరి ఇష్టానుసారం వారు పంపిణీ చేయటముతో, శ్రద్ధగా వింటున్న శ్రోతలు కొంత అసౌకర్యానికి గురైనారు.

6. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు ఉక్కునగరం వారు ఏర్పాటు చేసిన, శ్రీ దత్తావతార, అవధూతల, మహాత్ముల పాదుకల సహిత, వారి దివ్య వస్తు, వస్త్ర సముదాయమును భక్తులు విశేషముగా దర్శించుకున్నారు.

7. శ్రీ మంగ భరద్వాజ ట్రస్టు, ఒంగోలు వారు శ్రీ మాస్టారుగారి రచనలు 35% (శాతం) తక్కువ ధరకు విక్రయించటముతో, విశేష స్పందన కనిపించింది.

8. కొందరు వక్తలు, ఇచ్చిన అంశాలు వదిలి గత మూడు సంవత్సరాలుగా వారు పొందిన అనుభూతి, అనుభవాలే తెలియజేస్తున్నారని కొందరు ప్రతినిధులు మా విలేకరితో అనటం జరిగింది.

9. సామాన్య సత్సంగ నిర్వాహకులు సహితం మారుమూల ప్రాంతాలలో కూడ సమ్మేళనము నిర్వహించుకునేలా ఒక కేంద్ర కమిటీ ఏర్పాటు చేసి, కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చేబడితే బాగుంటుందని కొందరు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.

10. సమయపాలన మాత్రమే కాకుండా ఆయా అంశాలపై అవగాహన కలిగిన వారు సమన్వయకర్తగా వ్యవహరించి ఉంటే కార్యక్రమము రక్తి కట్టి ఉండేదని, తద్వారా వక్తలు ఆయా అంశాలను స్పృశించకపోయినా లోటు కనిపించేది కాదని, సుదూర ప్రాంతల నుంచి వచ్చిన కొందరు అనటం జరిగింది.

11. కార్యక్రమ నిర్వాహకులు తమ సమ్మేళన ప్రథమ కరపత్రములో **"తనను కాకుండా సద్గురువునే గమ్యం చేస్తున్న శ్రీ మాస్టారుగారిని కృతజ్ఞతగా స్మరించుకునేందుకు, ఆయన సూచించిన సద్గురు మార్గాన్ని అవగాహన చేసుకునేందుకు,** తాము పొందిన అనుభూతిని, అనుభవాలను అందరితో పంచుకునేందుకు వేదికయే ఈ సాయి మాస్టర్ భక్త సమ్మేళనము" అన్న రీతిలో, మొదట అంశానికి ప్రాధాన్యతనిచ్చి ఉంటే మరింతగా మాస్టారు చూపిన సాయి మార్గం పటిష్టం చేసుకునే అవకాశం విస్తృతమయ్యేదని, కార్యక్రమానికి కొన్ని సంవత్సరాలుగా హాజరవుతున్న కొందరు యువకులు తమ అభిప్రాయము తెలియజేశారు.

12. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిని తమ హృదయపీఠములో నిలుపుకొని, వారి ద్వారా పొందిన ప్రేమ, ఆప్యాయతలను, అవధూత శ్రీ వెంకయ్యస్వామి దివ్య సన్నిధిలో అందరికీ పంచుతూ, మాస్టారుగారితో అత్యంత సన్నిహితం కలవారిని అందరినీ ఒక్కచోట చేర్చి, మమతల మాస్టారి అనురాగాన్ని అందరితో పంచుకునే విధముగా సమ్మేళనము నిర్వహించటములో శ్రీ డి.జయచంద్రారెడ్డి, శ్రీమతి డి.జయమ్మ దంపతుల కృషి అత్యంత ప్రశంసనీయము. వారి సహచర బృందము సహకారముతో 19వ అఖిలాంధ్ర సాయి మాస్టర్ భక్త సమ్మేళనము, మాస్టారుగారు దర్శించిన మహాత్ముల సన్నిధిలో గొలగమూడిలో వైభవముగా ముగిసింది.

20వ అఖిలాంధ్ర శ్రీ సాయి మాస్టర్ భక్త సమ్మేళనము 2019వ సంవత్సరము ఫిబ్రవరి 7,8,9 తేదీలలో గుంటూరులోను

21వ అఖిలాంధ్ర శ్రీ సాయి మాస్టర్ భక్త సమ్మేళనము 2020వ సంవత్సరము ఫిబ్రవరి 7,8,9 తేదీలలో కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరులో నిర్వహించటానికి, ఆయా ప్రాంతాలలోని శ్రీసాయిమాస్టర్ భక్త బృందం వారు సమాయుక్తమయినారు.

సమీక్ష : **"జ్యోతిర్మయి",** విశాఖపట్నం

# శిరిడీని చూపిన బాబా

మా వారు శ్రీ భాస్కరమూర్తిగారు అమలాపురంలోని ఒక పెట్రోలు బంకులో గుమస్తాగా పనిచేస్తుండగా 6-6-1956 తేదీన ఉదయం 11 గంటల ప్రాంతములో పొడుగ్గా కాషాయము ధరించిన ఒక సాధువు, అద్దాల గది బయట కనిపించారు. అకస్మాత్తుగా ఎదురుగా వచ్చిన ఆయన ఎవరు అని మా వారు ఆలోచించే లోపల, ఆయన గబా గబా వెళ్ళిపోతుంటే మావారు గది బయటకు వెళ్ళి, ఆయన ఎదుట నిలిచి, ఎవరు మీరు అని అడిగేరట, నేనెవరయితే నీకెందుకు నన్ను చూసి భయపడ్డావుగా, అయినా పరవాలేదు ఇది నీకు ఇచ్చి వెళదామని వచ్చాను అని చేతిలో చుట్టచుట్టి ఉన్న ఒక కాగితం మావారికి ఇచ్చి, ఈయనను పూజించు అంతా మంచే జరుగుతుందని చెప్పి వెళ్ళిపోయారు. అది చూస్తే బండమీద కూర్చోని ఉన్న ఒక సాధువు ఫోటో. ఆ ముస్లిం సాధువు ఎవరా అని విచారిస్తుండగా, మావారి మేనమామ ఆ ఫోటో చూసి, ఆయన శిరిడీ సాయిబాబా అని, ఆయనను పూజించండి, బాబానే స్వయంగా మీకు ఫోటో ఇచ్చినట్లుంది అంటూ, ఒక పూజా పుస్తకం కూడ మాకు ఇచ్చారు. అప్పటినుంచి మా ఇంట్లోను, అత్త గారింట్లోనూ బాబాను పూజించటం ప్రారంభించేము, ప్రక్కన ఉన్న ఫోటో అదే.



బాబాను పూజించటం ప్రారంభించిన తరువాత మాకు ఇద్దరు మగ పిల్లలు జన్మించారు. మా పెద్ద అబ్బాయి పేరు సాయిబాబా. మా పిల్లలకు పుట్టు వెంట్రుకలు తీయించే ముందు బాబా దర్శనం చేయించాలని మా కోరిక. అక్కడ భాష మాకు తెలియదు, మీకు కూడ తెలుగు తప్ప ఏమీ రాదు, ఇబ్బంది పడతారు అని మా మామగారు, చుట్టాలు వెళ్ళవద్దు అన్నారు. మాకు తోడుగా, మా వారి అక్క, బావగారు, మేనత్త వస్తాము అన్నారు. మాకు ఇద్దరు చిన్నపిల్లలు కదా, అందరమూ ఉంటే ఫరవాలేదు అన్నారు. మా చిన్నబాబుకు 7వ నెల, పెద్దబాబుకు 3వ ఏడు. ఒక పత్రికలో శిరిడీ ఎలా వెళ్ళాలి? ఏమి చూడాలి? అక్కడ జరిగే హరతులు గురించి వ్రాసి, బాబా ఫోటోతో సహా ఉంది. ఆ పేపరు తీసుకొని శిరిడీ బయలుదేరేము.

జూలై 1964లో మన్మాడులో దిగాము. శిరిడీ బస్సు ఎక్కాము. శిరిడీ చిన్న ఊరు కదా ఎక్కడ ఉండాలి, చిన్నపిల్లలు, భాష సమస్య అని భయం భయంగా శిరిడీలో దిగి నుంచున్నాము. గబా గబా ఒక పెద్దతను మా దగ్గరకు వచ్చి, బాబాను చూడటానికి వచ్చారా! అన్నీ నేను చూపెడతాను, రండి అన్నాడు. అతను మన పక్క రైతులాగ ఉన్నాడు, మోకాలు దగ్గరకి పంచ, లూజుగా ఉన్న పొట్టి చేతులు చొక్కా, భుజం మీద చిన్న తువ్వాలు, నెరిసిన జుట్టు, తెలుగులో మాట్లాడేసరికి, మా ఆనందం ఏమి చెప్పగలను, ఇన్నాళ్ళు పడ్డ భయం పోయింది. దోవలో మేకలు, గొఱ్ఱెలు, పశువులు, అక్కడక్కడా కట్టేసి ఉన్నాయి. చిన్న దోవ వాటి మధ్య నుంచి తీసుకువెళుతూ, ఇదే బాబా మందిరం, మీరు తెమిలాక తీసుకువెళతాను అన్నారు.

ఒక పెద్ద రేకుల షెడ్డు, వరుసగా గదులు, ముందు అరుగు ఉంది. ఒక గదిలో మీరు ఉండవచ్చు, కాలకృత్యాలకి తుప్పలచాటుకు వెళ్ళవచ్చు, భయంలేదు అని చెప్పి వెళ్ళేడు. మేము సామాను సర్దుకునే లోపల, రెండు పెద్ద బకెట్లు నిండా నీళ్ళు తెచ్చి, ఆ ప్రక్కకి వెళ్ళి పోసుకోండి, ఇక్కడ నీళ్ళు ఎద్దడి, సర్దుకోండి అన్నాడు.

స్నానపానాలు కావించి అతని వెంట మందిరానికి వెళ్ళేము. విశాలమైన హాలు, మధ్యలో శ్రీ సాయినాధుని విగ్రహం, కరుణ నిండిన చూపుతో ఉంది, ప్రతి ఒక్కరికి బాబా వారివైపు చూస్తున్న భావన కలిగింది. శ్రీ సాయినాధుడిని చూడగానే సంతోషం, ఆనందం కలిసి ఏడుపు వచ్చేసింది. ఎన్నాళ్ళనుంచో ఈయనను చూడాలని తపన పడుతున్న మాకు ఆ భావన నేను మాటలతో వర్ణించలేను. బాబా పాదాలు పట్టుకుని సంతోషంతో ఏడ్చేసాము. చాలా రోజులకి కలిసిన బంధువులాగ మైమరిచిపోయాము. కాసేపటిలో మధ్యాహ్న హారతి ఉంది. ఈలోగా భోజనాలు కోసం వెళదాము, ఉంటాయో లేదో అని ఆడవాళ్ళని అక్కడే కూర్చోమని, మహాద్వారానికి ఎదురుగా ఉన్న ద్వారంగుండా మా వాళ్ళని తీసుకెళ్ళాడు. అక్కడ ఒకే ఒక అయ్యరు హోటలు ఉంది. ముందుగా చెప్తేనే భోజనం తయారు చేస్తాము, ఇప్పుడు ఏర్పాటు చేయలేము, రాత్రికి ఏర్పాటు చేస్తాము, హారతి అయ్యాక వస్తే, ఏమైనా మిగిలితే ఇస్తాము అన్నాడట. మధ్యాహ్న హారతి పూర్తి అయిన తరువాత అయ్యరుగారి దగ్గర మిగిలిన కొంచెము అన్నం పదార్థములు తెచ్చి మాకుఇచ్చిన తాత మరల 4 గంటలకి వస్తాను అని వెళ్ళిపోయారు.

సాయంత్రము మారుతి మందిరం, ద్వారకామాయి, చావడి, గురుస్థానం, ఖండోబా గుడి చూసాక కొంచెము ముందుకు తీసుకెళ్ళేడు. దోవలోనే చిన్న పంట కాలువ ఉంది, దీనిలో రేపు

స్నానాలు చెయ్యవచ్చు తీసుకెళతాను అన్నాడు. సాయంత్రము హారతి అయ్యాక భోజనాలు చేసి గదికి వెళ్ళండి, 10 గంటల హారతికి రండి, రేపు చావడి ఉత్సవము కూడ చూడవచ్చు, గురువారం కదా! నేను తెల్లవారగట్ల వస్తాను అన్నాడు.

మర్నాడు అతనితో కాలువ దగ్గరకు వెళ్ళి ముందు మగవాళ్ళు, తరువాత మేము కాలవలో తనివితీరా స్నానాలు చేసి వచ్చాము. కాకడ హారతి చూసి, సమాధి మందిరములో కూర్చొని, పూజ, బాబాని చేతులతో తడుముతూ అభిషేకం చేసుకున్నాము. స్వయంగా బాబాని ముట్టుకుని అభిషేకం చేయటముతో చాలా ఆనందం కలిగింది. ఈ ఆనందం మళ్ళీ 1976లో శిరిడీ వెళ్ళినప్పుడు కూడ కలిగింది. అప్పటికి ఊరు మారినా, స్వయంగా పూజ, అభిషేకం చేయటము మాత్రం ఉంది. మధ్యాహ్న హారతి, సాయంత్రం చావడి ఉత్సవము చూశాము.

మర్నాడు ఉదయం హారతి, పూజ, అభిషేకాలు అయ్యాక, రెండు గుఱ్ఱపు బళ్ళు కట్టించి అతనే మాట్లాడి సాకోరి పంపించాడు. తిరిగి శిరిడీ వచ్చి మధ్యాహ్న హారతి అయ్యాక, రెండు గంటలకి మన్మాడు బస్సు ఎక్కించాడు.

ఈ మూడు రోజులు మాతోనే ఉన్నాడు. అతని పేరు కూడా అడగాలని మాకు తోచలేదు. తాత అనటం తప్ప. బస్సు దగ్గరకి వచ్చాక, తాత ఎన్ని డబ్బులు ఇవ్వాలి అని మా వారు అడిగేరు. రెండు అణాలు ఇయ్యి అన్నాడు. ఏమిటి ఇంత తక్కువ డబ్బులు అడిగాడు తాత అనుకొని మావారు తోచిన డబ్బులు ఇచ్చారు.

తిరుగు ప్రయాణములో తిరుపతిలో మా బాబులుకి పుట్టు వెంట్రుకలు తీయించి, అన్నీ చూసుకొని వచ్చాము. ఇంటికి వచ్చాక, మాకు తెలుగు అతను ఒకరు కలిసి ఏమీ ఇబ్బంది లేకుండా శిరిడీలో అన్నీ దగ్గర ఉండి చూసుకున్నాడు అని ఆనందంగా అందరికీ చెప్పాము. తరువాత కొన్నాళ్ళకి బాబా పుస్తకాలు దొరికి చదివాక మాకు తెలిసింది, ఆ సాయినాధుడే తాత రూపంలో మమ్మల్ని చూసుకున్నారు అని. రెండు అణాలు (రెండు) అంటే నమ్మకము, ఓర్పు అనే దక్షిణ బాబా మా దగ్గర అడిగి తీసుకున్నారని తెలిసింది.

మాకు మొదటిగా వచ్చిన బాబా ఫోటో ఈనాటికి మా పూజలో ఉంది. అప్పుడు మాకు ఒకరు ఇచ్చిన పూజా పుస్తకంలో ఈ క్రింది స్తోత్రాన్ని ఈనాటికీ ప్రతిరోజు చదువుకుంటాము.

ఓం నమో భగవతే శ్రీ సాయినాధాయ–నిత్య సత్య స్వరూపాయ–సద్ధర్మ సంరక్షణాయ–దారిద్రయ దుఃఖ హరాయ–భవభంజనాయ–శాంత స్వాతాది గమ్యాయ–సాధు సమ్మత హితాయ–సద్భక్త సంరక్షకాయ–సర్వాంతర్యామినే–చతుర్దశ భువనాధి పతయే–సర్వదేవ శరణ్యాయ–నాదబిందు కళారూపాయ–శ్రీ శిరిడీశ్వరాయ–నమస్తే–నమస్తే–నమో నమః

రచన : **శ్రీమతి మంత్రిప్రగడ లలితా కుమారి,** అమలాపురం

## అత్యాధునిక బాబా దర్శన సముదాయము - శిరిడీ

"మహారాష్ట్ర ప్రభుత్వ అనుమతితో శ్రీ శిరిడీసాయి సంస్థాన్ ట్రస్టు, శిరిడీలోని పాత ప్రసాదాలయము ప్రాంగణములో దాదాపు 112 కోట్ల 67 లక్షల వ్యయముతో 18,848 చదరపు మీటర్ల ప్రదేశములో ఒకేసారి సుమారు 15,000 మంది భకులకు సమస్త సదుపాయములు కలిగించే విధముగా అత్యాధునిక క్యూ భవన సముదాయమును అతి త్వరలో నిర్మించ తలపెట్టింది" అని సంస్థాన్ అధ్యక్షులు డాక్టర్ సురేష్ హవారేగారు ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. అత్యాధునికమైన ఆ క్యూ కాంప్లెక్స్‌లో, సెల్‌ఫోన్స్, చెప్పులు భద్రపరచుకొనే ప్రదేశాలు, లాకర్లు, బయోమెట్రిక్ దర్శన పాస్‌ల కౌంటర్లు, బుక్‌స్టాలు, లడ్డు, టీ, కాఫీ విక్రయశాలలు, ఊదీ అందించే సదుపాయముతో పాటు, సురక్షిత మంచి నీరు, స్త్రీలకు, పురుషులకు విడివిడిగా అత్యాధునిక స్నానపు గదులు, సెక్యూరిటీ మొదలైన అనేక సదుపాయములతో బాబా దర్శనార్ధము వచ్చే భక్తుల నిమిత్తం ఈ ''క్యూ ప్రాజెక్టు''ను త్వరలో సంస్థాన్ ట్రస్టు నిర్మించబోతున్నదని శ్రీ హవారేగారు తెలిపేరు.


ఆ కార్యక్రమములో సంస్థాన్ వైస్ ఛైర్మన్ శ్రీ చంద్రశేఖర్ ఖదమ్, ముఖ్య కార్య నిర్వహణాధికారిణి శ్రీమతి రూబల్ అగర్వాల్, సంస్థాన్ ట్రస్టు సభ్యులు శ్రీ ప్రతాప్ భోసల్, డిప్యూటీ కలెక్టర్ శ్రీ ధనుంజయ్ నిఖమ్, శ్రీ మనోజ్ గోజ్ పాటిల్, ముఖ్య ఎకౌంటు ఆఫీసర్ శ్రీ బాబా సాహెబ్ కపర్దే, డి.యస్.పి శ్రీ ఆనంద్ భోయిటా మొదలైనవారు పాల్గొన్నారు.

ఆ సందర్భముగా సంస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీవారు యాండ్రాయిడ్, ఆపిల్ మొబైల్ ఫోను వినియోగదారుల కొరకు ఒక యాప్‌ను ఆవిష్కరించటము జరిగింది. దాని ద్వారా దర్శన పాస్‌లు, రూమ్స్ బుకింగ్, బాబా సమాధిమందిర ప్రత్యక్ష దర్శనం, శిరిడీలోని వివిధ ప్రదేశాల వివరాలు మొదలైనవి వీక్షించవచ్చు. అంతే కాక సంస్థాన్ అధికారిక వెబ్‌సైట్ www.sai.org.in లో అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానాలతో మార్పులు కూడ చేయనున్నారు.

డాక్టర్ సురేష్ హవారేగారు మాట్లాడుతూ "ప్రతిరోజు బాబా దర్శనార్ధము విచ్చేసే భక్తులు తెచ్చే దాదాపు 2 టన్నుల పూలు, పూలమాలలను, బాబాకు సమర్పించిన తరువాత, వాటిని ఆధునిక ప్రక్రియల ద్వారా సుగంధ పౌడరుగాను, అగరబత్తీలుగాను తయారు చేసి భక్తులకు అందించటానికి ''నిర్ మితి సంస్థాన్'' సమాయుక్తమయింది అని తెలియజేశారు. అది ఉగాది పర్వదినము నుండి కార్యరూపం దాల్చి భక్తులకు అందుబాటులోకి తీసుకురావటం జరుగుతుంది. తద్వారా దేశమంతా సాయి అనుగ్రహ సుగంధ భరిత పవనాలు వీచనున్నాయి" అని సంస్థాన్ ట్రస్టు ఛైర్మన్ తెలియజేశారు.

## బంగారు పంచ హారతి - వితరణ

శ్రీరామనవమి పర్వదినము సందర్భముగా ముంబైకి చెందిన శ్రీ జయంత్ బాయి, 39,09,688/– రూపాయల విలువ చేసే 1351 గ్రాముల బంగారు పంచ హారతి పళ్ళెన్ని, బాబాకు హారతి నిమిత్తము, శ్రీ శిరిడీ సాయి సంస్థాన్ ట్రస్టు ప్రత్యేక కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి రూబల్ అగర్వాల్‌కు మార్చి 24వ తేదీన అందచేయటము జరిగింది. **– ప్రతినిధి, శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**




## (కుంకమ) బొట్టు ఎందుకు ధరించాలి?

మన శరీరంలో ప్రతి అవయవానికి ఒక్కో అధిదేవత ఉన్నాడు, లలాటం బ్రహ్మ స్థానం. బ్రహ్మ దేవుడి రంగు ఎరుపు, కావున బ్రహ్మ స్థానమైన లలాటాన ఎరుపు రంగు బొట్టు ధరించాలి, అనగా కుంకమ. లలాటాన సూర్యకిరణాలు తాకరాదు. మనలోని జీవి, జ్యోతి స్వరూపుడుగా, భ్రూమధ్యంలోని ఆజ్ఞాన చక్రంలో, సుషుప్త దశలో హృదయ స్థానంలో అనగా అనాహత చక్రంలో ఉంటాడు.

కుంకమను ఉంగరపు వ్రేలితో పెట్టుకుంటే
– శాంతి, ప్రశాంతి చేకూరుతుంది.

నడివ్రేలుతో ధరిస్తే – ఆయువు సమృద్ధి చెందుతుంది.

బొటనవ్రేలితో ధరిస్తే – శక్తి వస్తుంది.

చూపుడు వ్రేలితో ధరిస్తే – భక్తీ, ముక్తీ కలుగుతాయి.

ఎప్పుడైతే నుదుట కుంకమ అద్దుతారో, అప్పుడు జ్ఞాన చక్రాన్ని పూజించనట్లు అవుతుంది. కుంకమ బొట్టును ధరించటం వలన పవిత్ర భావనలు కలుగుతాయి.

## ఏడడుగుల బంధం

ఒకరికి ఒకరై, తోడూనీడై, సుఖసంతోషాల ముఖద్వారంలో వేసే మురిపాల ముద్దుముచ్చట్ల **మొదటి అడుగు**

హృదయాంతరంగాలలో ప్రేమభావ తరంగాలతో నింగికెగిసే రంగవల్లికల **రెండవ అడుగు**

పెద్దలపట్ల వినయ విధేయతల్ని చూపిస్తూ, సత్సాంప్రదాయాల సంరక్షణ కోసం వేసే ముచ్చటైన **మూడవ అడుగు**

వేదధర్మానికి వన్నెలు దిద్దుతూ, భారతీయ సంస్కృతికి నిలువెత్తు సాక్ష్యంగా వేసే నాణ్యమైన **నాల్గవ అడుగు**

ఉభయ కుటుంబాల ఔన్నత్యాన్ని దశదిశలా వ్యాపింపచేస్తూ వేసే అభిజాత్యానికి ఆలవాలమైన **ఐదవ అడుగు**

గృహస్థాశ్రమ స్వీకారానికి శ్రీకారం చుడుతూ వేసే ఆనందదాయకమైన **ఆరవ అడుగు**

అనంత ప్రేమవాహినిలో విహరిస్తూ, జీవన వసంతాన్ని స్వాగతిస్తూ వేసే సత్యశివ సుందరమైన **సప్తపది**

## నిత్య సత్యాలు

వందకోట్లకు అధిపతివైనా – ఒక్క నిమిషం ఆయుష్షు కొనలేవని తెలుసుకో

కోటికోట్లకు వారసునివైనా – ఊపిరి పోగానే ఊరి బయట పడేస్తారని తెలుసుకో

లక్షాధికారివైనా, భిక్షాధికారివైనా – స్మశానంలో ఇద్దరూ సమానమేనని తెలుసుకో

వందమంది డాక్టర్లు నీ వెంటవున్నా–నీ పరలోక ప్రయాణం ఆపలేరని తెలుసుకో

ప్రపంచం అంతటికీ అధిపతివైననూ
– నీ ఆయుష్షుకు అధిపతివి కాలేవని తెలుసుకో

యావత్ ప్రపంచాన్ని జయించగలిగిననూ
– మృత్యువును జయించలేవని తెలుసుకో

నీవు తిన్నది మట్టిపాలు – ఇతరులకిచ్చినది నీ పాలని తెలుసుకో

కాలం విలువైంది, రేపు అను దానికి రూపులేదు
– మంచి పనులు వాయిదా వేయరాదని తెలుసుకో

లక్షలు, కోట్లు ఉన్నాయని మురిసిపోవద్దు
– ఆ లక్షలు నీ వెంటరావని మృత్యువునుండి తప్పించలేవని తెలుసుకో

నీవు దాచుకున్నది జారిపోతుంది
– ఇతరులకు సహకరించినది నీ ఖాతాలో జమ అవుతుందని తెలుసుకో

భోగాలకు ఖర్చుచేసి రోగాలను తెచ్చుకోకు – మంచి పనులకు ఖర్చుచేసి పుణ్యాన్ని పెంచుకో, ఆ పుణ్యమే నీ రాతను నిర్ణయించునని తెలుసుకో

## 108 సంఖ్యకు ఎందుకంత ప్రాధాన్యం?

హైందవ సంప్రదాయాలలో 108 సంఖ్యకు ప్రత్యేక స్థానం ఉంది. ఆధ్యాత్మిక కార్యకలాపాలలో ఉపయోగించే పవిత్ర మాలలో 108 పూసలు ఉంటాయి. ఒక్క హిందూ సంప్రదాయల్లోనే కాకుండా బౌద్ధం, సిక్కు, జైన మతాచారాల్లో సైతం ఈ సంఖ్యకు ప్రాధాన్యం ఉంది. మంత్రోచ్చారణకు 108 సార్లు చేయడం ఆచారం. జపాన్‌లోని జైన దేవాలయాల్లో కొత్త సంవత్సరము ఆరంభం నాడు 108 సార్లు గంటలు కొడతారు.

ఎందుకీ సంఖ్యకు ఇంతటి ప్రాధాన్యం? అని చూస్తే...మన ప్రాచీన ఋషులు గొప్ప గణాంకవేత్తలు, నిజానికి మన సంఖ్యా వ్యవస్థను గుర్తించినది వారే. ఈ సంఖ్యకు ప్రాధాన్యాన్ని వారే సంతరించి పెట్టారు. పూర్తిస్థాయి మనుగడకు 108 సంఖ్య ప్రాధాన్యతను వహిస్తుంది.

తొమ్మిది సంఖ్యకు పరిపూర్ణత్వాన్ని ప్రతిబింబిస్తుంది. 108ని కూడితే వచ్చేది తొమ్మిది. అంతేకాదు ఏ సంఖ్యను 9 సార్లు హెచ్చించి కూడినా వచ్చే సంఖ్య తొమ్మిదే.

తొమ్మిది గ్రహాలు 12 రాశులు ద్వారా ప్రయాణిస్తాయి. వాటిని గుణించగా అంటే 9X12=108 వస్తుంది.

27 నక్షత్రాలలో ఒక్కోదానికి నాలుగు పాదాలు ఉంటాయి. 27 నక్షత్రాలు అగ్ని, భూమి, గాలి, నీరు అన్న నాలుగు అంశాలపై విస్తరించి ఉంటాయి. అంటే 27X4= 108.

ప్రాచీన కాలం నాటి తాళపత్ర గ్రంథాల్ని అనుసరించి విశ్వం 108 అంశాల కలయికతో ఏర్పడింది. ఇలా ఇంకా ఎన్నో ఎన్నెన్నో...

సేకరణ : **"సత్యేంద్ర"**

# అమృతమూర్తి - శ్రీ బాబుగారు

సామాన్యునికి కావలసినవి కేవలము ఉపదేశాలు, అద్భుతాలు కానే కావు, వారికి కావలసింది వారి కష్టాలను సానుభూతితో అర్ధం చేసుకొని, సహానుభూతితో పంచుకొని సేదదీర్చటమే! ఆకలితో అలమటించేవానికి, రోగముతో కృంగిపోతున్న వానికి అక్కరకు వచ్చేవి ఉపదేశాలు కావు, ఉపచారములు. యోగము ఎంత విలువవైనదో క్షేమము కూడా అంత ఆవశ్యకమైనదే! త్రికరణ శుద్ధిగా తన్నాశ్రయించిన వారి యోగ క్షేమములకు బాధ్యత వహించటము మహాత్ముల దినచర్యలలో ఒక భాగము. జాలి జనుల లక్షణం; కాని దయ దైవ లక్షణం; జాలిగలవాడు కన్నీరు తుడుస్తాడు; కాని దయగలవాడు కన్నీటికి కారణం తెలుసుకొని పరిష్కరింప ప్రయత్నిస్తాడు. తపస్సంపన్నులైన మహాత్ములు తమ శక్తి యుక్తులన్నింటినీ, శోకము నుండి లోకమును ఉద్ధరించటానికే వినియోగిస్తారు. గౌతమ బుద్ధుడు, జీసస్ క్రైస్తు, మాస్టర్ సి.వి.వి, శ్రీ శిరిడీ సాయినాధుడు వంటి మహాత్ములందరూ మొదట ఆర్తిని దీర్చి, శక్తిని కూర్చి, భక్తులను రక్షించినవారే. రక్షణ పొందినవారిలో పాదుకొల్పబడిన ఉపదేశము మొలకెత్తి, చిగురించి, పుష్పించి ఫలించగలదు. శ్రీ పాకలపాటి గురువుగారు ఆపన్న ప్రసన్నులైన దైవస్వరూపులు. వారి ఆర్తత్రాణ పరాయణత్వమునకు నిదర్శనములు కోకొల్లలు. పూర్ణ పురుషులకుండే జ్ఞానము, ప్రేమ, శక్తి వారిలో పుష్కలముగా వ్యక్తమయ్యేవి. వారికి అసాధ్యమంటూ లేదు.



శ్రీ ఆంధ్ర విశ్వనాథంగారు (నర్సీపట్నం) చెప్పిన బాబుగారి విశేషములు. శ్రీ పాకలపాటి గురువుగారు భాగవత సప్తాహం చేసిన సమయంలో, విశ్వనాథంగారికి 12-14 సంవత్సరముల వయస్సుంటుంది. కుటుంబ సభ్యులతో కలిసి సప్తాహమునకు వెళ్ళిరి. ఒకరోజు వంటవాళ్ళు ఉదయం కాఫీల టైము అయిపోయినప్పటికి పాలు రాకపోవుటచే, శ్రీ బాబుగారికి ఈ విషయము తెలపగా, బాబుగారు, "అమ్మా! శాంభవీ! ఏమిటి పరీక్ష?" అనగా, నలుగురు మనుష్యులు కావిళ్ళు బిందెలతో పాలు పట్టుకొని వచ్చారట. అది చూచి వారి కుటుంబ సభ్యులందరూ ఆశ్చర్యపోయిరి.

దాలంపేట గ్రామస్తుడు విత్తనాల పెదబ్బాయి (పోతురాజు) ఇలా చెప్పారు. బాబుగారి శక్తికి, తేజస్సుకు ఆకర్షితుడై అప్పుడప్పుడు భీమసింగి, కిటిమల వెళ్ళేవాడు. ఆశ్రమమునకు కావలసిన త్రాళ్ళు తయారు చేయుచు, ఒకచోట కూర్చొనేవాడు. ఒకరోజు బాబుగారు తన చుట్టూ ఉన్నవాళ్ళతో, "వీడు కొద్ది రోజులలో వంద బస్తాలు పండే పొలం కొంటాడు, తన గ్రామంలో రామాలయంలో హరిదాసులచే కథలు చెప్పిస్తాడు" అన్నారు. అతడు ఆశ్చర్యంతో తనలో నవ్వుకున్నాడు. కాని అది నిజమయినది. తను ఏ పని చేసినను బాబుగారి ఫోటోతో చెప్పుకొని చెయ్యడమే గాని, ముహూర్తము చూడడట. తన పొలమునకు నేటికీ కూడా తెగుళ్ళకు పురుగుల మందులు కొట్టడం లాంటివి చేయడు. పొలం నలువైపులా కొబ్బరికాయలు కొట్టి, కర్పూరం వెలిగిస్తాడట. తన పంటలు చక్కగా ఉంటాయని చెప్పాడు. (తేదీ.26-5-2002న తన కూతురిని, అల్లుడిని వెంటబెట్టుకొని ఆశ్రమానికి వచ్చినప్పుడు, ఈ విషయాలను చెప్పాడు) భక్తి విశ్వాసాలంటే ఇలా ఉండాలి మరి.

శ్రీ బాబుగారు ప్రతి సంవత్సరము అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గం తాలుకా వడ్డిపాలెం గ్రామంలోని శ్రీ ప్రత్యక్ష ఆంజనేయస్వామి వారికి విధిగా రూ.5/-లు పంపేవారు. శ్రీ బాబుగారు ఒకసారి అక్కడి శ్రీ ప్రత్యక్ష ఆంజనేయస్వామి వారిని దర్శించటానికి వెళ్ళారు. స్వామి వారొక గుట్టపై వెలసి ఉన్నారు. (గుడి లేదు). శ్రీ వడ్డి హనుమంతప్పగారనే వారు అర్చకులు. శ్రీ ఆంజనేయస్వామి వారి ఉపాసకులు. నాడు అనేక మంది భక్తులు స్వామి దర్శనానికై క్యూలో నిల్చున్నారు. శ్రీ గురువుగారు కూడా వారితోపాటే దర్శనార్థమై నిలుచున్నారు. వారెవరో ఎవరికి తెలియదు. ఆ అర్చకుడు ఆంజనేయస్వామికి హారతిస్తూ, మధ్యలో శ్రీ బాబుగారిని చూసి, హఠాత్తుగా పరుగున వచ్చి బాబుగారి పాదములకు నమస్కరించి, ''స్వామీ! అక్కడుండవలసిన వాడవు, ఇక్కడ కొచ్చి నిల్చున్నావా?" అంటూ ఆంజనేయస్వామి ప్రక్కనే ఉచితాసనమున కూర్చుండపెట్టి, పూజ సల్పినాడు. బాబుగారు సాక్షాత్తు దైవస్వరూపులని అచ్చటి వారంతా నమస్కరించి, ధన్యులయ్యారు. ఇంతకూ శ్రీ బాబుగారు, శ్రీ ఆంజనేయస్వామిని దర్శించటానికి వచ్చారా? లేక అక్కడి భక్తులకు దర్శనమివ్వటానికి వచ్చారా? దేనికదే సత్యం! శ్రీ వారు శ్రీరామనవమి, దసరా, గణపతి నవరాత్రులు, కృష్ణ జయంతి, శివరాత్రి మొదలగు పండుగలలో భజనలు, పూజలు చేయించి విరివిగా అన్నదానం చేయించేవారు. వారెక్కడుంటే అక్కడ కార్తీక సోమవారాలు, భక్తులచేత ఉపవాసాలు చేయించేవారు. అయితే వారు చేయించే ఉపవాసాలు, శ్రీ శిరిడీ సాయిబాబా చేయించిన వాటివలెనే ఉండేవి. భక్తులను సుష్టుగా ఉప్మా తినిపించి, కాఫీ త్రాగించేవారు. సాయంత్రము నక్షత్ర దర్శనమయ్యేలోగా పంచభక్ష్య పరమాన్నాలతో మహాసమారాధన చేసేవారు. (ఉపవాసమంటే సద్గురు చెంతగాని, సద్విషయము నందు గాని జీవించుట అని అర్ధం). అడవి గ్రామాలలో సహితం రామకొవెల స్థాపించినపుడు, మహాశివరాత్రి నాడు ఏకాహ భజనలు చేయించేవారు. ఆత్మ నిగ్రహము, అతీంద్రియ జ్ఞానము గల మహాత్ములు ఎచ్చటెచ్చట సంచరిస్తుంటారో, ఆ చోటల్లా నైమిషము, కురుక్షేత్రము, పుష్కరము వంటి పుణ్య క్షేత్రములతో సమానమని "నారదగీత" తెల్పుచున్నది. శ్రీ బాబుగారి సన్నిధే నిజమైన పెన్నిధి.

(జూన్ 28వ తేది గురువారము శ్రీ పాకలపాటి గురువు గారి జయంతి సందర్భముగా సమర్పణ)

రచన : **శ్రీ యు.వి.ఏ.యన్.రాజు**, పార్వతీపురం

# నీవు నిశ్చలంగా కూర్చో...

ఒక సాధువు లోకసంచారం చేస్తూ ఒక పట్టణం దగ్గరకు వచ్చాడు. అప్పటికి బాగారాత్రి అయ్యింది. పట్టణద్వారాలు మూసివేయబడ్డాయి. రాత్రి అవటం చేత బాగా చల్లగాలి వీస్తోంది. సన్యాసి వద్ద ఉన్నిదుస్తులు లేవు. అతడు చలికి వణికిపోతున్నాడు. అతడు నిద్రపోవటానికి స్థలం వెతుక్కుంటున్నాడు. అతనికి ఒక ఇటుకల బట్టీ కనిపించింది. దానిలోపల యింకా కొంచెం వేడిగానే ఉంది. సన్యాసి – "ఆహా! ఈరాత్రి నిద్రపోవడానికి నాకు మంచిచోటు దొరికింది. అని సంతోషిస్తూ, బట్టీలోకి దూరి హాయిగా నిద్రపోయాడు.



తెల్లవారింది. సన్యాసి నిద్రలేచాడు. ఆ బట్టీ ఒక రాజభవనానికి సమీపంలో ఉంది. మహారాజుగారు నిద్రలేచి తనతో ఉన్నవారిని "రాత్రి ఎలా గడిచింది?" అని అడిగారు. సన్యాసి బట్టీలోపల కూర్చుని, ఎవరో తననే అడిగారనుకొని ''ఆహా! కొంచెం నీకు గడిచినట్టు, కొంచెం నీకంటే బాగాను గడిచింది" అని చెప్పాడు. రాజుగారు ఎవరిదో కొత్తగొంతును విని ఆశ్చర్యపోయారు. మళ్ళీ అలానే ప్రశ్నించారు. అదే సమాధానం వచ్చింది. రాజుగారు సైనికులను పిలిచి ఆ సమాధానం ఎవరు చెప్పారో, వాడిని పట్టి తీసుకురమ్మని ఆజ్ఞాపించారు. వారికి కనుచూపుమేరలో ఎక్కడా మనిషి జాడ అగుపడలేదు. వారు "రాత్రి ఎలా గడిచింది?" అని ప్రశ్నిస్తే, పాత సమాధానమే వస్తోంది. సమాధానం వచ్చిన దిక్కుకుపోగా, అక్కడ ఒక ఇటుకబట్టీ కనబడింది. దాని లోపల ఎవరో ఉండిఉంటారని అనుకొని, లోపలకు పోయిచూడగా, అక్కడ ఒక సన్యాసి కూర్చుని ఉన్నాడు. ఆయనే రాజుగారికి సమాధానం చెప్పిన వ్యక్తి అని నిర్ధారించుకుని, సన్యాసితో– "నిన్ను తీసుకురమ్మని మహారాజు ఆజ్ఞాపించారు" అని చెప్పారు. "నేనేం అపరాధం చేసాను? మీరాజుగారు నన్నెందుకు తీసుకురమ్మన్నారు?" అని అడిగాడు సన్యాసి. సైనికులు – "మీరు ఏదో అపరాధం చేశారని కాదు. మీతో కొంచెం మాట్లాడాలనుకొంటున్నారు" అని వివరించారు.

ఇటుకబట్టీలో నిద్రపోవడం వల్ల సన్యాసి ఒంటినిండా దుమ్ము పేరుకుపోయింది. అక్కడక్కడా మసి అంటుకుంది. అతడు అలానే రాజుగారి దగ్గరకు వెళ్ళాడు. సైనికులు సన్యాసిని మహారాజు ఎదురుగా నిలబెట్టారు. మహారాజు సింహాసనంపై నుండి లేచి, సన్యాసికి నమస్కరించి నా ప్రశ్నకు సమాధానమిచ్చింది మీరేనా? అని అడిగాడు. సన్యాసి – "నాకు ఏదో ప్రశ్న వినబడింది. ఎవరో నన్నే అడిగారనుకొని బదులిచ్చాను . ఆ అడిగినది మీరని నాకు తెలియదు" అన్నాడు.

మహారాజు – "రాత్రి ఎలా గడిచిందని అడిగితే కొంచెం నీకు గడిచినట్టు, కొంచెం నీకంటె మెరుగ్గాను గడిచింది అని బదులిచ్చారు. రాత్రి నాకు గడిచినట్లుగానే, మీకూ ఎలా గడుస్తుంది? నేను సకలసౌకర్యాలు ఉన్న రాజభవనంలో నిద్రించాను. మీరేమో ఇటుకల బట్టీలో పడుకున్నారు. మనిద్దరికీ రాత్రి ఒకేవిధంగా ఎలా గడుస్తుంది" అని ప్రశ్నించారు.

సన్యాసి – "మహారాజా! మీరు రాజభవనంలో మెత్తటిశయ్యపై నిద్రపోయారు. నేను మట్టిలో నిద్రపోయాను. నిద్రపోయాక మీకు రాజభవనం గుర్తులేదు. నేను నిద్రపోయాక, నాకు ఇటుకలబట్టీ గుర్తులేదు. మరి మనిద్దరికీ రాత్రి ఒకలానే గడిచింది కదా" అన్నాడు.

మహారాజు – "మరి నాకన్నా హాయిగా రాత్రి గడిపానన్నారు కదా! అదెలా?" అన్నాడు. సన్యాసి చిరునవ్వు నవ్వుతూ "నిద్ర లేవగానే రాజ్యపాలనకు సంబంధించిన వంద సమస్యలు మిమ్మల్ని చుట్టుముట్టాయి. కాని నాకు ఏచింతా లేదు. అందువల్ల రాత్రి నిశ్చింతగా, సుఖంగా గడిచింది" అని వివరించాడు.

కోరికలు, చింతలు లేని మనిషి నిశ్చింతగా గడుపుతాడు. ఏకోరికలు అక్కరలేనివాడు గొప్పవారికన్నా గొప్పవాడు." "కావాలనే కోరిక విడచి సర్వగతుడైన భగవంతుడిమీద మనస్సు నిలుపు గమ్యం చేరుతావు" "నీవు నిశ్చింతగా కూర్చో అవసరమయినదంతా నేను చేస్తాను" అని అన్నారు శ్రీ శిరిడీసాయినాథుడు. సాయిని దర్శించిన ప్రతిసారి ఏదో ఒకటి అడగకమానము, అనుకొన్నది పొందలేక అసంతృప్తితో జీవితము గడపకమానము, మరి సాయి వాగ్దానాన్ని ఏమి విశ్వసించాము? అయినా సాయి భక్తులమే మనము.

రచన : **"శ్రీ లక్ష్మి"**

## ప్రకృతి ప్రబోధం

ఒక ఆకు రాలుతూ చెప్పింది
ఈ జీవితం శాశ్వతం కాదు అని
ఒక పువ్వు వికసిస్తూ చెప్పింది
జీవించేది ఒక రోజు అయినా గౌరవంగా జీవించమని
ఒక మేఘం వర్షిస్తూ చెప్పింది
తనలాగే మంచిని చేయమని
ఒక మెరుపు మెరుస్తూ చెప్పింది
ఉండేది క్షణమైన ఉజ్వలంగ ఉండమని
ఒక కొవ్వొత్తి కరుగుతూ చెప్పింది
తను కష్టాలలో ఉన్నా ఇతరులకు సుఖాన్ని ఇవ్వమని
ఒక ఏరు జల జల పారుతూ చెప్పింది
తనలాగే కష్ట సుఖాల్లో చలించకుండా సాగమని
ఒక జాబిలి వెలుగుతూ చెప్పింది
తనలాగే జీవితాంతం ఎదుటివారిలో వెలుగును నింపమని

**... సునీత.ఓ**

# ఏరిన ముత్యాలు

### ప్రశాంత జీవనం
బలహీనులు మాత్రమే ప్రతీకారం కోరుతారు
బలవంతులు సహిస్తూ మౌనంగా ఉంటారు
బుద్ధిమంతులు జరిగినవి మర్చిపోయి ప్రశాంతంగా జీవిస్తారు

### మీ వలన
ఎవరైనా నవ్వితే మీ వల్ల నవ్వాలి కాని
మిమ్ముల్ని చూసి నవ్వకూడదు
ఎవరైనా ఏడిస్తే మీ కోసం ఏడవాలి కాని
మీ వల్ల ఏడవకూడదు

### విలువ
సముద్రంలో ఎన్ని నీళ్ళు ఉన్నా
బిందెడు మంచి నీళ్ళకే విలువ ఉంటుంది
అలాగే నీ దగ్గర ఎంత డబ్బు ఉన్నా
నీలో ఉన్న మంచితనానికే విలువ ఎక్కువ ఉంటుంది

### వివేకి
ప్రతి హృదయానికి బాధ ఉంటుంది
కాని అది చూపించే విధానమే వేరుగా ఉంటుంది
అవివేకి కళ్ళలో దాచిపెడితే, వివేకి నవ్వులో దాచిపెడతాడు

### బింబం
నీ ప్రతిబింబం స్పష్టత నీవు చూసే అద్దం మీద
ఆధారపడి ఉంటుంది, నీ భవిష్యత్ స్పష్టత
నీ ఆలోచనా విధానం మీద ఆధారపడి ఉంటుంది

### మనస్సు
నవ్వుకు పెదవులు ఉంటే సరిపోతుంది కాని
ఆనందానికి మనస్సు ఉండాలి

### గొప్పవాడు
సాధించటం వీరుడి లక్షణం
దానిని త్యాగం చేయటం గొప్పవాడి లక్షణం

### ఎక్కువ
ఇష్టంగా చేసే పనులకు విజయం ఎక్కువ
ఎదుటివారిలో మంచిని చూసే మనసుకు ప్రశాంతత ఎక్కువ

### విజయ రహస్యం
భగవంతునిపై ఆధారపడినట్లు ప్రతి పనిని ప్రారంభించు
కాని దానిని నీవు మాత్రమే పూర్తి చేయగలిగినట్లు ముగించు
అతి గొప్ప విజయ రహస్యం ఇదే

### ఆనందం
కోరికలు తీర్చుకోవటం కంటే వాటిని జయించటములోనే
ఎక్కువ ఆనందం ఉంటుంది

### జీవితం
జీవితం అంటే నిన్ను నీవు వెతుక్కోవటం కాదు
నిన్ను నీవు సృష్టించుకోవటం

### నాయకుడు
మార్గాన్ని దాటేవాడు సమర్థుడు
మార్గం చూపేవాడు నాయకుడు

### నాయకత్వం
నాయకత్వం అంటే దారిపొడవునా నడవడం కాదు
బాట వేయటం - త్రోవ చూపటం

### సత్యం
అసత్యంతో సాధించిన విజయం కంటే
సత్యంతో సాధించిన పరాజయమే మేలు
**- మహాత్మాగాంధీ**

### వివేకం
అన్ని విషయాల గురించి తెలుసుకునేలా చేసేది జ్ఞానం
ఎంత వరకు గుర్తుంచుకోవాలో, ఎంత వరకు వదిలివేయాలో
తెలిపేది వివేకం, వివేకం లేని జ్ఞానం వ్యర్థం
**- గౌతమ బుద్ధుడు**

### విజయం
అనవసర విషయాలలో జోక్యం చేసుకొనని వ్యక్తి
ప్రతి విషయంలోను తప్పనిసరిగా విజయం సాధిస్తాడు

### మాటే మంత్రం
ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకోగలిగితే
ఈ ప్రపంచములోని నూటికి తొంబై శాతం సమస్యలు
వాటంతట అవే తగ్గిపోతాయి

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు



మే ౪వ తేదీన మొదటి పెళ్ళిరోజు జరుపుకుంటున్న

**శ్రీ పల్లి పవన్ కుమార్, శ్రీమతి మౌనిక ల**

వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని
అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.



## పెళ్ళిరోజు శుభాకాంక్షలు



మే 5వ తేదీన విజయనగరంలో పెళ్ళిరోజు జరుపుకుంటున్న

**శ్రీ నరసింహ పట్నాయక్, శ్రీమతి స్వర్ణలత ల**

వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని
అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.



## జన్మదిన మరియు పెళ్ళిరోజు శుభాకాంక్షలు



మే 1వ తేదీన **జన్మదినము** జరుపుకుంటున్న

**శ్రీమతి కె. మాలతి** కు మరియు

మే 10 వ తేదీన **పెళ్ళిరోజు** జరుపుకుంటున్న

**శ్రీ కె. కిషోర్ కుమార్, శ్రీమతి కె. మాలతి**

దంపతులకు శ్రీ దత్త సాయి భరద్వాజులు
తమ కృపానుగ్రహములు అందించాలని కోరుతూ
సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది

## హనుమాన్ జయంతి శుభాకాంక్షలతో...




**శ్రీ వి. వెంకటరమణ**

**శ్రీమతి వి. నాగమణి**

**చి॥ జతిన్, చి॥ గగన్**

ఎస్.ఎమ్. పురం గ్రామం, శ్రీకాకుళం జిల్లా.



ఈ 2018 శ్రీరామనవమికి శ్రీ సాయినాధుని ప్రతిష్ఠించి 18 వసంతాలు పూర్తి చేసుకొని 19వ వసంతంలోకి అడుగిడిన సందర్భముగా భక్తులకు, శ్రేయోభిలాషులకు బాబావారి శుభాశీస్సులు కలగాలని సాయినాధుని ప్రార్థిస్తూ...

**శ్రీ శిరిడి సాయిబాబా ధ్యాన మందిరం**

రామాలయం కాంప్లెక్స్, కాశీబుగ్గ-532222.

సెల్ : 9440838741, 9885594987

జై సిద్ధ భైరవి

TAGORE PUBLIC SCHOOL
KNOWLEDGE IS POWER



*Salihundam Ravi Kumar*
Director

గుణ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి

**టాగూర్ స్కూల్**

( ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల )

పి.ఎల్.ఎన్. రాజు కంటి ఆసుపత్రి దరి, గొంటి వీధి, శ్రీకాకుళం.

నర్సరీ నుండి X వరకు ENGLISH MEDIUMలో
Next Education ద్వారా
ఆడియో విజువల్ (AV) విద్యాబోధన

మా ప్రత్యేకతలు :

1. 1వ తరగతి నుండి English Grammar మరియు కంప్యూటర్ విద్య అందించుట.
2. 5వ తరగతి నుండి Study Hours పై ప్రత్యేక శ్రద్ధ.
3. సంస్కృత భాషపై పత్యేక శిక్షణ.
4. డాన్స్, తైక్వాండో మరియు యోగాలలో ప్రత్యేక శిక్షణ.
5. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ.

అడ్మిషన్లు జరుగుచున్నవి

సెల్ : 9848115122, 9441285714

ప్రొ॥ వి. సత్యన్నారాయణ Cell : 9440112816
9246636624



**సాయి తేజ**
**మార్బుల్స్ & టైల్స్**

**VSS Infra**
**BUILDERS & DEVELOPERS**

సరస్వతి థియేటర్ వెనుక,
గొంటివీధి, శ్రీకాకుళం.

226026 (S)
9848770959
9848294796



*K.V. Satyanarayana*
Proprietor

**S.S. జ్యూయలర్స్**
(SHIRIDI SAI)

బంగారం, వెండి నగల వ్యాపారం

రాజా లాడ్జి ఎదురుగా, జి.టి. రోడ్,
శ్రీకాకుళం.

91.6 KDM ఆభరణములు మా ప్రత్యేకత
జాతిరాళ్ళు Testing Certificate తో అమ్మబడును
GOVT. APPROVAL HALLMARK

Printed, Published & Owned by Smt. V.S. LAKSHMI BRAMARAMBA, Address : M/s. Sri BHARADWAJA PUBLICATIONS, Qr.No. 206/A, Sector-8, Ukkunagaram, Visakhapatnam-32 and Printed at **M/s. UNITED POWER ENTERPRISES,** D.No. 8-8-33(9), Opp. Hotel Sudha, Gajuwaka (P.O.), Visakhapatnam-26 and Published at Ukkunagaram, Visakhapatnam-32, Editor : **V.V. POORNA CHANDRA RAO.**